
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం
వెల: ₹ 7.00
సంపుటి: 16
సంచిక: 136
SUNDAY Special
ఆదివారం 6-8-2023
SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'సంపద అట్టడుగు వర్గాలకు చేరితే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'



హ్యాపీ ఫ్రెండ్‌షిప్ డే
- కాలాతీత స్నేహగీతం
- వన్స్‌మోర్ ఫ్రెండ్‌షిప్ డైలాగ్‌లు
- ఫ్రెండూ.. ఇదొక ట్రెండు!
- ఆ నలుగురు స్నేహితులు..

- వివరాలు 13లో



లూనార్ ఆర్బిట్‌లోకి చంద్రయాన్‌-3
ఇస్రో గత నెల 14న ప్రయోగించిన చంద్రయాన్‌-3 మిషన్‌ను శనివారం రాత్రి 7 గంటలకు లూనార్ ఆర్బిట్‌లోకి విజయవంతంగా ప్రవేశపెట్టారు.

- వివరాలు 6లో



టీటీడీ చైర్మన్‌గా భూమన
టీటీడీ ధర్మకర్తల మండలి చైర్మన్‌గా తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డిని ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియమించారు.

- వివరాలు 12లో



ఇమ్రాన్‌ఖాన్ క్లీన్‌బౌల్డ్
పాకిస్తాన్‌లో అవినీతి కేసులో ఇస్లామాబాద్ జిల్లా కోర్టు మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్‌ఖాన్‌ను దోషిగా తేల్చి మూడేళ్ల జైలు శిక్ష విధించింది.

- వివరాలు 6లో



మళ్లీ మణిపూర్‌లో హింస
మణిపూర్‌లో మళ్లీ ఘర్షణలు చెలరేగాయి. ఓ వర్గం వారిపై జరిగిన దాడిలో తండ్రి, కుమారుడు, మరో వ్యక్తి ప్రాణాలు కోల్పోయారు.

- వివరాలు 6లో



ఆర్చరీలో విశ్వ విజేతలు
ప్రపంచ ఆర్చరీ చాంపియన్‌షిప్ కాంపౌండ్ వ్యక్తిగత ఈవెంట్‌లో ఓజస్ ప్రవీణ్, అదితి స్వామి విజేతలుగా నిలిచారు.

- వివరాలు 14లో

ఆర్టీసీ బిల్లుపై లొల్లి!

గవర్నర్ వర్సెస్ సర్కార్ అన్నట్టుగా సాగుతున్న వివాదం

- ప్రభుత్వంలో ఉద్యోగుల విలీనం బిల్లులోని ఐదు అంశాలపై వివరణ కోరిన గవర్నర్
- వాటికి సమాధానాలు పంపిన ప్రభుత్వం
- ఆ సమాధానాలు పరిశీలించాక.. మరిన్ని అంశాలపై స్పష్టత కోరిన తమిళిసై
- ఉద్యోగులపై అజమాయిషీ ఎవరిది?.. ఆస్తుల్ని సర్కారు తీసుకుంటుందా అని ప్రశ్న
- ఉద్యోగుల హక్కులను పరిరక్షించేందుకే వివరాలు కోరుతున్నట్టు వెల్లడి
- శనివారం రాత్రి రెండోసారి వివరణ పంపిన సర్కారు.. నేడు బిల్లుకు గవర్నర్ అనుమతి?



రెండో దఫాలో గవర్నర్ కోరిన వివరణలు
- ఆర్టీసీలో కేంద్రానికి 30శాతం వాటా ఉంది. అలాంటప్పుడు ఆర్టీసీ ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వంలో విలీనం చేసుకోవడంపై కేంద్రం నుంచి సమ్మతి పొందారా?
- ఆర్టీసీ చర, స్థిర ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందా?
- ఆర్టీసీలో శాశ్వత, తాత్కాలిక ఉద్యోగులు మొత్తం ఎంత మంది ఉన్నారు?
- ఉద్యోగులు ప్రభుత్వంలో విలీనమైతే.. వారిపై, బస్సు సర్వీసులపై అజమాయిషీ ఎవరికి ఉంటుంది? కార్పొరేషన్ ఏం చేస్తుంది? ఉద్యోగులను ఆర్టీసీలో డిప్యుటేషన్‌పై నియమిస్తారా? లేక ఏదైనా ఏర్పాటు చేస్తారా?

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసేందుకు ప్రతిపాదించిన 'ఆర్టీసీ చట్ట సవరణ బిల్లు–2023' అంశం మలుపుల మీద మలుపులు తీసుకుంటోంది. గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, రాష్ట్ర ప్రభుత్వం మధ్య సాగుతున్న ఉత్తర, ప్రత్యుత్తరాలు, ప్రశ్నలు, సమాధానాలు, వివరణలు.. రాష్ట్ర రాజకీయాలను వేడెక్కిస్తున్నాయి. శుక్రవారం గవర్నర్ తమిళిసై ఆర్టీసీ బిల్లుపై ఐదు ప్రధాన సందేహాలను లేవనెత్తుతూ, రాష్ట్ర ప్రభుత్వం నుంచి వివరణలు కోరారు. ప్రభుత్వం తరఫున రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆయా అంశాలపై వివరణలు ఇస్తూ గవర్నర్ కార్యదర్శికి శనివారం లేఖ పంపారు. కానీ ఈ వివరణలతో

మిగతా 2వ పేజీలో ▶



శనివారం రాజ్‌భవన్‌ను ముట్టడించిన ఆర్టీసీ కార్మికులు ▲

కార్మికులకు అండగా ఉన్నా..
- ఆర్టీసీ సంస్థ, ఉద్యోగుల ప్రయోజనాలను పరిరక్షించడమే నా ఉద్దేశం: గవర్నర్ తమిళిసై

3లో



అసెంబ్లీలో మోదీ క్లిప్పింగ్ చూపిస్తూ మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

ఇంతకంటే అభివృద్ధా?.. నిరూపిస్తే రాజీనామా

కాంగ్రెస్, బీజేపీ నేతలకు కేటీఆర్ సవాల్

తెలంగాణలో సంక్షేమమే తప్ప సంక్షోభం లేదు

- నేను చెప్పే అభివృద్ధి లెక్కలు తప్పు అయితే వచ్చే ఎన్నికల్లో ఓడించండి
- కాంగ్రెస్‌లో నలుగురు కలిసి మాట్లాడలేరు.. నాలుగు కోట్ల ప్రజలను ఏలుతారా?
- సోనియా బలిదేవత అని రేవంత్‌రెడ్డి అభివర్ణించిన విషయం మరిచారా?
- ఓఆర్ఆర్ లీజు విషయంలో తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపాటు

2లో



మీడియాతో మాట్లాడుతున్న కేసీ వేణుగోపాల్. చిత్రంలో రేవంత్, ఠాక్రే, ఉత్తమ్, మధుయాష్కీ

ఎన్నికల వేళ ఇదేం గోల?

అధికారంలోకి వస్తే మంత్రులు, సీఎంలయ్యేది మీరే... మేం కాదు

కర్ణాటక నేతలను ఆదర్శంగా తీసుకోండి.. విభేదాలను పక్కన పెట్టండి

- 100 రోజులపాటు మనస్పర్థలు మర్చిపోండి.. నిరంతరం జనంలోనే ఉండండి
- తెలంగాణ కాంగ్రెస్ నేతలకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్ క్లాస్
- అయినప్పటికీ ఆయన సమక్షంలోనే ఉత్తమ్, రేవంత్‌ల సంవాదం!

8లో

కచ్చితంగా గెలిచేవి	41
కష్టపడితే గెలిచేవి	42
గెలుపు కష్టమైనవి	36

- నియోజకవర్గాలవారీగా రాష్ట్రంలో కాంగ్రెస్ పరిస్థితిపై పార్టీ వ్యూహకర్త నివేదిక
- పార్టీ సంస్థాగత వ్యవహారాల ఇన్‌చార్జి వేణుగోపాల్‌కు అందజేసిన సునీల్ కనుగోలు

పక్కా 'ఎల్లో' స్కెచ్..
- 'పచ్చ' నేతల కనుసన్నల్లోనే పుంగనూరు విధ్వంసకాండ
- పోలీసులపై దాడికి టీడీపీ ప్రత్యేకంగా వ్యూహరచన
- పంట పొలాల్లోకి ముందుగానే రాళ్లు, మద్యం బాటిళ్లు.. వాహనాలు తగలబెట్టేందుకు పెట్రోలు కూడా సిద్ధం

12లో



క్లుప్తంగా...

4 బిల్లులకు కౌన్సిల్ మరోసారి ఆమోదం

సాక్షి, హైదరాబాద్: గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ తిరస్కరించిన నాలుగు బిల్లులకు శనివారం శాసనమండలి మళ్లీ ఆమోదం తెలిపింది. గతంలోనే పురపాలక శాసనచట్టం (సవరణబిల్లు), ప్రభుత్వ ఉద్యోగ (పదవీ విరమణ వయసు క్రమబద్ధీకరణ) బిల్లు, రాష్ట్ర ప్రైవేట్ విశ్వవిద్యాలయాల (స్థాపన, క్రమబద్ధీకరణ) సవరణ బిల్లు, పంచాయతీరాజ్ చట్ట (సవరణ) బిల్లులకు కౌన్సిల్ ఆమోదం తెలిపినా ఆయా అంశాలపై అభ్యంతరాలు తెలుపుతూ గవర్నర్ వాటిని తిప్పి పంపించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం శాసనసభ వీటికి మరోసారి ఆమోదం తెలపగా వాటిని శనివారం శాసనమండలిలో మళ్లీ ప్రవేశపెట్టాక చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అవి కౌన్సిల్ ఆమోదం పొందాయని ప్రకటించారు. ఈ బిల్లుల్లో మున్సిపల్ చట్టసవరణ బిల్లును మంత్రి కేటీఆర్ తరపున ఆర్థికమంత్రి టి.హరీశ్‌రావు, పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్ (రెగ్యులేషన్) బిల్లును మంత్రి టి.హరీశ్‌రావు, ప్రైవేట్ యూనివర్సిటీస్ (ఎస్టాబ్లిష్‌మెంట్) బిల్లును విద్యాశాఖమంత్రి సబితా ఇంద్రారెడ్డి, పంచాయతీరాజ్ (సవరణ) బిల్లును పీఆర్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రవేశపెట్టారు.

గవర్నర్ అందుబాటులో లేకున్నా.. ప్రభుత్వం హడావుడి

బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్



సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ కార్మికులను బలవంతంగా రాజ్‌భవన్ ముందు ధర్నాకు తీసుకొచ్చారని, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే బిల్లు విషయంలో గవర్నర్‌పై బట్టకాల్చి మీదేసినట్లు ప్రభుత్వం వ్యవహరిస్తోందని బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఆరోపించారు. శనివారం ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ, 'ఏ బిల్లు అయినా గవర్నర్ చూడాలి, చదవాలి, ఆ తర్వాత సంతకం చేస్తారు. మరో వైపు గవర్నర్ అందుబాటులో లేకున్నా ప్రభుత్వం హడావుడి చేస్తోంది'అని ధ్వజమెత్తారు. ఆర్టీసీని బ్రహ్మదేవుడు కూడా కాపాడలేరు అని చెప్పిన కేసీఆర్.. ఇప్పుడు ఆ సంస్థ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడాన్ని బీజేపీ స్వాగతిస్తోందన్నారు. అయితే ఆర్టీసీ కార్మికులు ప్రభుత్వాన్ని నమ్మే పరిస్థితిలేదని పేర్కొన్నారు. బీఏసీ సమావేశానికి తమని పిలవలేదని, మాట్లాడదామంటే కనీసం స్పీకర్ తమ వైపు చూసే అవకాశం లేదని ఆరోపించారు. తమకు అవకాశం ఇవ్వకుండా ఒక రోజు మంత్రి హరీశ్‌రావు, మరో రోజు కేటీఆర్ దాడి చేశారని, తర్వాత కేసీఆర్ దాడి చేస్తారని విమర్శించారు.

ఐటీ సెక్టార్‌లో తెలంగాణ వాటా ఎంత..?

కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఐటీ సెక్టార్‌లో తెలంగాణ వాటా ఎంతో ఐటీశాఖ మంత్రి కేటీఆర్ చెప్పాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో యువతకు ప్రాధాన్యత లేకుండా స్థానికేతరులు లాభం పొందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరో వైపు ప్రభుత్వ ఆస్తులు అమ్మేస్తున్నారని, ఉమ్మడి రాష్ట్రంలో పాలకులు చేసిన పనే మీరు చేస్తున్నారని జీవన్‌రెడ్డి మండిపడ్డారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యను రాజకీయం చేయొద్దు

ఎమ్మెల్సీ పి.కౌశిక్‌రెడ్డి

సాక్షి, మేడ్చల్ జిల్లా: ఆర్టీసీ కార్మికులను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ మంచి నిర్ణయం తీసుకున్నారని ఎమ్మెల్సీ పి.కౌశిక్‌రెడ్డి అన్నారు. శనివారం మండలి మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ 43 వేల మంది ఆర్టీసీ కార్మికుల సమస్యను గవర్నర్ రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ డైరెక్షన్‌లో గవర్నర్ పని చేస్తున్నారని విమర్శించారు.ఆర్టీసీ కార్మికుల బిల్లును గవర్నర్ ఆపడం సబబుకాదని, ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడాన్ని బీజేపీ నాయకులు స్వాగతిస్తున్నారా లేదా అనే విషయాన్ని చెప్పాల్సిన అవసరముందన్నారు.

ఇంతకంటే అభివృద్ధా?.. రుజువు చేస్తే రాజీనామా చేస్తా..

కాంగ్రెస్, బీజేపీ నేతలకు మంత్రి కేటీఆర్ సవాల్

- తెలంగాణలో సంక్షేమమే తప్ప సంక్షోభం లేదు
- నేను చెప్పే అభివృద్ధి లెక్కలు తప్పు అయితే వచ్చే ఎన్నికల్లో ఓడించండి
- కాంగ్రెస్‌లో నలుగురు కలిసి మాట్లాడలేరు.. నాలుగు కోట్ల ప్రజలను ఏలుతారా?



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి కంటే బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో మెరుగైన అభివృద్ధి జరుగుతున్నట్టు నిరూపిస్తే తక్షణమే తన మంత్రి పదవికి రాజీనామా చేస్తానని పురపాలక, ఐటీశాఖల మంత్రి కె. తారక రామారావు సవాల్ చేశారు. ఔటర్ రింగ్‌రోడ్డు లీజులో అవినీతి జరిగిందంటూ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తప్పుడు ఆరోపణలు చేశారని మండిపడ్డారు. శాసనసభ వానాకాల సమావేశాల్లో భాగంగా శనివారం 'రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పన, పల్లె ప్రగతి– పట్టణ ప్రగతి కోసం ప్రభుత్వం తీసుకున్న చర్యలు– సాధించిన ఫలితాలు'అంశంపై లఘు చర్చ జరిగింది. ఈ సందర్భంగా పలువురు సభ్యులు లేవనెత్తిన అంశాలపై కేటీఆర్ సుదీర్ఘంగా వివరణ ఇచ్చారు. తాను చెబుతున్నవి తప్పు అయితే వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ఓడించాలని, లేదంటే కాంగ్రెస్‌కు డిపాజిట్లు రాకుండా ఓడించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ, రేవంత్‌రెడ్డిలపై ఘాటుగా విమర్శలు చేశారు. కేటీఆర్ ప్రసంగంలోని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

తెలంగాణలో ఉన్నదంతా సంక్షేమమే..

"రాష్ట్ర బడ్జెట్ అంటే విపక్షాలకు జమాఖర్చుల లెక్క మాత్రమే. బీఆర్‌ఎస్‌కు ఇది రాష్ట్ర ప్రజల జీవనరేఖ. తెలంగాణ నమూనా అంటే సమగ్ర, సమ్మిళిత అభివృద్ధి. ఇక్కడ సంక్షేమమే తప్ప సంక్షోభం లేదు. దేశంలో ఇంటింటికీ మంచినీళ్లు ఇచ్చిన మొదటి రాష్ట్రం తెలంగాణ. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు తెలంగాణలో ఉంది. వరి ఉత్పత్తిలో, తలసరి ఆదాయంలో దేశంలో టాప్. 24 గంటల ఉచిత విద్యుత్, ఎకరానికి రూ.10 వేల పెట్టుబడి, రైతులకు జీవితబీమా ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ. ఐటీ ఉద్యోగాలు అత్యధికంగా కల్పించిన రాష్ట్రం తెలంగాణ. ఇది మా పనితనం. ప్రతిపక్ష నేతల్లా మేం ఊక దంపుడు ఉపన్యాసాలు చెప్పం. భట్టి విక్రమార్క, రఘునందన్‌రావులకు సవాల్ చేస్తున్నా. నేను చెప్పింది తప్పయితే.. కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో తెలంగాణ కంటే మెరుగ్గా అభివృద్ధి ఉందని రుజువు చేస్తే.. రేపు పొద్దున్నే నా మంత్రి పదవికి రాజీనామా చేస్తా..



తెలంగాణ ఎవరో ఇస్తే వచ్చింది కాదు

తెలంగాణ ఇచ్చింది మేమేనని కాంగ్రెస్ వాళ్లు అంటున్నారు. కంటెంట్ లేని కాంగ్రెస్‌కు, కమిట్‌మెంట్ ఉన్న కేసీఆర్‌కు పోలికనా? 1968లో 370 మంది ఉద్యమకారులను కాల్చి చంపిందెవరు? 1971లో 11 మంది ఎంపీలను గెలిపించినా వారి ఆశయాలను తుంగలో తొక్కి కాంగ్రెస్‌లో కలిసిపోయింది వాస్తవం కాదా? 2004లో మాటిచ్చి 2014 దాకా 1000 మందిని చంపింది కాంగ్రెస్ వారు కాదా? ఇవాళ మళ్లీ సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారు. వెయ్యి మందిని పొట్టన పెట్టుకున్న బలిదేవత సోనియా అని రేవంత్‌రెడ్డి అన్నమాటలు మరిచిపోయారా? కర్ణాటకలో గెలిచారని తెలంగాణలో కాంగ్రెస్ నేతలు కలలు కంటున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ఎప్పుడో విశ్వసనీయత కోల్పోయింది. నలుగురు నాయకులు కలసి కూర్చుని మాట్లాడలేని వాళ్లు.. 4 కోట్ల మందిని పాలిస్తారంటే నమ్మాలా? కాంగ్రెస్‌కు నాయకుల్లేక పక్క పార్టీల నుంచి నాయకులను తెచ్చుకున్నారు. మేం ప్రధాని మోదీకే భయపడలేదు. ఇక్కడ వీళ్లకు భయపడతామా?

ప్రజలతో బీఆర్‌ఎస్‌ది పేగు బంధం

తెలంగాణ కవి అలిశెట్టి ప్రభాకర్ తన కవితలో "జాగ్రత్త.. ప్రతి ఓటు మీ పచ్చి నెత్తుటి మాంసపు ముద్ద.. చూస్తూ చూస్తూ వేయకు గద్దకు. ఓటు కేవలం కాగితం మీద గుర్తు కాదు.. మీ జీవితం.." అని చెప్పారు. ప్రజలు తప్పుడు నిర్ణయం తీసుకుంటే గందరగోళంలో పడతారు. తెలంగాణ ప్రజలతో బీఆర్‌ఎస్‌ది పేగుబంధం. తుచ్ఛ రాజకీయాలు చేయాల్సిన అవసరం లేదు. కాంగ్రెస్ ఐదు దశాబ్దాల పాలనను, నాటి అంధకారాన్ని గుర్తుకు తెచ్చుకోండి.."అని కేటీఆర్ పేర్కొన్నారు.

నోటికి వచ్చినట్టు మాట్లాడితే అంతు చూస్తాం!

ఔటర్ రింగ్ రోడ్డు టోల్ ప్రాజెక్టు (టీవోటీ)ను ఐఆర్‌బీ సంస్థకు కట్టబెట్టడాన్ని తప్పుపడుతూ సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలపై మంత్రి కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. "ఒకాయన (రేవంత్‌రెడ్డి) బయట ఉండి నోటికి వచ్చినట్టు మాట్లాడారు. ఆ ప్రభావం భట్టి మీద పడినట్టు ఉంది. ఐఆర్‌బీ సంస్థ దివాలా తీసిందంటూ ఏదేదో మాట్లాడారు. కాంగ్రెస్ పాలిత రాజస్థాన్, కర్ణాటకలలోనూ పలు టోల్స్ నిర్వహణ కాంట్రాక్టులను ఆ సంస్థ పొందింది. మహారాష్ట్రలో కూడా ఇచ్చారు. ఇక్కడ కూడా జాతీయ రహదారుల సంస్థ నిబంధనలకు అనుగుణంగా టెండర్ నిర్వహించి లీజుకు ఇవ్వడం జరిగింది. ఆయన (రేవంత్) ఎందుకు ఈ సంస్థ గురించి మాట్లాడారో, దానికి కారణమేంటో మాకు తెలుసు. ఆర్‌టీఐ (సమాచార హక్కు) అంటే కొందరికి 'రూట్ టు ఇన్‌కం'గా మారిపోయింది. రేవంత్‌రెడ్డి చేసిన ఆరోపణలపై ఐఆర్‌బీ సంస్థ వెయ్యికోట్ల పరువు నష్టం దావా వేసింది. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ కూడా కేసు పెట్టారు. రేవంత్ అంతు చూస్తాం"అని కేటీఆర్ పేర్కొన్నారు.

ఎర్రగడ్డలో.. హైదరాబాద్‌ను కట్టింది నేనే!

టీడీపీ అధినేత చంద్రబాబుపై పరోక్షంగా కేటీఆర్ సెటైర్లు

శాసన సభలో లఘుచర్చ సందర్భంగా ఉమ్మడి ఏపీ మాజీ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబుకు మంత్రి కేటీఆర్ పరోక్షంగా చురకలు వేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే తెలంగాణ అభివృద్ధి జరిగిందంటూ ఆ పార్టీ నాయకులు చేసిన కామెంట్లపై కేటీఆర్ స్పందిస్తూ.. "గతంలో ఓ పెద్ద మనిషి (చంద్రబాబు) ఇలాగే అన్నీ తానే చేశానని చెప్పుకునేవాడు. అట్లానే ఈ మధ్య ఆయన ఎర్రగడ్డ ఆస్పత్రికి వెళ్లాడు. అక్కడున్న పేషెంట్లను పలకరించాడు. నేనెవరో తెలుసా? అని ఓ పేషెంట్‌ను అడిగితే.. తనకు తెలియదని బదులిచ్చాడు. దీంతో ఆ పెద్దమనిషి.. 'నేను తెలియదా.. ఈ హైదరాబాద్ కట్టింది నేనే..' అని చెప్పాడు. అప్పుడా పేషెంట్ బదులిస్తూ.. 'అవునా విశాఖపట్నం పక్కన సముద్రాన్ని నేనే ఏర్పాటు చేశా అని నేను చెప్పినా వినకుండా నన్ను ఇక్కడికి తీసుకొచ్చారు..' అని బదులిచ్చాడు.. మీరు చెప్తున్నదీ అలాగే ఉంది'' అని ఎద్దేవా చేశారు.

రాజశేఖరరెడ్డి కాంగ్రెస్ ఏపీకి వెళ్లిపోయింది!

ఇక గతంలో కాంగ్రెస్ ముఖ్యమంత్రులలో బాగా పనిచేసిన వాళ్లు ఉన్నారని.. మంచి ఉంటే తామే చెప్తామని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ తెచ్చారన్న విషయాన్ని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు స్వయంగా అసెంబ్లీలో చెప్పారని ఆయన గుర్తుచేశారు. వైఎస్ రాజశేఖరరెడ్డి కాంగ్రెస్ ఏపీకి వెళ్లిపోయిందని.. తెలంగాణ కాంగ్రెస్‌లో వేరే పార్టీ నుంచి వచ్చిన నాయకులు అధ్యక్షులు అయ్యారని వ్యాఖ్యానించారు.

కోనరావుపేటనా.. కోనసీమనా?

ఇటీవల దర్శకుడు వెల్దంటి వేణు బలగం సినిమాను సిరిసిల్ల జిల్లాలోని కోనరావుపేట గ్రామంలో తీశారు. ఆ సినిమా చూసి మా కుటుంబసభ్యులే ఇది కోనరావుపేటనా? కోనసీమనా? అని ఆశ్చర్యపోయారు. తెలంగాణలోని ఏ పల్లెకు వెళ్లినా ఇప్పుడు ఇదే పరిస్థితి. రివర్స్ మైగ్రేషన్ చూస్తున్నాం ఇప్పుడు. హైదరాబాద్ అభివృద్ధిని, భూముల విలువను పొరుగు రాష్ట్ర నేతలు గుర్తించారు. వారికి అర్థమైన విషయాలు విపక్షాలకు అర్థం కావట్లేదు.

మణిపూర్ ఘటనలు 'ప్రభుత్వ ప్రాయోజిత హింస'

శాసనమండలిలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధ్వజం



సాక్షి, హైదరాబాద్: మణిపూర్‌లో చోటుచేసుకున్న ఘటనలు 'ప్రభుత్వ ప్రాయోజిత హింస'గా బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. బీజేపీ విభజించు.. పాలించు సిద్ధాంతాన్ని అవలంబిస్తూ ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తోందని ధ్వజమెత్తారు. శనివారం శాసనమండలిలో 'రాష్ట్రంలో గిరిజన సంక్షేమం–పోడుపట్టాల పంపిణీ'పై లఘుచర్చలోకవిత మాట్లాడుతూ మణిపూర్‌లో రెండు గిరిజన తెగల మధ్య గొడవ పెట్టి ప్రభుత్వ యంత్రాంగం చోద్యం చూస్తోందని ఆరోపించారు. అన్ని జాతులు బాగుపడాలని తెలంగాణ కోరుకుంటుంటే.... విభజించి ఓట్లు దండుకోవాలన్న ప్రయత్నం కేంద్రంలో కనిపిస్తోందని మండిపడ్డారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర సర్కార్ పూర్తిగా గిరిజన హక్కులను హరిస్తోందని విమర్శించారు. తెలంగాణలో అమలు చేసిన వాటిని కేంద్రం అనుకరిస్తోందని కవిత వ్యాఖ్యానించారు. గిరిజనులకు కేటాయించిన నిధులను వంద శాతం వినియోగించేలా రాష్ట్ర ప్రభుత్వం వ్యవస్థను రూపొందిస్తోందని తెలిపారు.

త్వరలోనే పూర్తిస్థాయిలో దళితబంధు అమలు: కొప్పుల

సాక్షి, హైదరాబాద్: త్వరలోనే దళితబంధు పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేస్తామని, ఇది 9 ఏళ్ల పాటు అమలైతే 17 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని మంత్రి కొప్పుల ఈశ్వర్ శాసనమండలి ప్రశ్నోత్తరాల్లో తెలిపారు. లబ్ధిదారులకు వాహనాలు, ఇతరత్రా ఆస్తుల కొనుగోలు సందర్భంగా జీఎస్టీ నుంచి మినహాయింపునివ్వాలని కేంద్రాన్ని కోరతామన్నారు. ఒక అసెంబ్లీ నియోజకవర్గంలో 11 వేల మంది చొప్పున ఎస్సీ కార్పొరేషన్ ద్వారా పూర్తి పారదర్శకంగా విడతలవారీగా రూ.10 లక్షల అందించే చర్యలు చేపడుతున్నామన్నారు.

గొర్రెల పంపిణీలో అక్రమాలు లేకుండా చర్యలు: తలసాని

సాక్షి, హైదరాబాద్: గొర్రెల పంపిణీలో అక్రమాలు, రీసైక్లింగ్ వంటివి జరగకుండా జిల్లా కలెక్టర్లు, అధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చినట్లు పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మండలి ప్రశ్నోత్తరాల్లో పేర్కొన్నారు. ముగ్గురు నుంచి ఆరుగురు అధికారులు, ప్రజాప్రతినిధులు దీనిని పర్యవేక్షించేలా, జియో ట్యాగింగ్ తదితర రూపాల్లో సాంకేతిక జాగ్రత్తలు కూడా తీసుకుంటున్నట్లు తెలియజేశారు. ప్రత్యేకంగా జీవాల కోసమే 1962 నంబర్‌తో 100 అంబులెన్స్‌లు ఏర్పాటు చేశామన్నారు.

ఆర్టీసీ బిల్లుపై లొల్లి!

▶ మొదటి పేజీ తరువాయి

గవర్నర్ సంతృప్తి చెందకపోవడం, పలు అంశాలపై పూర్తిస్థాయి స్పష్టత కోరడం, ఇదే సమయంలో ఆర్టీసీ ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపి.. వారి ప్రయోజనం కోసమే తాను ప్రయత్నిస్తున్నట్టు చెప్పడం వంటివి చర్చనీయాంశంగా మారాయి. ప్రభుత్వం సంతృప్తికరమైన సమాధానాలు ఇస్తే.. రెండు గంటల్లోనే బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టడానికి అనుమతిస్తానని గవర్నర్ పేర్కొన్నట్టు తెలిసింది. గవర్నర్ ఆదివారం ఉదయానికల్లా ఆర్టీసీ బిల్లుకు అనుమతిస్తే.. అసెంబ్లీ సమావేశాల చివరి రోజున సభలో ప్రవేశపెట్టి ఆమోదింపజేసుకునే అవకాశాలు ఉన్నాయి.

రాజుకుంటున్న రాజకీయాలు

రాష్ట్ర ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనంపై గత నెల 31న సీఎం కేసీఆర్ అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే బిల్లును ఆమోదించేలా ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసుకుంది. అయితే ఆర్టీసీ బిల్లు ఆర్థిక సంబంధిత అంశాలతో ముడిపడి ఉండటంతో, అసెంబ్లీలో ప్రవేశపెట్టడానికి గవర్నర్ అనుమతి కోసం ఈనెల 2న రాజ్‌భవన్‌కు పంపించింది. గవర్నర్ ఆ బిల్లును పరిశీలించి.. పలు సందేహాలు వ్యక్తం చేస్తూ, ప్రభుత్వం నుంచి వివరణ కోరారు. దీంతో ఆర్టీసీ ఉద్యోగులు, ప్రభుత్వంలో అలజడి మొదలైంది. గవర్నర్ కావాలనే బిల్లును ఆపారంటూ బీఆర్‌ఎస్ నుంచి రాజకీయ విమర్శలు వచ్చాయి. దీంతో కనీసం బిల్లును చదవనీయకుండా గవర్నర్‌పై ఒత్తిడి తీసుకొస్తున్నారంటూ బీజేపీ నేతలు ప్రతివిమర్శలకు దిగారు. మరోవైపు బిల్లుకు అనుమతి ఇవ్వాలంటూ ఆర్టీసీ కార్మికులు రాజ్‌భవన్‌ను ముట్టడించగా.. కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని, వారి ప్రయోజనాల కోసమే ప్రభుత్వం నుంచి వివరణలు కోరానని గవర్నర్ తమిళిసై ప్రకటించారు. శనివారం రాత్రి తర్వాత కూడా ఈ సంక్షోభం కొనసాగుతూనే ఉంది.

తొలుత గవర్నర్ కోరిన వివరణలు, ప్రభుత్వమిచ్చిన సమాధానాలు ఇవీ..

గవర్నర్: **1958 నుంచి ఆర్టీసీలో కేంద్ర గ్రాంట్లు, వాటాలు, రుణాలు, ఇతర సాయం గురించి బిల్లులో ఎలాంటి వివరాలు లేవు.**

ప్రభుత్వం: సమైక్య రాష్ట్రంలో ఏపీఎస్ ఆర్టీసీలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పెట్టుబడి వాటాలు రూ.61.07 కోట్లు, రూ.140.20 కోట్లుగా ఉన్నాయి. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసేందుకే ఈ బిల్లు పరిమితం. ఉద్యోగులు ప్రభుత్వంలో విలీనమైన తర్వాత ఇతర అన్ని విషయాల్లో ఆర్టీసీ సంస్థ ప్రస్తుత స్వరూపం, రీతిలో యథాతథంగా పనిచేస్తుంది. వాటాలు, రుణాలు, గ్రాంట్లు, కేంద్ర ప్రభుత్వం నుంచి సహాయాలు, ఇతర అంశాల నిర్వహణ విషయంలో, ఆర్టీసీ చట్టం–1950 కింద అపెక్స్ బాడీగా ఆర్టీసీ బోర్డు కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో వీటికి సంబంధించిన అంశాలను బిల్లులో పొందుపర్చాల్సిన అవసరం లేదు.

గవర్నర్: **రాష్ట్ర విభజన చట్టం షెడ్యూల్ ఐగీ ప్రకారం ఆర్టీసీ స్థితిని మార్చడంపై సమగ్ర వివరాలు బిల్లులో లేవు.**

ప్రభుత్వం: ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసినా.. సంస్థ ప్రస్తుత స్వరూపంలోనే కొనసాగుతుంది. రాష్ట్ర విభజన సమస్యలు పరిష్కారమయ్యే వరకు సంస్థ స్వరూపం మారదు. విభజన అంశం కేంద్రం పరిశీలనలో ఉంది. పూర్తయ్యే వరకు ఇదే విధానం కొనసాగుతుంది.

గవర్నర్: **ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పరిగణిస్తామని ప్రభుత్వం చెప్తోంది. మరి వారి సమస్యలకు పారిశ్రామిక వివాదాల చట్టం, కార్మిక చట్టాలు వర్తిస్తాయా?**

ప్రభుత్వం: ఆర్టీసీ ఉద్యోగులు ప్రభుత్వంలో విలీనమయ్యాక.. వారికి పారిశ్రామిక వివాదాల చట్టం వర్తింపు అంశం అందులోని నిబంధనలకు లోబడి ఉంటుంది. ఈ విషయంలో బిల్లులో ఎలాంటి నిబంధనలు పొందుపర్చాల్సిన అవసరం లేదు. ప్రస్తుత ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తేనే వారికి అత్యుత్తమ ప్రయోజనాలు లభిస్తాయి.

గవర్నర్: **ఆర్టీసీ ఉద్యోగులందరికీ ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పెన్షన్ ఇస్తారా? ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అన్ని ప్రయోజనాలు ఇవ్వడానికి సంబంధించి స్పష్టమైన వివరాలు ఇవ్వండి.**

ప్రభుత్వం: ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్ నిబంధనలు, ఇతర ప్రయోజనాల నిబంధనలను ఆర్టీసీ ఉద్యోగులకు వర్తింపజేసే విషయంలో బిల్లులో ఎలాంటి అస్పష్టత లేదు. ఉద్యోగుల ప్రయోజనాల దృష్ట్యా.. అలాంటి నిబంధనలను రూపొందించి, ప్రకటించే అధికారాలను బిల్లులోని 4, 5 సెక్షన్లు రాష్ట్ర ప్రభుత్వానికి కల్పిస్తున్నాయి. ఈ విషయంలో ప్రభుత్వం అన్ని భాగస్వామ్యపక్షాలతో విస్తృత చర్చలు జరిపి ఓ అభిప్రాయానికి వస్తుంది. అప్పటిదాకా ఆర్టీసీ ఉద్యోగులకు ప్రస్తుత ఆర్టీసీ నియమ, నిబంధనలే వర్తిస్తాయి.

గవర్నర్: **ప్రభుత్వ ఉద్యోగుల్లో కండక్టర్, కంట్రోలర్ వంటి పోస్టులు లేవు. మరి ప్రమోషన్లు, కేడర్ నార్మలైజేషన్ అంశాల్లో ఆర్టీసీ ఉద్యోగులకు జరిగే న్యాయం, ఇతర ప్రయోజనాలపై స్పష్టమైన వివరాలు ఇవ్వండి.**

ప్రభుత్వం: ఇలాంటి అంశాలపై నిర్ణయం తీసుకోవడానికి అవసరమైన నిబంధనలు బిల్లులోని సెక్షన్ 4, 5లలో పొందుపరిచాం. జీతాలు, అలవెన్సుల విషయంలో ఏ ఉద్యోగినీ ఇబ్బందిపెట్టం. విలీనం తర్వాత ఆర్టీసీలోని ప్రస్తుత కేటగిరీలు, కేడర్ల కొనసాగింపునకు ఎలాంటి అడ్డంకులు లేవు. ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడాన్ని నిషేధించే.. 'తెలంగాణ ప్రొహిబిషన్ ఆఫ్ ఎంప్లాయీస్ ఆఫ్ స్టేట్ గవర్నమెంట్ పబ్లిక్ సెక్టార్ అండర్‌టేకింగ్స్ ఇన్‌టూ పబ్లిక్ సర్వీస్ యాక్ట్ 1997' నుంచి మినహాయింపు కల్పించడం కోసమే ఈ బిల్లును తెచ్చాం.

మరిన్ని వివరణలు కావాలన్న గవర్నర్

గవర్నర్ తమిళిసై లేవనెత్తిన సందేహాలపై రాష్ట్ర ప్రభుత్వం తొలుత సమాధానం ఇచ్చినా.. ఆయా అంశాల్లో మరింత స్పష్టత, అదనపు వివరణలు కావాలని గవర్నర్ ప్రభుత్వాన్ని కోరారని రాజ్‌భవన్ ప్రకటించింది. ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలన్న దీర్ఘకాలిక డిమాండ్‌కు అడ్డంకులు సృష్టించడం తమ ఉద్దేశం కాదని.. వారి సర్వహక్కులను పరిరక్షించడానికే వివరాలు కోరాల్సి వస్తోందని స్పష్టం చేసింది. ఆర్టీసీ ఉద్యోగుల సర్వీసు నిబంధనల విషయంలో భవిష్యత్తులో నోటిఫికేషన్ జారీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం సమాధానమిచ్చిన నేపథ్యంలో.. భవిష్యత్తులో ఎలాంటి న్యాయపర చిక్కులు రాకుండా, ఉద్యోగుల విలీన ప్రక్రియ సజావుగా జరిగేలా గవర్నర్ ప్రయత్నిస్తున్నారని వెల్లడించింది. భవిష్యత్తులో ఇలాంటి అంశాలను ప్రతిపాదిత బిల్లు పరిష్కరించగలదా? అన్న అనుమానాలు ఉన్నాయని పేర్కొంది. ఈ క్రమంలో కింది వివరణలను ప్రభుత్వం నుంచి కోరినట్టు తెలిపింది.

- కేంద్ర ప్రభుత్వం ఆర్టీసీలో 30 శాతం వాటా కలిగి ఉందని రాష్ట్ర ప్రభుత్వం వివరణలో పేర్కొంది. ఈ మేరకు కేంద్రం నుంచి సమ్మతి తీసుకున్నారా? సమ్మతి పొంది ఉంటే అందుకు సంబంధించిన ప్రతిని అందజేయాలి. లేనిపక్షంలో న్యాయపరమైన చిక్కులు రాకుండా తీసుకున్న జాగ్రత్తలను తెలపాలి.
- డిపోల వారీగా అన్ని కేటగిరీల శాశ్వత ఉద్యోగుల సంఖ్య ఎంత? డిపోల వారీగా అన్ని కేటగిరీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, క్యాజువల్, ఇతర తాత్కాలిక ఉద్యోగుల సంఖ్య ఎంత? తాత్కాలిక ఉద్యోగుల విషయంలో అవలంభించనున్న విధానం ఏమిటి?
- ఇకపైనా ఆర్టీసీ సంస్థ ప్రస్తుత స్వరూపంలోనే కొనసాగుతుందని ప్రభుత్వం వివరణ ఇచ్చిన నేపథ్యంలో.. సంస్థ చర, స్థిరాస్తులు సంస్థతోనే కొనసాగుతాయా? రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందా? ముఖ్యంగా భవనాలు, భూములు ఎవరి వద్ద ఉంటాయి?
- బస్సు సర్వీసుల నిర్వహణ విషయంలో అజమాయిషీ, బాధ్యత ఎవరిది? ఉద్యోగులు ప్రభుత్వంలో విలీనం అవుతున్నందున వారి విధులను నియంత్రించే బాధ్యత ఎవరిది? ఉద్యోగులు, ప్రయాణికులను దృష్టిలో పెట్టుకుని ఈ విషయంలో కార్పొరేషన్ బాధ్యత ఏమిటి?
- ఉద్యోగులు ప్రభుత్వంలో విలీనమైన తర్వాత ఆర్టీసీలో డిప్యుటేషన్‌పై కొనసాగుతారా? అలాంటి ఇతర ఏర్పాట్లు ఏమైనా చేస్తారా?

రెండోసారి వివరణ పంపిన సర్కారు

నేడు బిల్లుకు గవర్నర్ అనుమతి ఇచ్చే అవకాశం

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ చట్ట సవరణ బిల్లుపై గవర్నర్ రెండోసారి లేవనెత్తిన సందేహాలపై రాష్ట్ర ప్రభుత్వం శనివారం రాత్రి వివరణలు అందజేసింది. ఆదివారం ఉదయం గవర్నర్ తమిళిసై హైదరాబాద్‌కు రానున్నారు. ఆ వెంటనే ప్రభుత్వ వివరణలను పరిశీలించి.. ఆర్టీసీ బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టేందుకు అనుమతించే అవకాశం ఉందని సమాచారం. ఇదే జరిగితే వెంటనే శాసనసభలో బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించనుంది.

ఇదండీ జగత్



బోర్ అంటే ఎలా? ఇక మీరు మారడానికి ఏ పార్టీ మిగల్లేదు!

బొగ్గు గనుల వేలం అడ్డుకుంటాం

- సింగరేణికి నష్టం జరగకుండా చూస్తాం.. శాసనసభలో మంత్రి జగదీశ్‌రెడ్డి స్పష్టీకరణ
- ఇంకో 20ఏళ్లు బీఆర్‌ఎస్ పాలనే ఉంటుందని వ్యాఖ్య



సాక్షి, హైదరాబాద్: సింగరేణి ప్రాంతంలో బొగ్గు గనులను వేలం పాట ద్వారా ప్రైవేటు సంస్థలు, వ్యక్తులకు కట్టబెట్టే చర్యలను గట్టిగా ఎదుర్కొంటున్నామని విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం ఉన్నంత వరకు, అక్కడి గనులు సింగరేణికే దక్కేలా చర్యలు తీసుకుంటామని తేల్చి చెప్పారు. శనివారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు భట్టి విక్రమార్క, దివాకరరావు, శ్రీధర్‌బాబు, బాల్క సుమన్, గండ్ర వెంకటరమణారెడ్డి అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలో ఉన్న సమయంలోనే ఇలా ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టే ప్రయత్నం మొదలైందన్నారు. ఇటీవల ప్రస్తుత ప్రభుత్వం సవరణతో ముందుకొచ్చినా.. బహిరంగ వేలం అంశానికే ప్రాధాన్యమిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ గనులను స్థానిక ప్రభుత్వానికి అప్పగించే వెసులుబాటు చట్ట సవరణలో ఉన్నా దాన్ని పట్టించుకోవటం లేదన్నారు. ఇదే విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకురాగా, సింగరేణి కూడా బహిరంగ వేలంలో పాల్గొని దక్కించుకోవచ్చని పేర్కొందన్న విషయాన్ని సభ దృష్టికి తెచ్చారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒప్పుకోలేదని, ఎట్టి పరిస్థితుల్లో సింగరేణికి నష్టం జరిగే ఎలాంటి ప్రయత్నాన్ని జరగనీయమని మంత్రి తెలిపారు. ఇంకో 20 ఏళ్లు బీఆర్‌ఎస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని, అప్పటి వరకు సింగరేణికి నష్టం జరగనీయమని మంత్రి జగదీశ్‌రెడ్డి స్పష్టం చేశారు.

తలసరి ఆదాయంలో మూడో స్థానం..

తలసరి ఆదాయం జాబితాలో తెలంగాణ దేశంలోనే మూడో స్థానంలో ఉందని ఆర్థిక మంత్రి హరీశ్‌రావు తెలిపారు. మన కంటే ముందు సిక్కిం, గోవాలాంటి చిన్న రాష్ట్రాలే ఉన్నందున తెలంగాణ అగ్రభాగంలో ఉన్నట్టుగానే భావించొచ్చన్నారు. అతి తక్కువ అప్పులు తీసుకున్న రాష్ట్రాల జాబితాలో కింది నుంచి ఐదో స్థానంలో ఉన్నట్టు మంత్రి పేర్కొన్నారు.

ఆయిల్ పామ్ సబ్సిడీ విస్తీర్ణ పరిమితి పెంచే యోచన..


రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగును పెంచేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని, సబ్సిడీ పరిమితిని పన్నెండున్నర ఎకరాల నుంచి మరింత ఎక్కువ పరిధికి పెంచే అంశాన్ని పరిశీలిస్తున్నట్టు వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి వెల్లడించారు. ఈ మేరకు కేంద్రం అంగీకరించని పక్షంలో రాష్ట్ర ప్రభుత్వమే సొంతంగా దాన్ని అమలు చేసే దిశగా యోచిస్తున్నట్టు శాసనసభ దృష్టికి తెచ్చారు.

వాయిదా తీర్మానాల తిరస్కరణ..

సభలో పలువురు సభ్యులు అడిగిన వాయిదా తీర్మానాలను స్పీకర్ పోచారం తిరస్కరించారు.

విభజన హామీల అమలులో కేంద్రం నిర్లక్ష్యం

- రాష్ట్రంలో పోడు రైతులపై కేసుల మాఫీకి చర్యలు
- రాష్ట్ర గిరిజన, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి సత్యవతి రాథోడ్
- నాడు వైఎస్, నేడు కేసీఆర్ పోడు భూములకు పట్టాలు ఇచ్చారు: గోరటి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర విభజన హామీల అమలు విషయంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని రాష్ట్ర గిరిజన, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి సత్యవతి రాథోడ్ విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం 330 ఎకరాల భూమిని చూపినా గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఇంతవరకు ఏర్పాటు చేయలేదని అన్నారు. సమ్మక్క–సారక్క జాతరను జాతీయ పండుగగా ప్రకటించి, నిధులు కేటాయించాలని, రాష్ట్రంలో ఎస్టీ రిజర్వేషన్లను పదిశాతానికి పెంచుతూ తీసుకున్న నిర్ణయానికి రాష్ట్రపతి ఆమోదం తెలపాలని కోరారు. శనివారం శాసన మండలిలో 'గిరిజన సంక్షేమం–పోడు భూములకు పట్టాల పంపిణీ'పై జరిగిన చర్చకు ఆమె సమాధానమిచ్చారు. పోడు భూముల వివాదాల్లో తలెత్తిన కేసులను సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఎత్తివేసేందుకు అటవీశాఖ, డీజీపీలతో కూడిన కమిటీ కసరత్తు ప్రారంభించిందని చెప్పారు. 2023–24 లో 15 వేల మంది గిరిజన రైతుల ప్రయోజనాల కోసం 'గిరివికాసం'కింద రూ.150 కోట్లు ప్రతిపాదించినట్టు తెలిపారు. రాష్ట్రంలోని ఏడు యూనివర్సిటీల్లో గిరిజన విద్యార్థినీ, విద్యార్థులకు వేర్వేరుగా నిర్మించే నూతన హాస్టల్ నిర్మాణ పనులకు ప్రభుత్వం మంజూరు ఇచ్చిందని, 500 మంది విద్యార్థినీ, విద్యార్థులకు వేర్వేరుగా అన్ని సౌకర్యాలతో హాస్టల్ వసతి కల్పిస్తున్నామని తెలిపారు. గతంలో ఉమ్మడి ఏపీ సీఎంగా ఉన్న దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, ఆ తర్వాత సీఎం కేసీఆర్‌ల హయాంలోనే పోడుభూములకు పట్టాలు ఇచ్చారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ గోరటి వెంకన్న కొనియాడారు.

ఆర్టీసీ కార్మికుల 'చలో రాజ్‌భవన్'

- ఆర్టీసీ విలీనం బిల్లును గవర్నర్ ఆమోదించాలని నినాదాలు
- భారీగా తరలిన కండక్టర్లు, డ్రైవర్లు, ఉద్యోగులు
- మూడు గంటల పాటు ఉద్రిక్తత.. భారీగా స్తంభించిన ట్రాఫిక్
- గవర్నర్‌తో వీడియో కాల్ మాట్లాడిన తర్వాత నిరసన విరమణ



రాజ్‌భవన్ వద్ద ఆందోళన చేస్తున్న ఆర్టీసీ కార్మికులు

సాక్షి, హైదరాబాద్/ పంజగుట్ట: ఆర్టీసీ కార్మికులు కదంతొక్కారు. గవర్నర్‌కు వ్యతిరేకంగా శనివారం ఉదయం భారీ ప్రదర్శన చేపట్టారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేస్తూ ప్రవేశపెట్టిన బిల్లుపైన ఆమోదం తెలపాలని, గవర్నర్ సంతకం చేయాలని డిమాండ్ చేస్తూ వేలాది మంది డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, వివిధ విభాగాలకు చెందిన ఉద్యోగులు, సిబ్బంది 'చలో రాజ్‌భవన్'పేరిట భారీ ర్యాలీ నిర్వహించడంతో ఉద్రిక్తత నెలకొంది. తెలంగాణ మజ్దూర్ యూనియన్ నేతృత్వంలో చేపట్టిన ఈ భారీ ప్రదర్శనకు నగరంలోని అన్ని డిపోలకు చెందిన కార్మికులు తరలివచ్చారు. దీంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సిటీ బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. ఫలితంగా విద్యార్థులు, ఉద్యోగులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మరోవైపు కార్మికుల భారీ ప్రదర్శనతో ఖైరతాబాద్ చౌరస్తా, రాజ్‌భవన్ తదితర మార్గాల్లో ట్రాఫిక్ ఎక్కడికక్కడ నిలిచిపోయింది. నాలుగైదు గంటల పాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. ఆర్టీసీ కార్మికులు రోడ్డుపైనే బైఠాయించడంతో ఖైరతాబాద్ నుంచి రాజ్‌భవన్ వచ్చే మార్గాన్ని పోలీసులు మూసివేశారు. దాంతో నాలుగు వైపులా విపరీతంగా ట్రాఫిక్ స్తంభించింది. ట్రాఫిక్ స్తంభించిపోవడంతో వాహనదారులు గంటలతరబడి రోడ్లపైనే పడిగాపులు కాయాల్సివచ్చింది.

గవర్నర్‌కు వ్యతిరేకంగా నినాదాలు

రాజ్‌భవన్ వైపు వెళ్లకుండా పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లు దాటుకొని ఆందోళనకారులు ముందుకు వెళ్లారు. గవర్నర్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. 'గవర్నర్ డౌన్ డౌన్'అంటూ నినదించారు. ప్లకార్డులను ప్రదర్శించారు. ప్రదర్శనగా వెళ్లిన కార్మికులంతా రాజ్‌భవన్ ఎదుట బైఠాయించారు. తెలంగాణ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి థామస్ రెడ్డి అధ్యక్షతన ఐదుగురు ప్రతినిధుల బృందం రాజ్‌భవన్‌లోకి వెళ్లి గవర్నర్‌తో వీడియో కాల్ మాట్లాడిన తర్వాత నిరసనను విరమించారు.

గవర్నర్ సానుకూలంగా స్పందించారు

ఆ తర్వాత థామస్ రెడ్డి మాట్లాడుతూ గవర్నర్ ఎంతో సానుకూలంగా స్పందించారని చెప్పారు. కార్మికుల ప్రయోజనాల పరిరక్షణ తనకు ఎంతో ముఖ్యమని గవర్నర్ చెప్పారని పేర్కొన్నారు. బిల్లులో కొన్ని సందేహాలు నివృత్తి కాగానే బిల్లుకు ఆమోదం తెలుపుతామన్నారని వివరించారు. తెలంగాణ మజ్దూర్ యూనియన్ అధ్యక్షులు కమలాకర్, ఉపాధ్యక్షులు జీపీఆర్ రెడ్డి, కోశాధికారి రాఘవరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.ఆర్.రెడ్డి, మహిళా నాయకురాలు నిర్మలా రెడ్డి, బీఆర్‌టీయూ అధ్యక్షులు రాంబాబు యాదవ్, ప్రధాన కార్యదర్శి పి.నారాయణ నిరసనకు నాయకత్వం వహించారు. కాగా, గవర్నర్‌తో సమావేశం అయిపోయాక అక్కడకు వచ్చిన ఆర్టీసీ జేఏసీ నాయకులను పోలీసులు రాజ్‌భవన్ లోనికి అనుమతించకుండా వారిని తీసుకొని ఖైరతాబాద్‌లో వదిలేశారు.

కార్మికులకు అండగా ఉన్నా..

ఆర్టీసీ సంస్థ, ఉద్యోగుల ప్రయోజనాలను పరిరక్షించడమే నా ఉద్దేశం

- కార్మిక జేఏసీ, మజ్దూర్ యూనియన్‌తో వర్చువల్ సమావేశంలో గవర్నర్ తమిళిసై
- రాష్ట్ర ప్రభుత్వం హడావుడిగా బిల్లు పెట్టడం సరికాదు
- పెండింగ్ పీఆర్సీలు, గ్రాట్యుటీ బకాయిలపై స్పష్టత రావాలి
- తగిన వివరణలు అందాక బిల్లుపై నిర్ణయం తీసుకుంటానని వెల్లడి
- ప్రభుత్వ ప్రోద్బలంతో సమ్మె.. మేం పిలుపు ఇవ్వలేదు: గవర్నర్‌తో ఉద్యోగ సంఘాలు


ఆర్టీసీ జేఏసీ నేతలతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న గవర్నర్ తమిళిసై

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బిల్లును హడావుడిగా ప్రవేశపెట్టడం సరికాదని, అందులోని అంశాలపై విస్తృత చర్చ కోసం భాగస్వామ్య పక్షాలకు తగిన సమయం ఇవ్వాల్సి ఉందని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ స్పష్టం చేశారు. బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టేందుకు అనుమతి ఆపడం వెనక తనకు వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాలేమీ లేవని.. ప్రజలు, ఆర్టీసీ ఉద్యోగులు, సంస్థ ప్రయోజనాలను రక్షించడమే తన ఉద్దేశమని చెప్పారు. తాను ఎల్లప్పుడూ ఆర్టీసీ కార్మికుల పక్షాన ఉంటానని, గత సమ్మె సమయంలో కూడా కార్మికులకు అండగా నిలబడి అర్ధరాత్రి వారి సమస్యలను విన్నానని గుర్తు చేశారు. శనివారం ఆమె పుదుచ్చేరి నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్టీసీ ఉద్యోగుల జేఏసీ, తెలంగాణ మజ్దూర్ యూనియన్ల ప్రతినిధులతో మాట్లాడారు. 43,373 మంది ఆర్టీసీ ఉద్యోగుల భవిష్యత్తు పట్ల ఆందోళన, సానుభూతి వ్యక్తం చేశారు. ఆర్టీసీ బిల్లుపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి తగిన వివరణలు అందాక.. ఉద్యోగుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని సరైన నిర్ణయం తీసుకుంటానని హామీ ఇచ్చారు.

పీఆర్సీ, గ్రాట్యుటీ చెల్లింపు ఎప్పుడు?

ఆర్టీసీ ఉద్యోగుల వేతన సవరణలు (పీఆర్సీలు), ఈపీఎఫ్, గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ బకాయిల చెల్లింపు వంటివి పెండింగ్‌లో ఉండటంపై గవర్నర్ ఆందోళన వ్యక్తం చేశారు. రిటైర్డ్ ఉద్యోగులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమ సహకార సొసైటీకి చెందిన రూ.3 వేల కోట్లకుపైగా నిధులను ప్రభుత్వం తీసుకుని ఇప్పటివరకు చెల్లించలేదని గుర్తు చేశారు. రాష్ట్రానికి రాజ్యాంగబద్ధ అధిపతిగా రాజ్యాంగ నియమాల పరిరక్షణతోపాటు ప్రజలు, ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడే బాధ్యత తనపై ఉందన్నారు.

ధర్నాకు మంత్రుల వ్యూహరచన: ఉద్యోగ సంఘాలు

ఉద్యోగ సంఘాలు ఎలాంటి సమ్మెకు పిలుపు ఇవ్వలేదని వీడియో కాన్ఫరెన్స్‌లో జేఏసీ ప్రతినిధులు గవర్నర్‌కు చెప్పారు. ప్రభుత్వ ప్రోద్బలంతో బలవంతంగా సమ్మె చేయించారని, మహిళా ఉద్యోగులను సైతం వదిలిపెట్టలేదని ఆరోపించారు. రాజ్‌భవన్ ముట్టడి జరపాలని తమపై ఒత్తిడి తెచ్చారని.. ధర్నాకు ఎమ్మెల్యేలు, మంత్రులు వ్యూహరచన చేశారని పేర్కొన్నారు.

ప్రభుత్వానికి ఉద్యోగులే గుండెకాయ: స్పీకర్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర మరువలేనిదని, ఉద్యోగాలను పణంగా పెట్టి 42 రోజులు చరిత్రాత్మక సమ్మె చేశారని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వానికి గుండెకాయలాంటి ఉద్యోగులతో సహా అన్ని వర్గాలకూ సీఎం కేసీఆర్ సమాన గౌరవం ఇస్తున్నారని వ్యాఖ్యానించారు. తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం (టీఎన్జీవో) నేతలు, 33 జిల్లాల నుంచి వచ్చిన సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శనివారం అసెంబ్లీని సందర్శించి గ్యాలరీనుంచి సమావేశాలను వీక్షించిన అనంతరం అసెంబ్లీ కమిటీ హాల్‌లో స్పీకర్ శ్రీనివాస్‌రెడ్డితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఉద్యోగులు ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నందునే రాష్ట్రంలో మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో స్పీకర్‌ను కలిసిన బృందంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు మామిళ్ల రాజేందర్, ప్రధాన కార్యదర్శి జగదీశ్, అసోసియేట్ అధ్యక్షులు సత్యనారాయణ గౌడ్ ఉన్నారు.

ఐబీడీపై ఏఐజీ అధ్యయనం



మాట్లాడుతున్న డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: పట్టణ ప్రాంతాలకే పరిమితమైన జీర్ణకోశ సంబంధిత వ్యాధి ఇన్ఫ్లమేటరీ బొవెల్ డిసీజ్ (ఐబీడీ)గ్రామీణ ప్రాంతాల్లోనూ వేగంగా వ్యాపిస్తోందని ఏఐజీ ఆసుపత్రి ఛైర్మన్ డి.నాగేశ్వర్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై తమ ఆసుపత్రి అధ్యయన ఫలితాలను ప్రతిష్టాత్మక లాన్సెట్ ప్రచురించిన నేపథ్యంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో 15 లక్షల మందికి పైగా ఈ వ్యాధితో బాధపడుతున్నారని అంచనా కాగా, తాము గ్రామాల్లో 30 వేల మంది బాధితులను గుర్తించడం ద్వారా అది గ్రామీణ ప్రాంతాలకు కూడా బాగా విస్తరించినట్టు వెల్లడైందన్నారు. తమ తొలి దశ అధ్యయనం ప్రకారం గ్రామీణుల్లో ఈ వ్యాధి 0.1 శాతం మాత్రమే కాగా రెండో దశలో 5.1 శాతానికి పెరిగిందన్నారు. శిశువులకు తల్లిపాలు అందకపోవడం, యాంటీబయాటిక్స్ వినియోగం...తో పాటు గ్రామాల్లోనూ ప్రాసెస్డ్ ఫుడ్ వినియోగం పెరగడం, పాశ్చాత్య జీవనశైలి వంటివి గ్రామాల్లో ఐబీడీ విజృంభణకు కారణమన్నారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లో ఐబీడీ వ్యాప్తిపై ప్రతీఒక్కరిలో అప్రమత్తత అవగాహన పెరగాలన్నారు. సమావేశంలో ఏఐజీ ఆసుపత్రి ఐబీడీ సెంటర్ డైరెక్టర్, డాక్టర్ రూపా బెనర్జీ అధ్యయనం తీరుతెన్నులను వివరించారు.

అసెంబ్లీ సమావేశాలకు నేటితో తెర

- తొమ్మిదిన్నరేళ్లలో తెలంగాణ సమగ్రాభివృద్ధిపై చర్చించనున్న సభ
- మూడో రోజు ఐదు బిల్లులకు అసెంబ్లీ ఆమోదం
- ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనం బిల్లుపై కొనసాగుతున్న ఉత్కంఠ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రెండో శాసనసభ ఆఖరి విడత సమావేశాలు చివరి అంకానికి చేరుకున్నాయి. మూడు రోజులుగా జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలకు ఆదివారంతో తెరపడనుంది. బీఏసీ సమావేశంలో నిర్ణయించిన మేరకు ఆదివారం ప్రశ్నోత్తరాలు లేకుండా నేరుగా 'తొమ్మిదిన్నరేళ్లలో తెలంగాణ ప్రగతి ప్రస్థానం'పై చర్చ జరుగుతుంది. ఈ అంశంపై ముఖ్యమంత్రి కేసీఆర్ సమాధానం ఇచ్చే అవకాశముంది. మరోవైపు 'ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనం బిల్లు'శాసనసభలో పెట్టే అంశంపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఆదివారం ఉదయంలోగా ఈ బిల్లుకు గవర్నర్ అనుమతి తెలిపితే సభ ముందుకు ఈ బిల్లు వచ్చే అవకాశమున్నట్లు సమాచారం.

ఐదు బిల్లులకు సభ ఆమోదం...

మూడో రోజు సమావేశాల్లో ప్రశ్నోత్తరాల అనంతరం 'పల్లె ప్రగతి- పట్టణ ప్రగతి'పై జరిగిన లఘు చర్చకు మంత్రి కేటీఆర్ సమాధానం ఇచ్చారు. అనంతరం ఐదు బిల్లులను సంబంధిత శాఖల మంత్రులు ప్రతిపాదించారు. తెలంగాణ వైద్య విజ్ఞాన సంస్థ బిల్లు–2023, తెలంగాణ జీఎస్టీ సవరణ బిల్లు–2023ను ఆర్థిక, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ప్రతిపాదించగా ఫ్యాక్టరీల (తెలంగాణ సవరణ) బిల్లు–2023ను కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి, తెలంగాణ రాష్ట్ర అల్ప సంఖ్యాక వర్గాల కమిషన్ (సవరణ) బిల్లు–2023ను మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రతిపాదించారు. తెలంగాణ పంచాయతీరాజ్ రెండో సవరణ బిల్లు 2023ను మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రతిపాదించారు. ముఖ్యమంత్రి ఆదేశాల ప్రకారం ప్రవేశపెట్టిన ఈ బిల్లులను సభ ఆమోదించినట్లు శాసనసభ వ్యవహారాల మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రకటించారు. ఆ తర్వాత సభను ఆదివారం ఉదయం 10 గంటలకు వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ పోచారం ప్రకటించారు. అంతకుముందు నిరుద్యోగ భృతి, నిరుద్యోగ సమస్యలపై కాంగ్రెస్ ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని స్పీకర్ పరిగణనలోకి తీసుకోలేదు.

ఎయిమ్స్ మాదిరిగా టిమ్స్‌లకు స్వయంప్రతిపత్తి

- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రజలకు అవసరమైన సూపర్ స్పెషాలిటీ సేవలను అందించడానికి 10 వేల సూపర్ స్పెషాలిటీ పడకలను నిమ్స్, వరంగల్ హెల్త్ సిటీ, టిమ్స్ ఆసుపత్రులలో ఏర్పాటు చేస్తున్నామని మంత్రి హరీశ్‌రావు చెప్పారు. తెలంగాణ వైద్య విజ్ఞాన సంస్థ బిల్లు సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టిమ్స్ ఆసుపత్రులకు ఎయిమ్స్, పీజీఐ చండీగఢ్, ఐఐటీ, ఐఐఎం మాదిరి స్వయం ప్రతిపత్తి ఇవ్వడానికి ఈ చట్టాన్ని తీసుకొస్తున్నామని చెప్పారు. టిమ్స్ ఆసుపత్రులను హైదరాబాద్ నగరానికి నలుమూలల ఏర్పాటు చేస్తామని మంత్రి హరీశ్ వెల్లడించారు.

మహిళా కార్మికులకు రక్షణ కల్పించే ఫ్యాక్టరీల బిల్లు

ఫ్యాక్టరీల బిల్లుపై మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ, ఇది మహిళా కార్మికులకు రక్షణ కల్పించే బిల్లు అన్నారు. రాత్రి 7 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు మహిళా ఉద్యోగులు పనిచేసే విధంగా ఈ బిల్లును తీసుకొస్తున్నామని చెప్పారు. రాష్ట్రపతి, గవర్నర్ మహిళలే కాబట్టి ఈ బిల్లుకు ఆమోదం తెలపాలని కోరారు.

మరిన్ని మెడికల్ పీజీ సీట్లు

- శాసనసభలో మంత్రి హరీశ్‌రావు వెల్లడి

సాక్షి, హైదరాబాద్: వైద్య విద్యకు సంబంధించి ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో పీజీ సీట్ల సంఖ్యను మరింత పెంచే దిశగా యోచిస్తున్నట్టు వైద్య శాఖ మంత్రి హరీశ్‌రావు ప్రకటించారు. డిమాండ్ ఎక్కువగా ఉన్న విభాగాల్లోనే ఈ సీట్ల సంఖ్య పెంచుతామన్నారు. ప్రతి లక్ష జనాభాకు 22 ఎంబీబీఎస్ సీట్లతో తెలంగాణ దేశంలో ప్రథమ స్థానంలో నిలిచిందని వైద్య శాఖ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ధాన్యం ఉత్పత్తిలోనే కాదు.. జిల్లాకో మెడికల్ కళాశాలతో డాక్టర్ల ఉత్పత్తిలోనూ రాష్ట్రం మొదటి స్థానంలో నిలిచిందన్నారు. మెడికల్ కళాశాలలకు సంబంధించి శనివారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు.

దేశంలో అతి తక్కువ ఎంబీబీఎస్ ఫీజులు: దేశంలోనే అతి తక్కువ ఎంబీబీఎస్ ఫీజులు తెలంగాణలోనే ఉన్నాయని హరీశ్ వెల్లడించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలో విద్యార్థులు రూ.10 వేల ఫీజు మాత్రమే చెల్లిస్తారని, కానీ ఒక ఎంబీబీఎస్ డాక్టర్‌ను తయారు చేయాలంటే ప్రభుత్వ కాలేజీలో రూ.30 లక్షలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ప్రభుత్వానికి ఎదురవుతోందన్నారు. ఒక పీజీ డాక్టర్ తయారీకి రూ.45 లక్షలు, సూపర్ స్పెషాలిటీ డాక్టర్‌కు రూ.75 లక్షల వరకు ఖర్చు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రతి వేయి మందికి ఓ డాక్టర్ ఉండాలన్నది ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచన కాగా, రాష్ట్రంలో రిజిస్టర్డ్ డాక్టర్ల సంఖ్య 40 వేలు దాటిందని హరీశ్ తెలిపారు.

'ఈటీ' అవార్డుల్లో రాష్ట్రానికి రెండు బంగారు పతకాలు



సాక్షి, హైదరాబాద్: గోవాలో జరుగుతున్న ''ఈటి గవర్నమెంటు డిజిటెక్ అవార్డు 2023''కార్యక్రమంలో రాష్ట్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం రెండు బంగారు పతకాలను సాధించింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఎమర్జింగ్ టెక్నాలజీస్ వింగ్ డైరెక్టర్ రమాదేవి లంకా ఈ అవార్డులను స్వీకరించారు. కృత్రిమ మేధస్సు ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సాంకేతికతకు ఈ అవార్డులు లభించాయి. అలాగే రోడ్డు భద్రతకు వినియోగిస్తున్న 'ఐ రాస్తే'తో పాటు అటవీ జంతువుల సంరక్షణ కోసం వినియోగిస్తున్న సాంకేతికతకు ఈ అవార్డులు దక్కాయి. బీహార్ ఐటీ మంత్రి మహమ్మద్ ఇశ్రాలీ మన్సూరీ చేతుల మీదుగా రమాదేవి లంకా శనివారం ఈ అవార్డులను స్వీకరించారు.



ఎవని గర్వము వానిని తగ్గించును.
వినయ మనస్కుడు ఘనతనొందును.
- క్రైస్తవ ధర్మం

నెత్తుటి పారుదల యాగమా ఇది?

అసూయాద్వేషాలు ఆపాదమస్తకాన్ని దహిస్తుంటే ఆ మనిషి ప్రవర్తన ఎలా ఉంటుంది? నిరాశా నిస్పృహలు నిలువెల్లా పోటెత్తుతుంటే అతడి మానసిక స్థితి ఎలా ఉంటుంది? ఈ వారం రాయలసీమ పర్యటనలో చంద్రబాబు ప్రవర్తనలా ఉంటుంది. ఇంచుమించు ఉన్మాదస్థితిని తలపిస్తుంది. బాధాకరం. రాజకీయాల్లో ఆయనది నెగెటివ్ పాత్రే కావచ్చు. వెన్నుపోటుకు మారుపేరే కావచ్చు. విధానపరంగా పేదల వ్యతిరేకే కావచ్చు. పెత్తందార్ల ప్రతినిధే కావచ్చు. అవకాశవాద రాజకీయాలకు బ్రాండ్ అంబాసిడర్ కావచ్చు. కానీ పద్నాలుగేళ్లపాటు ముఖ్యమంత్రిగా పనిచేశారు. మరో పద్నాలుగేళ్ల ప్రతిపక్ష నాయకుని హోదా అనుభవించారు. నగరవాసమూ, అరణ్యవాసమూ తర్వాత మిగిలింది అజ్ఞాతవాసమే కదా! అందుకు సిద్ధపడాల్సిన సమయంలో ఈ దుఃస్థితి! తెలుగు వారందరూ విచారించ దగిన పరిణామం.

సాగునీటి ప్రాజెక్టులపై 'యుద్ధభేరి' అనే పేరుతో కర్నూలు జిల్లా బనకచర్ల దగ్గర ఆయన యాత్రను ప్రారంభించారు. పేరు ఏదైనా సరే తన ఉద్దేశం వేరే ఉన్నట్లు తొలిరోజు నుంచే సంకేతాలు పంపిస్తున్నారు. పాల్గొన్న ప్రతి సభలో ముఖ్యమంత్రిపై దూషణలకు తెగబడ్డారు. స్థానిక ఎమ్మెల్యేలపై, మంత్రులపై ఇష్టారీతిన ఆరోపణలు చేశారు. నీటిపారుదల శాఖ మంత్రిని ఆంబోతుగా సంబోధించారు. చివరకు ముప్ఫయ్యేళ్ల వయసు కూడా లేని యువకుడు సిద్ధార్థరెడ్డిని కూడా వదల్లేదు. నాలుకను నాలుగించులు సాగదీసి మరీ బెదిరించారు. ఉన్నట్టుండి హఠాత్తుగా ఒక సభలో ఆటంబాంబు లాంటి స్టేట్‌మెంట్‌ను జనం మీదకు వదిలారు. ఆ బాంబును తయారుచేసిన ఒపెన్‌హైమర్ సినిమా ఇప్పుడు నడుస్తున్నందువల్ల స్ఫూర్తి పొందాడేమో తెలియదు. 'ఏయ్! నేను సింహంలాంటోణ్ణి' అనగానే సభికులు అవాక్కయ్యారు. వారి పంచేంద్రియాలు ఎవరో మంత్రించినట్టుగా స్తంభించిపోయాయి. నవనాడుల్లో రక్తప్రసరణ ఆగిపోయినట్టయింది.

ఆంధ్రప్రదేశ్‌లో దసరాకు పులివేషాలు సహజమే - ఆ వేషాలు వేసే వాళ్లు లేక ఇప్పుడవీ తగ్గిపోయాయట! కానీ, బాగా పాపులారిటీ ఉన్న వ్యక్తులు తమకు నప్పని, కుదరని వేషాలు వేస్తే జనం అంగీకరించరని అనేకమార్లు రుజువైంది. అందుకే ఎన్టీ రామారావు దేవదాసు వేషాన్నీ, నాగేశ్వరరావు దుర్యోధన వేషాన్నీ వేయడానికి సాహసించలేదు. కిల్‌బిల్ పాండే వేషంలో బ్రహ్మానందం ఎంత సీరియస్‌గా మొహం పెట్టినా అది కామెడీ ట్రాక్‌గానే మిగిలిపోయింది. ఈ కారణం వల్లనే చంద్రబాబు బాంబింగ్‌కు జనం స్పందించలేదు. చప్పట్లు కొట్టలేదు. నప్పని వేషాలు వేస్తేనే అంగీకరించని జనం స్వభావ విరుద్ధమైన పోలికలు తీసుకొస్తే, పొగడ్తలు కురిపిస్తే షాకవ్వడం సహజం. పోనీ, ఎవరో ఒక అభిమానో, లేదా కార్యకర్తో వచ్చి 'అన్న టైగర్', 'అన్న లయన్' అంటే అది వేరు. కానీ స్వయంగా 'నేను లయన్'ను అని ప్రకటించుకోవడం కొంత ఎబ్బెట్టుగా అనిపించింది. కొంతమంది తాము కూర్చునే కుర్చీ వెనుక పెద్దపులి బొమ్మల్ని పటం కట్టించి పెట్టుకుంటారట! ఇలాంటి వారు స్వభావసిద్ధంగా పిరికివాళ్లనీ, దాన్ని కప్పి పుచ్చుకోవడం కోసం ఇటువంటి బొమ్మల్ని పెట్టుకుంటారనీ సైకాలజిస్టులు చెబుతారు. ఇక స్వయంప్రకటిత 'నరసింహ'లకూ, 'నరశార్దూల'లకూ కూడా ఈ సూత్రం వర్తిస్తుందేమో తెలుసుకోవాలి.

మొదటి సింహ ప్రయోగం రసాభాస కావడంతో రెండోరోజు కొంత కసరత్తు చేసి కార్యకర్తలను ముందుగానే సిద్ధం చేశారు. ఈ సభలో వారు చప్పట్లు కొట్టారు. 'నేను సింహాన్ని, కొదమ సింహాన్ని' అని రెండు మూడుసార్లు ఆయన ప్రకటించుకున్నారు. కొదమసింహం అంటే యువసింహం అని అర్థం. ఆయనే యువసింహం అయితే వాళ్లబ్బాయి బాలసింహం అవుతాడా, శిశుసింహం అవుతాడా అనే తర్కం అనవసరం. ఈ సింహోపాఖ్యానాన్ని వ్యూహం ప్రకారమే ఆయన ప్రారంభించారు. వచ్చే ఎన్నికల్లో మరో ఓటమి తప్పదనే అంచనాలు ఆయనకు తెలియనివి కావు. గత ఎన్నికల్లో టీడీపీ కంటే పదిశాతం ఎక్కువ ఓట్లు వైసీపీకి లభించాయి. ఇప్పుడా తేడా మరింత పెరిగి దాదాపు పద్దెనిమిది శాతానికి చేరుకున్నట్టు వివిధ సర్వేల అంచనాలు తేల్చుతున్నాయి. ప్రతిష్ఠాత్మకమైన కొన్ని జాతీయ సంస్థలతో ప్రతిపక్షాలు చేయించిన సర్వేలో వైసీపీకి 52 శాతం, తెలుగుదేశం పార్టీకి 34 శాతం ఓటర్ల మద్దతున్నట్టు వెల్లడైందట! గడచిన ఏడాది కాలంగా జరిగిన సర్వేల్లో ఈ బలాబలాల పొందికలో ఒకటి రెండు శాతానికి మించిన ఊగిసలాట కనిపించడం లేదు.

ఈ నేపథ్యంలో జనసేన పార్టీ ఒక్క దానితో పొత్తు కుదిరినా ప్రయోజనం లేదు. బీజేపీతో సహా మిగిలిన పార్టీలన్నీ తనకు మద్దతుగా నిలబడాలి. అందరూ ఏకమవడం ఎలా కుదురుతుంది? బీజేపీ మద్దతు ఉన్న కూటమి వైపే కాంగ్రెస్ వారూ, కమ్యూనిస్టులూ ఎలా నిలబడతారు? ప్రజాస్వామ్య పరిరక్షణ అనే పేరుతో ఏకం చేయవచ్చుననే అంధ విశ్వాసమేదో చంద్రబాబులో ఉన్నదని అంటారు. అప్పుడెప్పుడో ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని ఇందిరాగాంధీ కూల్చివేసినప్పుడు ఈ ఐక్యత సాధ్యమైందట! తిరిగి అధికారంలోకి రావడానికి సహకరించినందుకు కృతజ్ఞతగా ఎన్టీరామారావు ఒక పక్క బీజేపీనీ, మరోపక్క కమ్యూనిస్టులనూ కలుపుకొని తదుపరి ఎన్నికల్లో పోటీ చేశారు. ఈ ఐక్యతకు ప్రజాస్వామ్య పరిరక్షణ అనే పేరు పెట్టినప్పటికీ, కనిపించని 'కామన్ త్రెడ్' ఏదో వీరిని కలిపేసిందని అప్పట్లోనే కొందరు రాజకీయ పరిశీలకులు అంచనా వేశారు. ఆ 'కామన్ త్రెడ్' ఇప్పుడు కూడా అక్కరకొస్తుందని చంద్రబాబు ఆశ. కొందరు కమ్యూనిస్టులు, కొందరు కాంగ్రెస్ నాయకులతో కూడా ఈ మేరకు ఆయన చర్చలు జరిపినట్టు సమాచారం.

మరి ప్రజాస్వామ్య పరిరక్షణ వేదికను ఏర్పాటు చేయడానికి ఒక భూమిక కావాలి కదా! ఆ భూమిక కోసం ఇంతకు ముందే, ఒకటి రెండు ప్రయత్నాలు జరిగాయి. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయనీ, రాజకీయ ప్రత్యర్థులను వేధిస్తున్నారనీ ఎల్లో మీడియా సహకారంతో తెలుగుదేశం పార్టీ పెద్ద క్యాంపెయిన్‌నే నిర్వహించింది. కానీ, ఆ క్యాంపెయిన్ ప్రజలను నమ్మించలేకపోయింది. ఇటీవల గోదావరి జిల్లాల్లో బాబు భాగస్వామి పవన్ కల్యాణ్ రాష్ట్రం నుంచి వేల సంఖ్యలో ఆడపిల్లలను అక్రమంగా తరలిస్తున్నారంటూ చేసిన గాలి ఆరోపణను కూడా ఈ కోణంలోంచి చూడాలి. దానికి కొనసాగింపు చంద్రబాబు రాయసీమ పర్యటన. కర్నూలు జిల్లాలో సింహం మాస్క్‌తో మొదలై చిత్తూరు జిల్లాలో రక్తం చిందే వరకు సాగింది. అంగళ్లలో, పుంగనూరులో జరిగిన అల్లర్లలో చంద్రబాబు పాత్ర వీడియో ఫుటేజీల సాక్షిగా రుజువైంది.

రెండు రోజుల కింద పులివెందులలోనే ఇటువంటి ప్రయత్నం చేశారు. కానీ పోలీసులుగానీ, వైసీపీ శ్రేణులు గానీ కవ్వింపులకు రెచ్చిపోకుండా నిగ్రహం పాటించడంతో ప్రమాదం తప్పింది. అక్కడి నుంచి గుణపాఠం తీసుకున్న చంద్రబాబు గురి తప్పకుండా పుంగనూరులో అల్లర్లు జరిగేలా ప్లాన్ చేశారు. పర్యటన జరిగినన్ని రోజులూ మూడు నాలుగు జిల్లాల నుంచి సమీకరించిన రౌడీ దండును ఆయన వెంటేసుకుని తిరిగారు. ఈ రౌడీదండు తమ వెంట రాళ్లు, గాజుముక్కలతో పాటు కత్తులు, తుపాకులను కూడా ఉంచుకున్నారు. ఇవన్నీ సందేహాతీతంగా నిరూపణ కాబోతున్నాయి. నిందితుల మీద చర్యలు తీసుకుంటే ప్రత్యర్థులను వేధిస్తున్నారని గగ్గోలు పెట్టాలి. చర్యలు తీసుకోకపోతే మరింత చెలరేగిపోవాలి. ఎవరి వ్యూహాలు ఎలా ఉన్నా, ఎవరి భాష్యాలు ఎలా చెప్పినా చట్టం తన పని తాను చేసుకుపోతుంది.



చంద్రబాబు సాగునీటి ప్రాజెక్టుల పరిశీలన ఒక తంతుగానే సాగింది. చిత్తం ప్రాజెక్టుల మీద, భక్తి పచ్చినెత్తురు మీద అన్నట్టుగా ముగిసింది. ఆయనకు చిత్తశుద్ధి ఉండి ఉంటే రాయలసీమ సాగునీటికి సంబంధించి వైసీపీ వాళ్లు వేస్తున్న ప్రశ్నలకు సమాధానం చెప్పేవారు. రాయలసీమ ప్రజల్లో, మేధావుల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేసే ప్రయత్నం చేసేవారు. కానీ ఆయన లక్ష్యం అది కాదు. రాయలసీమ ఇరిగేషన్ ప్రధాన ఆధారం కృష్ణా ప్రవాహం. 1983-84లో తెలుగు గంగ ప్రాజెక్టు కోసం శ్రీశైలం జలాలను తరలించడానికి వీలుగా పోతిరెడ్డిపాడు వద్ద అప్పటి ఎన్టీరామారావు ప్రభుత్వం హెడ్ రెగ్యులేటర్‌ను ఏర్పాటుచేసింది. దాని సామర్థ్యం 11 వేల క్యూసెక్కులు. ఈ రెగ్యులేటర్ ద్వారా తరలించిన నీటి పరిమాణం ఎంత అని ఇరవయ్యేళ్ల తర్వాత పరిశీలించినప్పుడు, రిజర్వాయర్లో ఆవిరైన నీటిలో సగానికంటే తక్కువని వెల్లడైంది. ఆ ఇరవై ఏళ్ల కాలంలో శ్రీశైలం డ్యామ్‌లోకి 19,642 టీఎమ్‌సీల నీరు చేరింది. అందులో 349 టీఎమ్‌సీల నీరు ఆవిరైంది. పోతిరెడ్డిపాడు రెగ్యులేటర్ ద్వారా సీమకు చేరిన నీరు 160 టీఎమ్‌సీలు మాత్రమే. అంటే ఆవిరైన నీటిలో 0.45 శాతం. రామారావు తర్వాత తొమ్మిదేళ్లు అధికారంలో ఉండి రెగ్యులేటర్ సామర్థ్యాన్ని ఎందుకు పెంచలేదని రాయలసీమ రైతులు, మేధావులు చంద్రబాబును ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకొని దాని సామర్థ్యాన్ని 44 వేల క్యూసెక్కులకు రాజశేఖరరెడ్డి పెంచినప్పుడు తెలుగుదేశం శ్రేణుల చేత కర్నూలు రహదారిపై, ప్రకాశం బ్యారేజీపై ఎందుకు వ్యతిరేక ధర్నాలు చేయించావు చంద్రబాబూ అని వారు గత పద్దెనిమిదేళ్లుగా ప్రశ్నిస్తూనే ఉన్నారు.



జనతంత్రం
వర్ధెల్లి మురళి

పోతిరెడ్డిపాడు ద్వారా రాయలసీమకు నీటి తరలింపు కార్యక్రమం రిజర్వాయర్లో 881 అడుగుల స్థాయి ఉన్నప్పుడు మాత్రమే సాధ్యమవుతున్నది. ఈ స్థాయి నీటిమట్టం ఏడాదిలో సగటున 35 రోజులు మాత్రమే ఉంటుంది. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత 800 నుంచి 826 అడుగుల మట్టం నుంచే నీటిని తీసుకునే విధంగా తెలంగాణ ప్రభుత్వం పాలమూరు-రంగారెడ్డి, డిండి, ఎడమగట్టు కాల్వలను డిజైన్ చేసింది. 796 అడుగుల నుంచి విద్యుత్ కేంద్రం ద్వారా 44 వేల క్యూసెక్కులను తరలించే సామర్థ్యం తెలంగాణకు ఉన్నది. రోజుకు 6.5 టీఎమ్‌సీలను తక్కువ నీటి మట్టం నుంచే తరలించే ప్రయత్నం చేస్తున్నప్పుడు అధికారంలో ఉండి ఏం చేశావన్నది రాయలసీమ ప్రజలు చంద్రబాబుకు వేస్తున్న ప్రశ్న. 'ఓటుకు నోటు కేసు నుంచి బయటపడేందుకు సీమ ప్రయోజనాలు తాకట్టు పెట్టలేదా' అని వారు ఆగ్రహిస్తున్నారు. ఇందుకు విరుగుడుగా 800 అడుగుల మట్టం నుంచే ఎత్తిపోసే రాయలసీమ ఎత్తిపోతలను డిజైన్ చేసి జగన్‌మోహన్‌రెడ్డి ఎలా సీమ ప్రాజెక్టుల ద్రోహి అయ్యాడో వివరించమని వారు నిలదీస్తున్నారు.

సాగునీటి ప్రాజెక్టులపై 'యుద్ధభేరి' అనే పేరుతో కర్నూలు జిల్లా బనకచర్ల దగ్గర చంద్రబాబు యాత్రను ప్రారంభించారు. పేరు ఏదైనా సరే తన ఉద్దేశం వేరే ఉన్నట్లు తొలిరోజు నుంచే సంకేతాలు పంపిస్తున్నారు. పాల్గొన్న ప్రతి సభలో ముఖ్యమంత్రిపై దూషణలకు తెగబడ్డారు. స్థానిక ఎమ్మెల్యేలపై, మంత్రులపై ఇష్టారీతిన ఆరోపణలు చేశారు. నీటిపారుదల శాఖ మంత్రిని ఆంబోతుగా సంబోధించారు. చివరకు ముప్ఫయ్యేళ్ల వయసు కూడా లేని యువకుడు సిద్ధార్థరెడ్డిని కూడా వదల్లేదు. నాలుకను నాలుగించులు సాగదీసి మరీ బెదిరించారు. ఉన్నట్టుండి హఠాత్తుగా ఒక సభలో ఆటంబాంబు లాంటి స్టేట్‌మెంట్ ను జనం మీదకు వదిలారు. ఆ బాంబును తయారు చేసిన ఒపెన్‌హైమర్ సినిమా ఇప్పుడు నడుస్తున్నందువల్ల స్ఫూర్తి పొందాడేమో తెలియదు. 'ఏయ్! నేను సింహంలాంటోణ్ణి' అనగానే సభికులు అవాక్కయ్యారు. వారి పంచేంద్రియాలు ఎవరో మంత్రించినట్టుగా స్తంభించిపోయాయి. నవనాడుల్లో రక్తప్రసరణ ఆగిపోయినట్టయింది.

ఆంధ్రప్రదేశ్‌లో దసరాకు పులివేషాలు సహజమే - ఆ వేషాలు వేసే వాళ్లు లేక ఇప్పుడవీ తగ్గిపోయాయట! కానీ, బాగా పాపులారిటీ ఉన్న వ్యక్తులు తమకు నప్పని, కుదరని వేషాలు వేస్తే జనం అంగీకరించరని అనేకమార్లు రుజువైంది. అందుకే ఎన్టీ రామారావు దేవదాసు వేషాన్నీ, నాగేశ్వరరావు దుర్యోధన వేషాన్నీ వేయడానికి సాహసించలేదు. కిల్‌బిల్ పాండే వేషంలో బ్రహ్మానందం ఎంత సీరియస్‌గా మొహం పెట్టినా అది కామెడీ ట్రాక్‌గానే మిగిలిపోయింది. ఈ కారణం వల్లనే చంద్రబాబు బాంబింగ్‌కు జనం స్పందించలేదు.

బనకచర్ల క్రాస్ టు వెలిగోడు లింక్ కెనాల్ సామర్థ్యం 15 వేల క్యూసెక్కులు. లైనింగ్ పనులు పూర్తి కాకపోవడంలో అందులో సగం కూడా వెళ్లలేని పరిస్థితి. బ్రహ్మంసాగర్ నిల్వ సామర్థ్యం 17.85 టీఎమ్‌సీలు. మట్టికట్ట లీకేజీల వల్ల నాలుగు టీఎమ్‌సీలు కూడా నిలబెట్టలేని స్థితి. అధికారంలో ఐదేళ్లు ఉండి పట్టించుకోని మీరా? అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే ఆ పనులు పూర్తి చేసిన జగన్‌మోహన్ రెడ్డా? ఎవరు ద్రోహి? అని రాయలసీయ ప్రజలు సూటి ప్రశ్నలు సంధిస్తున్నారు. గురు, శుక్రవారాల్లో చంద్రబాబు ఏ ప్రాంతంలోనైతే నెత్తురు పారించాలని ప్రయత్నం చేశాడో, ఆ ప్రాంతం సుభిక్షంగా ఉండాలని హంద్రీ-నీవా, గాలేరు-నగరిని సంధానిస్తూ జగన్‌మోహన్‌రెడ్డి మూడు రిజర్వాయర్లను నిర్మిస్తున్నారు. వాటికి వ్యతిరేకంగా టీడీపీ నేతల చేత చంద్రబాబు ఎన్జీటీలో కేసులు వేయించారు. కడుపు మండిన ఆ ప్రాంత రైతులు రోడ్ల పక్కన నిలబడి చంద్రబాబుకు నిరసన తెలిపారు. రాయలసీమకు నీరందించే ఒక్కో ప్రాజెక్టు కింద ఒక్కో డజన్ ప్రశ్నలు చంద్రబాబు కోసం సిద్ధంగా ఉన్నాయి. వాటికి ఆయన దగ్గర సమాధానాల్లేవు, సమాధానం చెప్పే ఉద్దేశం కూడా లేదు. సీమలో సాగునీరు పారితే ఆయనకు అధికారం రాదు. ఏమో... నెత్తురు పారితే? ఎంతవరకు ఉపయోగమనే ట్రయల్‌రన్ నడుస్తున్నది. ●

ఫీల్‌గుడ్ తుపాకీ పేలుతుందా?

ఆర్థిక అసమానతలు మనుషుల మధ్యనే కాదు. ఎకరాల మధ్య కూడా పెరిగిపోతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలోనే పది లక్షలకు ఎకరం లభించే ప్రాంతాలు కూడా ఉన్నాయి. మొన్న సర్కారు వారి పాటలో 'కోకాపేట' కనకం మాత్రం వందకోట్ల కిరీటాన్ని ధరించింది. హైదరాబాద్ నగరానికి పడమటి దిక్కున ఔటర్ రింగ్‌రోడ్డును ఆనుకుని ఈ కోకాపేట వేంచేసి ఉన్నది. ఇప్పుడీ కోకాపేట ఒక దేవకన్యలా మెరిసిపోతున్నది. 'దివినే వదిలి భువికేతెంచిన తేనెల వెన్నెల సోనవో' అని పాడాలనిపిస్తున్నది. ఎందుకంటే ఔటర్ రింగ్‌రోడ్డు పక్కనే ఉన్న ఇతర ప్రాంతాలను, ముఖ్యంగా తూర్పు ప్రాంతాన్ని గమనిస్తే కోకాపేట తేజస్సు తెలిసి వస్తుంది. బొంగుళూరు నుంచి పెద్దఅంబర్‌పేట మీదుగా కీసర, మేడ్చల్ వరకు ఎక్కడా ఎకరా మార్కెట్ ధర పది కోట్లు లేదు. అసలు కొనేవాళ్లు కూడా లేరట! గడిచిన సంవత్సరం జరిగిన రిజిస్ట్రేషన్‌లతో ఈ సంవత్సరం లావాదేవీలను పోల్చి చూసినప్పుడు వెల్లడైన విషయమిది.

హైదరాబాద్ నగరం, శివారు ప్రాంతాల్లో కలిసి సుమారు రెండు లక్షల ఫ్లాట్లు కొనేవారు లేక ఖాళీగా పడివున్నాయని ఒక అంచనా. వేలాది ఎకరాల్లో విస్తరించి ఉన్న ట్రిపుల్ ఒన్ జీవో (జీవో 111) సామ్రాజ్యం కూడా కోకాపేట ప్రాంతాన్ని ఆనుకునే ఉంటుంది. ఇప్పుడా జీవోను రద్దు చేసినందువల్ల ఆ 'విముక్త' ప్రాంతమంతా రియల్ ఎస్టేట్ వ్యాపారానికి అందుబాటులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో మార్కెట్ సూత్రం ప్రకారం భూముల ధరలు తగ్గాలి. కానీ, ఈ సహజ పరిణామాన్ని సవాల్ చేస్తూ కోకాపేట ఒక సమ్మోహనాస్త్రాన్ని ప్రయోగించింది. ఈ అసహజత్వం అర్థం కావాలంటే రాష్ట్రంలో నెలకొని ఉన్న రాజకీయ పరిస్థితులపై కూడా అవగాహన ఉండాలి.

గంటగంటకూ గమ్యాన్ని మార్చుకునే తుపాన్ల సృష్టికి మన బంగాళాఖాతం పెట్టింది పేరు. బెంగాల్, బంగ్లాదేశ్‌లను కలిపి చూసినా వాటి ఉమ్మడి సముద్ర తీరం కంటే ఆంధ్రప్రదేశ్ సముద్ర తీరం వంద కిలోమీటర్లు ఎక్కువ. అయినా 'బే ఆఫ్ బెంగాల్' అన్నారు గానీ, 'బే ఆఫ్ ఆంధ్రా' అనలేదు ఎందుకో! ఈ ప్రస్తావన ఇక్కడ అప్రస్తుత ప్రసంగం కావచ్చు. బంగాళాఖాతం తుపాన్ల మాదిరిగానే తెలంగాణ రాజకీయ వాతావరణం కూడా గత ఏడాది కాలంగా రకరకాల మార్పులకు లోనైంది. ఇప్పుడిప్పుడే తీరం దాటి గమ్యం చేరినట్టు కనిపిస్తున్నది. ఈ పరిస్థితి రాష్ట్రంలో సర్వే బృందాలు వర్ధిల్లడానికి అవకాశమిచ్చింది. సెఫాలజీ ఒక ఉపాధి అవకాశంగా విస్తరించింది. రాజకీయ పార్టీలు ఒకటో రెండో మూడో బృందాలను నియమించుకున్నాయి. జాతీయ బృందాలతోపాటు ప్రాంతీయ, స్థానిక టీమ్‌లు కూడా పనిచేశాయి. చాలామంది ఎమ్మెల్యేలు కూడా విడివిడిగా తమ బలం మీద అంచనా కోసం సర్వేలు చేసుకున్నారు. గోడ దూకుదామనుకున్న వాళ్లు కూడా సర్వేలు చేసుకున్నారు. ఆ సర్వేల ఆధారంగా పార్టీ మారినవారు మళ్లీ వాతావరణ మార్పులతో ఇప్పుడు లబోదిబోమంటున్నారు.

ఏడాది కాలంగా ఈ సర్వే బృందాలు ఇస్తున్న నివేదికలను స్థూలంగా పరిశీలిస్తే, సీట్ల సంఖ్యలో తేడాలు కనబడుతున్నాయే తప్ప, ట్రెండ్‌లో తేడాల్లేవు. ఈ మేరకు సర్వేలు సరిగ్గానే జరిగినట్టు అనుకోవాలి. మొదట్లో బీజేపీ బాగా పుంజుకున్నట్టు కనబడింది. బీఆర్ఎస్‌తో నువ్వా నేనా అన్నట్టుగా పోటీపడింది. ఇంకేముంది కొద్ది రోజుల్లో మిగిలిన పార్టీల్లోని ముఖ్యనేతలంతా బీజేపీలో చేరిపోతారు, వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి ఖాయమని చాలామంది ప్రగాఢంగా నమ్మారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు నెమ్మదిగా కమలం వైపు కదులుతున్న సూచనలు కనిపించాయి. కానీ కేసీఆర్ చాణక్యాన్ని అంచనా వేయడంలో బీజేపీ నాయకత్వం విఫలమైంది. ఆ పార్టీకి అత్యంత కీలక నాయకుడైన బీఎల్ సంతోష్ జుట్టును కేసీఆర్ దొరకబుచ్చుకోవడంతో అది చేష్టలుడిగిపోయింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలు ప్రయత్నాల వెనుక బీఎల్ సంతోష్ ప్రమేయాన్ని కేసీఆర్ ప్రభుత్వం నిరూపణ చేయగలిగింది. దాని అడుగులు నెమ్మదించాయి. పులి మీద పుట్రలా కర్ణాటక ఫలితాలు. ఇంతటితో ఈ సంవత్సరపు తొలి అంకం సమాప్తం.

రెండో అంకంలో కాంగ్రెస్ పార్టీ జబ్బలు చరుచుకోవడం మనకు కనిపిస్తుంది. కర్ణాటక ఫలితాలు అందజేసిన ఆక్సిజన్ అందుక్కారణం. బీజేపీతో పోల్చితే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ విస్తృతి ఎక్కువ. ఎక్కువమందికి ఆమోదయోగ్యమైన పార్టీ కూడా! కేసీఆర్‌ను వ్యతిరేకించే వారిలో చాలామంది బీజేపీతో సౌకర్యంగా ఉండలేరు. కాంగ్రెస్‌తో ఆ ఇబ్బంది లేదు. అంతేకాకుండా ప్రతి పల్లెలో కాంగ్రెస్ జెండాను ఎత్తుకోవడానికి కనీసం పదిమందైనా ఇప్పటికీ మిగిలే ఉన్నారు. మైనారిటీ ఓటర్లకు బీఆర్ఎస్‌తో పాటు కాంగ్రెస్ కూడా ఒక చాయిస్‌గా ఉంటుంది. ఈ కారణాల రీత్యా కాంగ్రెస్ పార్టీలోకి పెద్దఎత్తున వలసలుంటాయన్న అంచనాలు వెలువడ్డాయి. కొన్ని వలసలు జరిగాయి కూడా! ఖమ్మం, నల్లగొండ, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాల్లోనే కాంగ్రెస్ పార్టీ కనీసం 30 సీట్లు గెలుచుకుంటుందన్న అంచనాలు కూడా వచ్చాయి. మిగిలిన ఏడు ఉమ్మడి జిల్లాల్లో ఇంకో 30 గెలిచినా చాలని అనుకున్నారు. 'అనుకున్నామని జరగవు అన్నీ' అంటారు. రాజకీయాల్లో అస్సలు జరగవు. కాంగ్రెస్ పార్టీ బలమైన స్థావరాలుగా భావించే ప్రాంతాల్లో బీఆర్ఎస్ పెద్దపెద్ద వలలు వేసి కూర్చున్నదనే సంగతి అర్థమయ్యే సరికి పుణ్యకాలం దాటిపోయింది.

అంతఃకలహాలు కాంగ్రెస్ పార్టీకి వారసత్వ లక్షణమే కావచ్చు. కానీ ఇప్పుడున్నంత తీవ్రస్థాయి వైరుధ్యాలు మునుపెన్నడూ లేవని కాంగ్రెస్ నాయకులే చెబుతున్నారు. ఒక వర్గాన్ని మరో వర్గం ఓడించడానికి కూడా వెనకాడనంత తీవ్రస్థాయిలో వైరుధ్యాలున్నాయని వారు అంగీకరిస్తున్నారు. ఎన్నికల తర్వాత ఎవరికి నాయకత్వం అప్పగించినా ఇంకొందరు పార్టీ మారడానికి వెనుకాడని పరిస్థితులున్నాయని చెబుతున్నారు. పార్టీ కీలక నాయకుడే తనపై దుష్ప్రచారం చేస్తున్నారని మరో కీలక నేత కెప్టెన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆరోపించారు. 35 నుంచి 40 స్థానాల్లో పార్టీకి బలమైన అభ్యర్థులు లేరంటూ వ్యూహకర్త సునీల్ కనుగోలు నివేదిక ఇవ్వడంలోనూ, ఎంపిక చేసిన మీడియా సంస్థలకు దాని లీకులివ్వడంలోనూ పార్టీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హస్తం ఉండవచ్చని సీనియర్ నాయకులు కొందరు అనుమానిస్తున్నారు. ఒక వ్యూహం ప్రకారమే ఈ అంశాన్ని ముందుకు తెచ్చారని వారు అభిప్రాయపడుతున్నారు.

గతంలో స్పష్టంగా కనిపించిన ప్రభుత్వ వ్యతిరేకత స్థానంలో నెలరోజులుగా ఫీల్‌గుడ్ వాతావరణం క్రమంగా ఆవరిస్తుండటం తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికరమైన పరిణామం. కాంగ్రెస్, బీజేపీల స్వయంకృతాపరాధాలు, వేసుకున్న సెల్ఫ్ గోల్స్ కూడా ఇందుకు కారణం కావచ్చు. బీఆర్‌ఎస్‌తో కుదిరిన లోపాయకారీ ఒప్పందం మేరకే బీజేపీ కొంత వెనక్కు తగ్గిందనే ప్రచారం కూడా బలంగానే ఉన్నది. ఇందులో నిజానిజాలు ఎట్లా ఉన్నా, కాంగ్రెస్ – బీఆర్‌ఎస్‌ల మధ్యనే పోటీ ఉండే పరిస్థితి ఏర్పడితే సహజంగానే కాంగ్రెస్ ఓడిపోవాలని బీజేపీ కోరుకుంటుంది. అది దాని రాజకీయ అవసరం.

ఇంకో అతి ముఖ్యమైన విషయం నాయకత్వ సమస్య. కేసీఆర్‌కు ధీటైన నాయకుడు ప్రతిపక్షాల్లో కంచుకాగడా వేసుకొని వెతికినా ఎవరూ కనిపించరు. ఎన్నికలు ఇప్పుడే జరిగితే ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైనన్ని సీట్లు బీఆర్‌ఎస్ గెలుచుకుంటుందని తాజాగా జరిగిన అన్ని గ్రూపుల సర్వేల్లోనూ వెల్లడైనట్టు విశ్వసనీయ సమాచారం. బీఆర్‌ఎస్ గెలిచే సీట్లలో దాదాపు సగం సీట్లు గెలిచి కాంగ్రెస్ రెండో స్థానంలో ఉంటుందట! బీజేపీ మూడో స్థానంతో సర్దుకోవచ్చంటున్నారు. పార్లమెంట్ ఎన్నికలొచ్చేసరికి రెండు మూడు స్థానాలు మారతాయట! రెండో స్థానంలోకి బీజేపీ చేరుతుంది.

ఒకపక్క కాపురమంతా కలహాల సంతగా సాగుతుండగానే ఏలిన్నాటి శని మాదిరిగా తెలంగాణ కాంగ్రెస్‌ను చంద్రబాబు తగులుకున్నారు. గత ఎన్నికల్లో గెలుపు అంచుల దాకా చేరిందనుకున్న కాంగ్రెస్ పార్టీ అవకాశాలు చివరి రెండు నెలల్లో తలకిందులు కావడానికి ఆ పార్టీకి తెలుగుదేశంతో కుదిరిన పొత్తే కారణమని పరిశీలనలో వెల్లడైంది. ప్రస్తుతం పీసీసీ అధ్యక్షుడుగా ఉన్న రేవంత్‌రెడ్డి ఇప్పటికీ బాబుకు సన్నిహితుడేనని కాంగ్రెస్ వాళ్లే ప్రచారం చేస్తున్నారు. ఇటీవల ప్రారంభమైన 'బిగ్ టీవీ' అనే న్యూస్ ఛానల్ ఆయన ఆధ్వర్యంలోనే నడుస్తున్నదని చెబుతున్నారు. ఈ ఛానల్ తెలంగాణలో రేవంత్‌కూ, ఏపీలో చంద్రబాబుకూ ప్రచారం చేసిపెడుతున్నది. కాంగ్రెస్‌కు బలమైన స్థావరాలుగా పేరున్న ప్రాంతాల్లో, వర్గాల్లో ఇది పెద్ద చర్చనీయాంశంగా మారింది. చంద్రబాబు పార్టీకి అనుబంధంగా వ్యవహరిస్తున్న 'తానా' (అమెరికా) సభల్లో రేవంత్ పాల్గొనడం, అక్కడ చేసిన ఉపన్యాసం కూడా కాంగ్రెస్ వర్గాలతోపాటు తెలంగాణ అంతటా వివాదాస్పదంగా మారింది.



ఉచిత విద్యుత్‌పై రేవంత్‌రెడ్డి అనాలోచితంగా చేసిన కామెంట్ కూడా కాంగ్రెస్‌కు పెద్ద మైనస్‌గా మారింది. రేవంత్ కామెంట్‌ను తనకు అనుకూలమైన రీతిలో ఎడిట్ చేసి బీఆర్ఎస్ ప్రచారంలో పెట్టింది. ఉచిత విద్యుత్‌ను కాంగ్రెస్ వ్యతిరేకిస్తున్నదనే మెసేజ్‌ను ఇరవై నాలుగ్గంటలలోపే ప్రతి రైతు చెంతకూ చేరవేసిన బీఆర్ఎస్ తన సంస్థాగత బలాన్ని మరోసారి చాటి చెప్పింది. నష్టనివారణ కోసం కాంగ్రెస్ పార్టీ కొంత ప్రయత్నం చేసింది కానీ, అది ఫలించలేదు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి సబ్‌స్టేషన్లలో హడావిడి చేసి ప్రభుత్వం 24 గంటల విద్యుత్ సరఫరా చేయడం లేదంటూ రికార్డులేవో చూపించబోయారు. కానీ రైతులెవరూ దాన్ని పట్టించుకోలేదు. తనకు సరిపోయే కరెంటు వస్తున్నప్పుడు అది ఇరవై నాలుగ్గంటలా? పన్నెండు గంటలా అనే లెక్కలెవరికి కావాలి? చిట్టచివరి అసెంబ్లీ సమావేశాల్లో సైతం కేటీఆర్ దూకుడు ముందు కాంగ్రెస్ వెలవెలబోయింది. కాంగ్రెస్‌కు సంఖ్యాబలం లేమి ఒక కారణమైతే కావచ్చు గానీ గేమ్‌లో చివరి గోల్‌ను కూడా బీఆర్ఎస్ కొట్టిందనేది ఒక వాస్తవం.

గతంలో స్పష్టంగా కనిపించిన ప్రభుత్వ వ్యతిరేకత స్థానంలో నెలరోజులుగా ఫీల్‌గుడ్ వాతావరణం క్రమంగా ఆవరిస్తుండటం తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికరమైన పరిణామం. కాంగ్రెస్, బీజేపీల స్వయంకృతాపరాధాలు, వేసుకున్న సెల్ఫ్ గోల్స్ కూడా ఇందుకు కారణం కావచ్చు. బీఆర్ఎస్‌తో కుదిరిన లోపాయకారీ ఒప్పందం మేరకే బీజేపీ కొంత వెనక్కు తగ్గిందనే ప్రచారం కూడా బలంగానే ఉన్నది. ఇందులో నిజానిజాలు ఎట్లా ఉన్నా, కాంగ్రెస్ – బీఆర్ఎస్‌ల మధ్యనే పోటీ ఉండే పరిస్థితి ఏర్పడితే సహజంగానే కాంగ్రెస్ ఓడిపోవాలని బీజేపీ కోరుకుంటుంది. అది దాని రాజకీయ అవసరం. ఇంకో అతి ముఖ్యమైన విషయం నాయకత్వ సమస్య. కేసీఆర్‌కు ధీటైన నాయకుడు ప్రతిపక్షాల్లో కంచుకాగడా వేసుకొని వెతికినా ఎవరూ కనిపించరు. ఎన్నికలు ఇప్పుడే జరిగితే ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైనన్ని సీట్లు బీఆర్ఎస్ గెలుచుకుంటుందని తాజాగా జరిగిన అన్ని గ్రూపుల సర్వేల్లోనూ వెల్లడైనట్టు విశ్వసనీయ సమాచారం. బీఆర్ఎస్ గెలిచే సీట్లలో దాదాపు సగం సీట్లు గెలిచి కాంగ్రెస్ రెండో స్థానంలో ఉంటుందట! బీజేపీ మూడో స్థానంతో సర్దుకోవచ్చంటున్నారు. పార్లమెంట్ ఎన్నికలొచ్చేసరికి రెండు మూడు స్థానాలు మారతాయట! రెండో స్థానంలోకి బీజేపీ చేరుతుంది.

ఫీల్‌గుడ్ వాతావరణం మొదలైన తర్వాతనే కేసీఆర్ మరింత దూకుడును పెంచి వరసగా తాయిలాలను ప్రకటించడం మరో ఆసక్తికరమైన పరిణామం. బొటాబొటీగా కాకుండా భారీ విజయాన్ని నమోదు చేస్తే ఆ ప్రభావం లోక్‌సభపై కూడా పడుతుందని ఆయన భావిస్తుండవచ్చు. జాతీయ పార్టీగా ప్రకటించిన తర్వాత డబుల్ డిజిట్‌ను తాకకపోతే బాగుండదనే అభిప్రాయం ఉండవచ్చు. 2018 ఎన్నికల వాగ్దానమైన రైతు రుణమాఫీ కొంతమేరకు చేసిన అనంతరం అటకెక్కింది. ఇప్పుడు మళ్లీ దాన్ని కిందకు దించి పూర్తిచేయబోతున్నట్టు ప్రకటించారు. చేతివృత్తుల వారికి లక్ష సాయం, మైనారిటీలకు లక్ష సాయం, వీఆర్ఏల సర్వీసు క్రమబద్ధీకరణ, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ... ఇలా వరస వరాలను ప్రకటిస్తున్నారు. అన్నిటికంటే ఆశ్చర్యకరమైనది ప్రభుత్వంలో ఆర్టీసీని విలీనం చేయడం! ఏపీలో జగన్ ప్రభుత్వం ఈ పని చేసినప్పుడు అది సాధ్యం కాదని ఎద్దేవా చేసిన కేసీఆర్ ఇప్పుడు అదే బాట పట్టారు. పనిలో పనిగా కోకాపేట సమ్మోహనాన్ని ప్రయోగించారు. ఈ ప్రయోగం ఎందుకు చేసినట్టు? ఎకరా వందకోట్ల చొప్పున మూడున్నర ఎకరాల బిట్టు కొన్నవాళ్లు ఎన్ని అంతస్థులు కడితే గిట్టుబాటు అవుతుంది? మొత్తం ఎన్ని వేల ఫ్లాట్లు కట్టాలి? చదరపు అడుగుకు ఎంత ధర పెడితే గిట్టుబాటు అవుతుంది. భారీ ధర పెట్టి కొనుగోలు చేయగలిగినవారు వేల సంఖ్యలో వారికి దొరుకుతారా? మూడున్నర ఎకరాల్లో వేల కుటుంబాలుంటే పర్యావరణ సమస్యలు ఏర్పడవా? ఇలాంటివన్నీ మనలాంటి అల్పజీవులకు కలిగే సందేహాలు. ప్రభువుల లెక్క వేరు. బుల్లెట్ దిగిందా లేదా! 'హైదరాబాద్ షైనింగ్' అనే ప్రచారం బాగా పనిచేస్తే బుల్లెట్ దిగినట్టే! ఈ షైనింగ్, ఫీల్‌గుడ్‌లతో ఇంకో ప్రమాదం కూడా ఉన్నది. ఒక్కోసారి ఈ ప్రచారం వికటించవచ్చు. వాజపేయి ప్రభుత్వం కూడా ఫీల్‌గుడ్ తుపాకీ ట్రిగ్గర్ నొక్కి ఎన్నికలకు వెళ్లింది. తుపాకీ పేలలేదు, బుల్లెట్ దిగలేదు. ఈ తుపాకీ పేలుతుందేమో చూడాలి.

vardhelli1959@gmail.com

గ్రహం అనుగ్రహం

శ్రీశోభకృత్‌నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, అధిక శ్రావణ మాసం, **తిథి:** బ.పంచమి ప.1.04 వరకు, తదుపరి, షష్ఠి, **నక్షత్రం:** ఉత్తరాభాద్ర ఉ.9.19 వరకు, తదుపరి రేవతి, **వర్జ్యం:** రా.8.43 నుండి 10.15 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.44, నుండి 5.36 వరకు, **అమృతఘడియలు:** తె.5.50 నుండి 7.22 వరకు (తెల్లవారితే సోమవారం); **రాహుకాలం:** సా.4.30 నుంచి 6.00 వరకు, **యమగండం:** ప.12.00 నుంచి 1.30 వరకు, **సూర్యోదయం:** 5.43, **సూర్యాస్తమయం:** 6.28.

నిత్యావసరాలు, అత్యవసరాలకు ఇబ్బందులే..

ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం టక్కుగూడ గ్రామ గిరిజనులు సరుకుల కోసం ఇలా వాగు దాటుతూ, బురదమయంగా ఉన్న రోడ్ల గుండా మండల కేంద్రానికి చేరుకోవాల్సిన దుస్థితి నెలకొంది. రేషన్ సరుకులు, ఎరువులు, వైద్యం, ఇతర పనుల నిమిత్తం కార్యాలయాలకు రావాలంటే సర్కస్ ఫీట్లు చేయక తప్పదు. నేటికీ తమ బతుకులు మారడం లేదంటూ గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం వచ్చిందంటే ఉట్నూర్ మండలంలోని మారుమూల గ్రామాల రోడ్లు, వంతెనలు దెబ్బతిని కుమ్మరికుంట, వంకతుమ్మ, బాబాపూర్, రాజులగూడ, నర్సాపూర్ గ్రామాల గిరిజనులకు ఇబ్బందులు తప్పని పరిస్థితి.



ఎప్పుడూ ఇబ్బందే..

భీంపూర్ మండలం కరంజి(టి) గ్రామపంచాయతీ పరిధిలోకి వచ్చే రాజుల్‌వాడి గ్రామం నుంచి గ్రామ పంచాయతీకి వెళ్లేందుకు సుమారు 3 కిలోమీటర్ల దూరం ఉండే ఈ మట్టి రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు అస్తవ్యస్తంగా తయారైంది. ఈ గ్రామ వాసులు నిత్యావసర సరుకుల కొనుగోలు, ఇతర అవసరాల కోసం కరంజి (టి)కి వెళ్లాల్సిందే. ఈ రోడ్డు బాగోలేకపోవడంతో ఎప్పుడూ ఇబ్బందులే.



‘దారి’ తోచక.. దిక్కులేక..

ఆదిలాబాద్ జిల్లాలో భారీ వర్షాలకు రహదారులు ఛిద్రం.. దెబ్బతిన్న వంతెనలు, కల్వర్టులు

వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు.. అత్యవసర సమయాల్లో ప్రాణాలు పోతున్న వైనం

ఏజెన్సీ ప్రాంతాల వాసులకు మరిన్ని కష్టాలు



రోడ్లు లేక.. డాక్టర్లు రాక..

➤ వర్షానికి పాడైన రోడ్లు.. సమయానికి అందుబాటులో లేని డాక్టర్లు.. వెరసి ఈ నెల 3న ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలంలో మూడేళ్ల బాలుడు పరశురాం మృతిచెందిన ఘటన ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నింపింది. జ్వరం, వాంతులు, విరోచనాలతో ఆ బాలుడు తీవ్ర అస్వస్థతకు గురైనప్పటికీ అతని తండ్రి పంద్ర లక్ష్మణ్.. రోడ్డు బాగాలేదనే కారణంతో అంతకు ముందు రోజు రాత్రి దూరంగా ఉన్న ఆస్పత్రికి తన బిడ్డను తీసుకెళ్లలేకపోయాడు. మరుసటి రోజు ఉదయం బురద, గుంతల రోడ్డుపై తన బిడ్డను బైక్‌పై ఆస్పత్రికి తీసుకెళుతుండగా మధ్యలోనే బాలుడి పరిస్థితి విషమించింది. తీరా ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు వెళ్లినప్పటికీ డాక్టర్లు అందుబాటులో లేక సకాలంలో వైద్యం అందక పోవడంతో పరశురాం మృతిచెందాడు. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లాలో గ్రామీణ ప్రాంతాల రోడ్ల దుస్థితిని తేటతెల్లం చేస్తోంది.

సాక్షి, ఆదిలాబాద్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లాలోని ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్లు, వంతెనలు, కల్వర్టులు దెబ్బతిన్నాయి. రోడ్లపై పెద్ద పెద్ద గుంతలు, కోతలు ఏర్పడ్డాయి. ఇక ఏజెన్సీ ప్రాంతాల్లో పక్కా రోడ్లు లేకపోవడంతో అక్కడి ప్రజలు తాత్కాలిక దారులను ఏర్పాటు చేసుకొని రాకపోకలు సాగించడం పరిపాటిగా మారింది. పరశురాం మృతిచెందిన బజార్‌హత్నూర్ మండలంలోని డెర్రా గ్రామ రోడ్డుదీ ఇదే పరిస్థితి. ఈ రోడ్డుతో కలుపుకొని జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో 40 రోడ్ల నిర్మాణానికి గిరిజన సంక్షేమ శాఖ నుంచి గత ఏడాది నవంబర్ 14న రూ.42.29 కోట్లు మంజూరయ్యాయి. అయితే అటవీ ప్రాంతాలను ఆనుకొని ఉన్న గిరిజన గూడేలు, తండాల గుండా రోడ్లు వేసేందుకు అటవీ శాఖ నుంచి అనుమతులు లభించకపోవటంతో పనులు ప్రారంభం కాని పరిస్థితి నెలకొంది. దీంతో మంజూరైన నిధులు ఇప్పటికీ మూలుగుతూనే ఉన్నాయని తెలుస్తోంది. రోడ్లు దెబ్బతినడంతో ప్రజల దైనందిన జీవనం దుర్భరంగా మారింది. ముఖ్యంగా అనారోగ్య సమస్యలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రభుత్వానికి నివేదిక

➤ ఆదిలాబాద్ జిల్లాలో ఇటీవలి భారీ వర్షాలకు ఆర్‌అండ్‌బీకి సంబంధించి దాదాపు 87 కిలోమీటర్ల మేర రోడ్లు, వంతెనలు, కల్వర్టులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. రూ.28.6 కోట్ల నష్టం వాటిల్లింది. తాత్కాలికంగా వాటి పునరుద్ధరణకు రూ.74 లక్షలు, పక్కాగా బాగుచేయడానికి రూ.80 కోట్లు అవసరమని అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ఇక పంచాయతీరాజ్ రోడ్లకు సంబంధించి 111 రోడ్లు, వంతెనలు, కల్వర్టులు 144 కిలోమీటర్ల మేర అస్తవ్యస్తంగా తయారయ్యాయి. వీటి తాత్కాలిక మరమ్మతులకు రూ.67 లక్షలు అవసరం కాగా, రోడ్లు, బ్రిడ్జీల పూర్తిస్థాయి మరమ్మతులకు రూ.255 కోట్లు అవసరమని ప్రభుత్వానికి నివేదించారు.

యాదాద్రిలో హైకోర్టు జడ్జి పూజలు



జస్టిస్ కె.సుజనాకు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న ఆలయాధికారులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని హైకోర్టు జడ్జి జస్టిస్ కె.సుజనా కుటుంబ సభ్యులతో కలిసి శనివారం దర్శించుకున్నారు. వారికి ఆలయ ఆచార్యులు స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్టా అలంకారమూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు వారికి లడ్డూ ప్రసాదం అందజేశారు.

యాదాద్రి ఆలయ మండపాల్లో బోర్డులు



మండపాల్లో ఏర్పాటు చేసిన బోర్డులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి వచ్చే భక్తులకు ఆయా పూజలు నిర్వహించే మండపాలు సులువుగా తెలిసేలా అధికారులు బోర్డులు ఏర్పాటు చేశారు. ఆలయ ప్రథమ ప్రాకార మండపాల్లో భక్తులకు నిర్వహించే వేదాశీర్వచనం, అమ్మవారికి ప్రతి శుక్రవారం ఊంజలి సేవ నిర్వహించే అద్దాల మండపం, భక్తులతో చేపట్టే నిత్య కల్యాణ మండపం వద్ద బోర్డులను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

గుట్టలు, వాగులు దాటి..



వాగు దాటుతున్న హెల్త్ అసిస్టెంట్

వాజేడు: ములుగు జిల్లా వాజేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని హెల్త్ అసిస్టెంట్ చిన్న వెంకటేశ్వర్లు, ఆశావర్కర్ సమ్మక్క, అటెండర్లు ఆదినారాయణ, దూలయ్య బృందం గుట్టలపై ఉన్న పెనుగోలు గ్రామానికి వెళ్లి వైద్యం అందించింది. ముందుగా వాజేడు నుంచి గుమ్మడిదొడ్డి గ్రామానికి ఓ వాహనంలో వెళ్లారు. అక్కడి నుంచి 15 కిలోమీటర్లు కాలినడకన బయలుదేరారు. మార్గమధ్యంలో గుట్టలెక్కుతూ, మూడు వాగులు దాటుతూ ముందుకు సాగారు. చివరికి ఓ గుట్టపైనున్న పెనుగోలు గ్రామానికి చేరుకొని ఇంటింటి సర్వే చేశారు. పిల్లలు, పెద్దల నుంచి రక్త నమూనాలను సేకరించారు. గ్రామంలో దోమలమందు పిచికారీ చేశారు.

దొంగనుకుని సర్పంచ్‌కు దేహశుద్ధి

నల్లబెల్లి: దొంగగా భావించిన గ్రామస్తులు సర్పంచ్‌కు దేహశుద్ధి చేశారు. ఈ ఘటన వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం మామిండ్లవీరయ్యపల్లిలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. మామిండ్లవీరయ్యపల్లిలో పెంతల సాంబరెడ్డి, యారరవి మధ్య ఇంటిస్థలం విషయమై కొద్దిరోజులుగా వివాదం నడుస్తోంది. దీనిపై గ్రామపెద్దల సమక్షంలో శుక్రవారం పంచాయితీ పెట్టారు. అనంతరం రాత్రిపూట ఇరువర్గాల పెద్దమనుషులు వేర్వేరుగా దావత్ చేసుకున్నారు. సర్పంచ్ అమరేందర్‌తోపాటు పలువురు మాటుకాసి సాంబరెడ్డి పెద్దమనుషుల దావత్ దృశ్యాలను మొబైల్‌లో రికార్డు చేస్తుండగా పలువురు గమనించారు. ‘దొంగ, దొంగా’ అని అరుస్తూ సర్పంచ్‌పై దాడి చేసి గాయపరిచారు. ఈ మేరకు శనివారం స్థానిక పోలీసులకు ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేసుకున్నారు.

క్లుప్తంగా...

హోంగార్డు కుటుంబానికి డీజీపీ ఆర్థికసాయం



సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది మే 4న రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన హోంగార్డు మజ్జి గోవిందరావు కుటుంబ సభ్యులకు డీజీపీ అంజనీకుమార్ ఆర్థిక సాయం అందించారు. శనివారం ఉదయం తన కార్యాలయంలో డీజీపీ అంజనీకుమార్, గోవింద్‌రావు భార్య ఉమాదేవికి రూ.30 లక్షల చెక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. చనిపోయిన వారిని తిరిగి తీసుకురాలేకున్నా, బాధిత కుటుంబాన్ని ఆదుకోవడానికి ఆర్థిక సాయం అందించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీజీ అభిలాషబిస్త్, హోంగార్డ్స్ డీఐజీ అంబర్ కిషోర్‌ఝా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ బ్రాంచ్ బ్యాంకింగ్ హెడ్ తరుణ్ చౌదరి, జోనల్ హెడ్‌లు జోస్ స్టీఫెన్, రాజీవ్‌కుమార్, ఏరియా హెడ్ కె.సత్యనారాయణరావు పాల్గొన్నారు.

కోతుల దాడితో బావిలోపడ్డ వృద్ధురాలు



బావిలో వేలాడుతున్న రాజవ్వ

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): కోతులు మూకుమ్మడిగా దాడి చేయడంతో ఓ వృద్ధురాలు బావిలో పడింది. ఈ సంఘటన రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లో శనివారం చోటుచేసుకుంది. రాచర్లబొప్పాపూర్‌కు చెందిన గంభీర్‌పూర్ రాజవ్వ (68) ఇంటి బయట కూర్చుని ఉండగా.. హఠాత్తుగా కోతుల గుంపు దాడి చేశాయి. కోతుల నుంచి తప్పించుకునే ప్రయత్నంలో పక్కనే ఉన్న బావిలో పడి మధ్యలో ఇరుక్కుపోయింది. కేకలు వేయడంతో సమీప ఇళ్లలోని యువకులు వచ్చి బావిలో వేలాడుతున్న రాజవ్వను తాళ్ల సహాయంతో బయటకు లాగారు. అపస్మారకస్థితిలో ఉన్న రాజవ్వను ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగానే ఉంది.

పెండింగ్‌లో పెట్టి తప్పించుకునే యత్నం

- ఆర్టీసీ బిల్లుపై ప్రభుత్వం పన్నాగం
- ప్రతిపక్ష నేతలను పందులు, కుక్కలు, గాడిదలంటున్నారు
- అవి వింటుంటే సభకు ఎందుకు వస్తున్నామా..అనిపిస్తోంది
- సభ నడిపే పద్ధతి ఇది కాదు.. ఈ రోజు స్పీకర్‌ను కలుస్తాం: సీఎల్పీ నేత భట్టి



సాక్షి, హైదరాబాద్: ‘‘ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని మేము అడిగితే తలకాయ ఉన్నోడు చేయడు అని సీఎం కేసీఆర్ అన్నారు. ఇప్పుడు ఎన్నికలు దగ్గర పడ్డాయని ప్రకటన చేశారు. బిల్లును పెండింగ్‌లో పడేటట్టు చేసి తప్పించుకునే పనిలో కేసీఆర్ ఉన్నారు. అని కాంగ్రెస్ శాసనసభా పక్షం నేత మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. బిల్లు విషయంలో కుంటి సాకులు ఎందుకని ప్రశ్నించారు. శనివారం సభ వాయిదా పడిన అనంతరం ఎమ్మెల్యేలు శ్రీధర్ బాబు, సీతక్కలతో కలిసి ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. 60 రోజులు జరగాల్సిన శాసనసభా సమావేశాలను గరిష్ఠంగా 10 రోజులకు కుదించిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనని ఎద్దేవా చేశారు.

కేటీఆర్ అడ్డగోలుగా మాట్లాడుతున్నారు

ప్రతిపక్షాలు లేవనెత్తిన సమస్యలపై కేటీఆర్ అసెంబ్లీలో అడ్డగోలుగా మాట్లాడారని భట్టి విమర్శించారు. ప్రతిపక్ష నేతలను పందులు, కుక్కలు, గాడిదలు అని మాట్లాడటం చూస్తుంటే సభకు ఎందుకు వస్తున్నామా అని అనిపిస్తోందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉండేది రెండు నెలలేనని, ఇప్పుడు బుకాయించినా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వారి తప్పులు తేలుస్తామని హెచ్చరించారు. సభ నడిపే విధానం ఇది కాదని, ఈ విషయంపై ఆదివారం స్పీకర్‌ని కలుస్తామని చెప్పారు. ఎమ్మెల్యే శ్రీధర్ బాబు మాట్లాడుతూ సమస్యలు చెప్తే ఓపికగా వినాల్సిన మంత్రులు అసహనంతో మాట్లాడుతున్నారని, మంత్రుల తీరును రాష్ట్ర ప్రజలు గమనించాలని కోరారు. తెలంగాణ ఇచ్చిన పార్టీగా ప్రజల పక్షాన బాధ్యతతో తాము చెపుతున్నామని, ప్రతిపక్షాలకు అవకాశం ఇచ్చే విషయంలో సభ హుందాతనం కాపాడే విధంగా స్పీకర్ వ్యవహరించాలని కోరారు.

అసెంబ్లీనా.. బీఆర్‌ఎస్ కార్యాలయమా?: శ్రీధర్

ఈ అసెంబ్లీ తీరు చూస్తుంటే ప్రజలకు భరోసా ఇచ్చే వేదికలా లేదని, బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలా మారిందని శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యే సీతక్క మాట్లాడుతూ వరద బాధితులకు అసెంబ్లీ ద్వారా భరోసా ఇస్తారని తాము అనుకున్నామని, అలా కాకుండా అసెంబ్లీని పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. టిఫిన్ చేయడానికి తాము బయటకు వెళితే సభలో కాంగ్రెస్ సభ్యులు లేరనే ప్రజలకు అబద్ధాలు చెప్పే ప్రయత్నం చేస్తున్నారన్నారు.

ప్రగతి కాదు.. సర్పంచ్‌లకు దుర్గతి

- అన్నీ గొప్పలే తప్ప పంచాయతీలకు నిధులెక్కడ ఇస్తున్నారు?
- చేసిన పనులకే బిల్లులివ్వట్లేదు....ఆర్థిక బాధతో సర్పంచ్‌ల ఆత్మహత్యలు
- పల్లె, పట్టణ ప్రగతిపై సభలో స్వల్ప చర్చ
- ప్రభుత్వంపై సీఎల్పీ నేత భట్టి ధ్వజం
- ఆయన చెప్పేవన్నీ శుద్ధ అబద్ధం.. అసత్య ప్రచారమంటూ ప్రసంగానికి అడ్డుతగిలిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు
- పాదయాత్రతో అలసిపోయి భట్టి అసత్యాలు చెబుతున్నాడని కేటీఆర్ ఎద్దేవా

సాక్షి, హైదరాబాద్: పల్లె, పట్టణ ప్రగతి పథకాల పేరుతో ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడమే తప్ప, వాటికి నిధులే ఇవ్వడం లేదని కాంగ్రెస్ శాసనసభా పక్ష నేత మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. చేసిన పనులకు బిల్లులు ఇవ్వకపోవడంతో గ్రామ సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి ఉందని, దీనికి ప్రభుత్వం జవాబు చెప్పాలన్నారు. పల్లె, పట్టణ ప్రగతిపై శాసనసభలో శనివారం జరిగిన స్వల్పవ్యవధి చర్చలో భట్టి ప్రభుత్వ వైఖరిని తూర్పారబట్టారు. ట్రాక్టర్లకు ఈఎంఐలు కట్టలేక, డీజిల్ సమకూర్చుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఏకగ్రీవ పంచాయతీలకు ఇస్తానన్న నిధులూ ఇవ్వలేదన్నారు. రాజధానికి గ్రామీణుల వలసలు పెరిగినా, హైదరాబాద్‌లో మౌలిక వసతులు మెరుగుపర్చలేదని విమర్శించారు.

హైదరాబాద్ అభివృద్ధి కాంగ్రెస్ చలవే: రాజధానిలో ఈ మాత్రం అభివృద్ధి జరిగిందంటే అది కాంగ్రెస్ హయాంలోనే అని భట్టి స్పష్టం చేశారు. అందువల్లే హైదరాబాద్‌లో భూముల రేట్లు పెరిగాయన్నారు. ప్రజల కోసం కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్మించిన ఔటర్ రింగ్ రోడ్డును ఓ ప్రైవేటు కంపెనీకి 30 ఏళ్లకు కట్టబెట్టడం దారుణమని నిందించారు. ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాకు రింగు రోడ్డు ధారాదత్తం చేయడంపై పూర్తి వివరాలు సభ ముందుంచాలని భట్టి డిమాండ్ చేశారు. చెరువులు, నీటి కుంటల్లో క్రీడా ప్రాంగణాలు అంటూ బోర్డులు పెట్టడం ప్రజలను మోసం చేయడమేనన్నారు.

భట్టి క్షమాపణ చెప్పాలి: బీఆర్‌ఎస్ డిమాండ్

భట్టి ప్రసంగానికి మంత్రులు అడుగడుగునా అడ్డుపడ్డారు. అనారోగ్యంతో ఇల్లంతలకుంట సర్పంచ్ చనిపోతే, రాజకీయం చేస్తున్నారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే రసమయి బాలకృష్ణ అభ్యంతరం చెప్పారు. సభను తప్పుదోవ పట్టించినందుకు భట్టి క్షమాపణ చెప్పాలని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. పాదయాత్రతో అలసిపోయి అసత్యాలు మాట్లాడుతున్నాడని మంత్రి కేటీఆర్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీలకు పదేళ్లలో రూ. 4వేల కోట్లు ఇస్తే, తాము 9 ఏళ్లలోనే రూ.31 వేల కోట్లు ఇచ్చామని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు చెప్పారు. హైదరాబాద్ అభివృద్ధిపై భట్టి అబద్ధాలు చెబుతున్నారని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆక్షేపించారు. ఈ చర్చలో ఎమ్మెల్యేలు వివేకానంద, ఆలె వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

సఫీయుద్దీన్ కుటుంబానికి మంత్రి కేటీఆర్ చేయూత

- భార్యకు ఉద్యోగం, డబుల్ బెడ్రూమ్ ఇల్లు, రూ.6 లక్షల ఆర్థిక సాయం




అంజుమ్‌కు నియామక పత్రం అందజేస్తున్న మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: జైపూర్ ముంబై రైలులో జూలై 31న రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ కానిస్టేబుల్ చేతిలో హత్యకు గురైన హైదరాబాద్ వాసి సయ్యద్ సఫీయుద్దీన్ కుటుంబానికి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావు చేయూతను అందించారు. సఫీయుద్దీన్ భార్య అంజుమ్ షహీన్‌కు కులీ కుతుబ్ షా డెవలప్‌మెంట్ అథారిటీలో ఆఫీస్ సబార్డినేట్‌గా ఉద్యోగం కల్పిస్తూ శనివారం అసెంబ్లీలో నియామక పత్రం అందజేశారు. జియాగూడలో డబుల్ బెడ్ రూమ్ ఇల్లుతో పాటు రూ.6 లక్షల ఆర్థిక సాయం చెక్కును కూడా బీఆర్‌ఎస్ తరపున కేటీఆర్ అందజేశారు. సఫీయుద్దీన్ కుటుంబం పరిస్థితిని ఎంఐఎం శాసనసభాపక్షం నేత అక్బరుద్దీన్ ఒవైసీ శుక్రవారం శాసనసభ వేదికగా మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకొచ్చారు. కుటుంబానికి ఏకైక దిక్కుగా ఉన్న సఫీయుద్దీన్ మరణంతో వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించగా ఆదుకుంటామని కేటీఆర్ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే.

సర్పంచుల ఇబ్బందులు వర్ణనాతీతం: రఘునందన్

- జనవరి నుంచి నిలిచిన ఫైనాన్స్ కార్పొరేషన్ నిధులు



సాక్షి, హైదరాబాద్: గ్రామ పంచాయతీలకు జనవరి నుంచి రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ నిధులు రావడం లేదని, తద్వారా సర్పంచులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. శనివారం శాసనసభలో పల్లెప్రగతి– పట్టణప్రగతిపై జరిగిన లఘు చర్చలో ఆయన మాట్లాడారు. 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులను ఇతర పనులకు మళ్లిస్తున్నారని ఆరోపించారు. గ్రామాల్లో అభివృద్ధి, మరమ్మతు పనులు చేసినా బిల్లులు రాలేదని సర్పంచ్‌లు ఆందోళన చెందుతున్నారని, పలువురు ఆత్మహత్య కూడా చేసుకున్నారని, వీటిపై ప్రభుత్వం ఏం సమాధానం చెబుతుందని ప్రశ్నించారు. ఏకగ్రీవంగా ఎన్నికైన పంచాయతీలకు ఇంకా ప్రోత్సాహక నిధులు ఇవ్వలేదన్నారు. కొత్త మునిసిపాలిటీలలో నిధుల్లేక, పనులు జరగక అవి అధ్వానంగా మారాయని పేర్కొన్నారు.

నేనేం పాపం చేశానమ్మా..

- చెట్ల పొదల్లో ఆడ శిశువు మృతదేహం
- పీక్కు తింటూ బయటకు లాక్కొచ్చిన శునకాలు

భువనగిరి: నవజాత శిశువును ఓ తల్లి కనకరం లేకుండా వదిలేసింది. చెట్ల పొదల్లో విసిరేసిన ఆ శిశువును కుక్కలు పీక్కు తింటూ బయటకు తీసుకురావడంతో విషయం వెలుగులోకి వచ్చింది. యాదాద్రి జిల్లాలో ఈ దారుణ ఘటన వెలుగు చూసింది. భువనగిరి పట్టణంలోని పాత శిల్పా హోటల్ వెనుక భాగంలో బాబూ జగ్జీవన్‌రామ్ భవనం ఉంది. అక్కడ ఓ పార్టీకి చెందిన నాయకులు శనివారం సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. భవనం సమీపంలోనే సమాధులు, చెట్ల పొదలు ఉన్నాయి. సమావేశం నుంచి బయటికి వచ్చిన ఓ మహిళ చెట్ల పొదల్లో అప్పుడే పుట్టిన శిశువును కుక్కలు బయటకు లాక్కురావడాన్ని గమనించింది. ఈ విషయాన్ని ఆమె తోటి నాయకులకు చెప్పగానే వారు అక్కడికి వచ్చి కుక్కలను తరిమికొట్టారు. అప్పటికే ఆ ఆడశిశువు మృతిచెందినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఐసీడీఎస్ సిబ్బంది సహాయంతో పోస్టుమార్టం నిమిత్తం శిశువు మృతదేహాన్ని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.



శిశువు మృతదేహాన్ని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

క్లుప్తంగా...

దాడి కేసులో బీజేపీ ఎంపీకి రెండేళ్ల జైలు

లోక్‌సభ సభ్యత్వం రద్దయ్యే అవకాశం



న్యూఢిల్లీ: ప్రైవేట్ విద్యుత్ సంస్థ 'టొరెంట్ పవర్' కార్యాలయంపై దాడి, ఉద్యోగులపై చేయి చేసుకున్న కేసులో బీజేపీకి చెందిన లోక్‌సభ ఎంపీ రాం శంకర్ కతేరియాకు రెండేళ్ల జైలు శిక్ష పడింది. 2011లో జరిగిన ఘటనకు సంబంధించి ఆగ్రాలోని ఎంపీ/ఎమ్మెల్యేలపై కేసులను విచారించే ప్రత్యేక న్యాయస్థానం ఆయనకు రూ.50 వేల జరిమానా కూడా విధిస్తూ శనివారం తీర్పునిచ్చింది. జైలు శిక్ష కారణంగా కతేరియా లోక్‌సభ సభ్యత్వం రద్దయ్యే అవకాశముంది. కాగా, కోర్టు తీర్పుపై న్యాయపరంగా ఉన్న అవకాశాల మేరకు ముందుకెళతానని కతేరియా తెలిపారు. యూపీలోని ఇటావా నుంచి ఆయన లోక్‌సభకు ఎన్నికయ్యారు. దాడి ఘటనకు సంబంధించి ఆయనపై ఐపీసీ 147, 323 సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. రాంశంకర్ కతేరియా గతంలో ఎస్సీ–ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా, కేంద్ర సహాయ మంత్రిగా పనిచేశారు.

నవంబర్ నుంచి కంప్యూటర్లపై ఆంక్షలు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు, ట్యాబ్లెట్ పీసీల దిగుమతులపై విధించిన ఆంక్షల అమలును మూడు నెలలు వాయిదా వేస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించింది. దిగుమతులపై విధించిన ఆంక్షలు నవంబర్ 1 నుంచి అమలులోకి రానున్నాయని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) వెల్లడించింది. ఎలక్ట్రానిక్స్ కంపెనీలు ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు, ట్యాబ్లెట్ పీసీలను భారత్‌కు దిగుమతి చేసుకోవాలంటే నవంబర్ 1 నుంచి ప్రభుత్వ లైసెన్స్ తప్పనిసరి. కాగా, లైసెన్స్ కలిగిన కంపెనీలు మాత్రమే ఈ పరికరాలను దిగుమతి చేసుకోవాల్సి ఉంటుందని, ఉత్తర్వులు వెంటనే అమలులోకి తీసుకువస్తున్నట్టు ఆగస్ట్ 3న కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు వెలువరించిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ నిర్ణయంతో పరిశ్రమ ఒక్కసారిగా షాక్‌కు గురైంది. కంప్యూటర్లలో అంతర్గత భద్రత లొసుగులతో కార్పొరేట్ కంపెనీలు, వ్యక్తుల డేటాకు ముప్పు ఏర్పడే ప్రమాదం పొంచి ఉందన్న కారణంతో తప్పనిసరి లైసెన్స్ విధానానికి కేంద్ర ప్రభుత్వం తెరతీసింది.

జ్ఞానవాపి మసీదులో రెండోరోజూ సర్వే

వారణాసి: వారణాసిలోని జ్ఞానవాపి మసీదులో పురావస్తు శాఖ(ఏఎస్‌ఐ) అధికారుల సర్వే రెండో రోజూ కొనసాగింది. హిందూ ఆలయ నిర్మాణంపైనే 17వ శతాబ్దంలో ఈ మసీదును నిర్మించారనే పిటిషన్‌పై వారణాసి కోర్టు శాస్త్రీయ సర్వేకు ఆదేశించిన విషయం తెలిసిందే. శనివారం ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు సర్వే పనులు సాగాయి. ఏఎస్‌ఐ అధికారులతోపాటు ప్రభుత్వ న్యాయవాది రాజేశ్ మిశ్రా, ఐఐటీ కాన్పూర్ నిపుణులు, అంజుమన్ ఇంతెజామియా మసీదు కమిటీ సభ్యులు అక్కడున్నారు. ఆదివారం కూడా సర్వే కొనసాగుతుందని అధికారులు తెలిపారు. సర్వేకు పూర్తిగా సహకరిస్తున్నట్లు మసీదు కమిటీ తెలిపింది. మసీదులో శాస్త్రీయ సర్వే జరపాలంటూ వారణాసి జిల్లా కోర్టు ఇచ్చిన ఆదేశాలను అలహాబాద్ హైకోర్టు, ఆ తర్వాత సుప్రీంకోర్టు సమర్థించడం తెలిసిందే. సెప్టెంబర్ 4 లోగా సర్వే పూర్తి చేయాలని శుక్రవారం వారణాసి కోర్టు ఆదేశాలు జారీ చేసింది.

ఇమ్రాన్ క్లీన్‌బౌల్డ్

తోషఖానా కేసులో మూడేళ్ల జైలు శిక్ష, వెంటనే అరెస్ట్

ఎన్నికల్లో పోటీ చేయకుండా ఐదేళ్లు అనర్హత వేటు



లాహోర్‌లోని ఇమ్రాన్‌ఖాన్ నివాసం వద్ద పోలీసు బందోబస్తు

ఇస్లామాబాద్: పాకిస్తాన్ ఎన్నికలకి సన్నాహాలు జరుగుతున్న వేళ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్‌ఖాన్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. తోషఖానా అవినీతి కేసులో ఇస్లామాబాద్ జిల్లా కోర్టు ఆయనను దోషిగా తేలుస్తూ మూడేళ్ల జైలు శిక్ష విధించింది. వచ్చే అయిదేళ్ల పాటు ఎన్నికల్లో పోటీ చేయడానికి వీల్లేకుండా ఇమ్రాన్‌పై అనర్హత వేటు వేసింది. ఇస్లామాబాద్ జిల్లా సెషన్స్ కోర్టు అదనపు న్యాయమూర్తి హుమాయూన్ దిలావర్ శనివారం ఇమ్రాన్‌కు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పిన కాసేపటికే పోలీసులు ఆయనను అరెస్ట్ చేశారు. 2018 నుంచి 2022 మధ్య కాలంలో ప్రధానిగా ఉన్న ఇమ్రాన్‌ఖాన్ ప్రభుత్వానికి వచ్చిన కానుకల్ని అక్రమ మార్గాల్లో కారు చౌకగా తానే కొనుగోలు చేశారని తోషఖానా కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ కేసులో మూడేళ్ల జైలు శిక్షతో పాటుగా న్యాయమూర్తి లక్ష రూపాయల జరిమానా కూడా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఆరు నెలలు జైల్లో ఉండాల్సి ఉంటుందని తీర్పులో స్పష్టం చేశారు. ''ఇమ్రాన్‌ఖాన్ ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వానికి వచ్చిన కానుకల్ని తీసుకున్నారు. ఆ కానుకల ద్వారా తాను పొందిన ఆర్థిక లబ్ధిని దాచి ఉంచడానికి ప్రయత్నించారు. తోషఖానా కానుకలకు సంబంధించిన సమాచారం అందించడంలో ఇమ్రాన్‌ఖాన్ మోసం చేశారనడానికి తగిన ఆధారాలున్నాయి. ఇమ్రాన్‌ఖాన్ నిస్సందేహంగా అవినీతిపరుడని రుజువైంది'' అని న్యాయమూర్తి హుమయూన్ ఆ తీర్పులో పేర్కొన్నారు. ఎప్పుడైతే మూడేళ్ల జైలు శిక్ష పడిందో రాజ్యాంగంలోకి ఆర్టికల్ 63(1)(హెచ్) ప్రకారం అయిదేళ్లపాటు ఇమ్రాన్‌పై అనర్హత వేటు పడింది. ఇమ్రాన్‌ఖాన్ పదవిలో ఉన్న మూడున్నరేళ్ల కాలంలో ప్రపంచ దేశాల అధినేతల నుంచి రూ.14 కోట్ల విలువైన 58 కానుకలు పొందారు. ఆగస్టు 9న జాతీయ అసెంబ్లీని రద్దు చేసి మూడు నెలల్లోగా ప్రభుత్వం ఎన్నికలకు వెళ్లనున్న నేపథ్యంలో ఇమ్రాన్‌కు శిక్ష పడడం చర్చనీయాంశంగా మారింది. న్యాయమూర్తి తీర్పు వెలువరించిన కొద్ది సేపటికే లాహోర్‌లోని జమన్ పార్క్‌లో ఇమ్రాన్‌ఖాన్ నివాసం నుంచి ఆయనను పోలీసులు అరెస్ట్ చేశారు. లాహోర్ నుంచి ఇమ్రాన్‌ను హెలికాప్టర్‌లో ఇస్లామాబాద్‌కు తరలించారు.

శాంతియుతంగా నిరసనలు చేయండి: ఇమ్రాన్‌ఖాన్


అరెస్ట్‌ను ముందే ఊహించిన ఇమ్రాన్.. కార్యకర్తలనుద్దేశిస్తూ చేసిన ప్రసంగాన్ని రికార్డు చేసి ఉంచారు. ఇమ్రాన్ అరెస్ట్ అయిన కొద్ది గంటల్లోనే ఆయన సందేశాన్ని సామాజిక మాధ్యమాల్లో విడుదల చేశారు. 'సందేశం మీరు వినే సమయానికి నేను జైల్లో ఉంటాను. పార్టీ సభ్యులందరూ ఇళ్లలో కూర్చోకుండా బయటకు వచ్చి శాంతియుతంగా నిరసనలు చేయండి. నేను చేస్తున్న పోరాటం నా కోసం కాదు. మీ కోసం. మీ పిల్లల భవిష్యత్ కోసం. మీరు మీ హక్కుల కోసం పోరాడకపోతే బానిసలుగా బతకాల్సి వస్తుంది. బానిసలకు ఎప్పుడూ బతుకు ఉండదు. బానిసలంటే నేల మీద పాకే చీమలతో సమానం. వారు పైకి ఎగరలేరు. ఎదగలేరు. మీ హక్కుల్ని మీరు కాపాడుకునే వరకు శాంతియుత నిరసనలు చేయండి. భవిష్యత్‌లో మీరు ఎన్నుకునే ప్రభుత్వం ఉండాలి కానీ కబ్జా మాఫియా కాదు'' అని ఇమ్రాన్ తన సందేశంలో పేర్కొన్నారు. తనను అరెస్ట్ చేయడానికి ఒక్క రోజు ముందు ఇమ్రాన్ ఖాన్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ అఖండ విజయం సాధిస్తుందన్న భయం ప్రభుత్వానికి ఉందని విమర్శించారు. గణనీయంగా ఓటు బ్యాంకు పెరుగుతున్న తమ పార్టీని ఎలా నిర్వీర్యం చేస్తారని ఇమ్రాన్ ప్రశ్నించారు.

భుట్టో నుంచి ఇమ్రాన్ వరకు

పాకిస్తాన్ ప్రధానులు, మాజీ ప్రధానులు జైలు పాలవడం సర్వసాధారణంగా మారింది. ఒక్కసారి చరిత్రలోకి తొంగి చూస్తే ఎందరో తమ చరమాంకంలో జైలు జీవితాన్నే గడిపారు. మిలటరీయే శక్తిమంతంగా ఉండే దేశంలో జనరల్ అయూబ్‌ఖాన్, యాహ్యాఖాన్, జియా ఉల్ హక్, పర్వేజ్ ముషార్రఫ్ వంటి వారు నిర్దాక్షిణ్యంగా ప్రభుత్వాల్ని కూలదోసి పగ్గాలు చేపట్టారు.

- పాకిస్తాన్ అయిదో ప్రధానిగా సేవలందించిన షాహీద్ సుహ్రావార్డీ జాతి వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలపై 1962లో జైలు పాలయ్యారు. అప్పటి మిలటరీ పాలకుడు జనరల్ అయూబ్ ఖాన్‌కు మద్దతు ఇవ్వడానికి నిరాకరించడంతోనే ఆయనపై కేసులు పెట్టారు.
- దేశ తొమ్మిదో ప్రధాని జుల్ఫీకర్ ఆలీ భుట్టో తన రాజకీయ ప్రత్యర్థి హత్యకు కుట్ర పన్నారన్న అభియోగాలపై 1974లో అరెస్ట్ చేశారు. 1979, ఏప్రిల్ 4న ఆయనని ఉరి తీశారు.
- దేశానికి ఏకైక మహిళా ప్రధాని అయిన బెనజీర్ భుట్టో పలుమార్లు అరెస్టయ్యారు. 1985లో తొలిసారిగా ఆమెను హౌస్ అరెస్ట్ చేశారు. తిరిగి 1999లో అవినీతి కేసులో ఆమెకు అయిదేళ్ల జైలు శిక్ష పడింది. శిక్షను తప్పించుకోవడానికి ఆమె ప్రవాసం వెళ్లిపోయారు. తిరిగి దేశానికి వచ్చాక 2007లో రావల్పిండిలో ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్నాక బెనజీర్ దారుణ హత్యకు గురయ్యారు.
- 1999లో జనరల్ పర్వేజ్ ముషార్రఫ్ పదవీ పగ్గాలను తీసుకున్నాక అప్పటి ప్రధాని నవాజ్ షరీఫ్‌ను అరెస్ట్ చేశారు. ఆ తర్వాత ఆయన పదేళ్ల పాటు ప్రవాసంలో ఉన్నారు. 2018 జూలైలో నవాజ్ షరీఫ్, ఆయన కుమార్తె అవినీతి కేసులో పదేళ్ల జైలు శిక్ష పడింది. 2019లో చికిత్స కోసం లండన్ వెళ్లిన ఆయన ఇప్పటికీ తిరిగి రాలేదు.

➤ పాకిస్తాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్‌ఖాన్ జైలుపాలయ్యే పరిస్థితి వస్తుందని ముందే ఊహించినట్టున్నారు. గతంలో కొన్ని ఇంటర్వ్యూల్లో ఆఖరి బంతి వరకు పోరాటం చేస్తూనే ఉంటానని చెప్పారు. తనని జైలు పాలు చేసినా, అనర్హత వేటు వేసినా రాబోయే ఎన్నికల్లో తమ పార్టీయే విజయం సాధిస్తుందని పలు సందర్భాల్లో ధీమాగా చెప్పారు. మరి ఆయన విశ్వాసానికి తగ్గట్టుగా భవిష్యత్ ఉండబోతోందా ? ఇమ్రాన్‌కు జైలు శిక్ష పడిన కేసు ఏమిటి ? ముందుండి నడిపించాల్సిన నాయకుడు కటకటాల పాలైతే పార్టీ పరిస్థితి ఏంటి?



ఏమిటీ తోషఖానా కేసు..?

➤ తోషఖానా.. అంటే ప్రభుత్వానికి దేశ విదేశీ ప్రతినిధుల నుంచి వచ్చే కానుకల ఖజానా. ప్రభుత్వంలో ఉన్న పెద్దలు తమకు ఎవరు ఏ కానుక ఇచ్చినా తోషఖానాకు తప్పనిసరిగా అప్పగించాలి. ఇమ్రాన్ ప్రధానిగా ఉన్న మూడేళ్లలో 58 కానుకలు వచ్చాయి. అలా వచ్చిన కానుకల్ని ప్రధాని తీసుకోవాలంటే దాని ధరలో సగం చెల్లించాలని నిబంధనలు చెబుతున్నాయి. కానీ ఇమ్రాన్ ప్రభుత్వం నిబంధనల్ని సవరించి అసలు ధరలో 20 శాతం మాత్రమే చెల్లించి కానుకలు తన సొంతం చేసుకున్నారు. 2018, సెప్టెంబర్ 24 నాటికి అలా వచ్చిన కానుకల్లో 15.4 కోట్ల విలువైన కానుకల్ని కేవలం 3 కోట్లకే ఆయన సొంతం చేసుకున్నట్టుగా ప్రభుత్వ నివేదికలు వెల్లడించాయి. పాకిస్తాన్ ముస్లిం లీగ్–నవాజ్ (పీఎంఎల్–ఎన్) నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2022 ఆగస్టులో తోషఖానా వివాదంపై కేసు నమోదైంది.

కొన్ని కానుకలు.. ఒక మాజీ ప్రధాని

పీటీఐపై నీలినీడలు?

➤ పాకిస్తాన్ తెహ్రీకీ ఇన్సాఫ్ (పీటీఐ)ఇమ్రాన్‌ఖాన్ ప్రజలపై వేసిన ప్రభావం గత అయిదు దశాబ్దాల్లో మరే నాయకుడు వెయ్యలేకపోయాడు. ప్రజల్లో ఆయనకున్న ఫాలోయింగ్ తిరుగులేనిది. గత మేలో అవినీతి ఆరోపణలపై ఇమ్రాన్‌ను అరెస్ట్ చేసినప్పుడు పీటీఐ కార్యకర్తలు దేశంలో ఒక యుద్ధ వాతావరణాన్ని సృష్టించారు. వారిని నియంత్రించడం ప్రభుత్వానికి అతి పెద్ద సవాల్‌గా మారింది. గతంలో పాకిస్తాన్ మాజీ ప్రధానులు బెనజీర్ భుట్టో, నవాజ్ షరీఫ్, షాహిద్‌ఖాన్ అబ్బాసి వంటి వారు అవినీతి కేసుల్లో అరెస్ట్ అయినప్పటికీ పట్టించుకోని ప్రజలు ఇమ్రాన్ ఖాన్ విషయంలో మిలటరీకే ఎదురు తిరిగారు. ప్రభుత్వ ఆస్తుల్ని ధ్వంసం చేశారు. ఇమ్రాన్‌ఖాన్ అభిమానుల్లో అప్పట్లో కనిపించిన ఆగ్రహావేశాలు చూస్తే పార్టీ పునాదులు ఎవరూ కదపలేరన్న భావన కలుగుతుంది. ఇమ్రాన్‌ఖాన్ ఒక్కడే నిజాయితీపరుడని, ఆర్థికంగా కుదేలైన దేశాన్ని ఆయన మాత్రమే గాడిలో పెట్టగలరన్న భావన ప్రజల్లో బలంగా ఉంది. కానీ పవర్ పాలిటిక్స్ వేరుగా ఉంటాయి. ఇమ్రాన్‌ఖాన్‌కు బాగా మొండివాడన్న పేరుంది. రాజకీయాల్లో ఆయనకి స్నేహితుల కంటే శత్రువులే ఎక్కువ మంది ఉన్నారు. ఇమ్రాన్ ప్రధాని కావడానికి కారకుడైన అప్పటి ఆర్మీ చీఫ్ ఖమర్ జావేద్ బజ్వాతో ఆయన ఎక్కువ కాలం సత్సంబంధాలు నడపలేకపోవడమే దీనికి నిలువెత్తు నిదర్శనం. ఇమ్రాన్ పార్టీని నామరూపాలు లేకుండా చేయడానికి ప్రస్తుత ఆర్మీ చీఫ్ జనరల్ అసీమ్ మునీర్, పాకిస్తాన్ తెహ్రీకీ ఇన్సాఫ్ సంకీర్ణ సర్కార్ శతవిధాలా ప్రయత్నిస్తున్నాయి. ఇమ్రాన్‌ను కేసుల ఉచ్చులో బిగించాయి. గత రెండు నెలల్లో పార్టీకి చెందిన సీనియర్ నాయకులు 80 మందికి పైగా పార్టీని వీడారు. వారిని బెదిరించి పార్టీని వీడేలా చేశారని ఇమ్రాన్ ఆరోపించినప్పటికీ వరసపెట్టి కీలకమైన నాయకులు వెళ్లిపోవడం పార్టీ భవిష్యత్‌పై ప్రభావం చూపిస్తుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇమ్రాన్ గతంలో అరెస్ట్ అయినప్పుడు ప్రభుత్వ ఆస్తుల్ని ధ్వంసం చేసిన వేలాది మంది పార్టీ కార్యకర్తలు మిలటరీ జైళ్లలో ఉన్నారు. పాకిస్తాన్‌లో ఈ నెల 9న జాతీయ అసెంబ్లీని రద్దు చేయనున్న నేపథ్యంలో ఇమ్రాన్ ఖాన్ జైలు పాలవడం ఆయన పార్టీకి శరాఘాతంలా తగిలింది. పార్లమెంటు రద్దయిన 3 నెలల్లో ఎన్నికలు జరుగుతాయి. ఇమ్రాన్‌పై ఐదేళ్ల అనర్హత వేటు పడడంతో ఆయన ఈ సారి ఎన్నికల్లో పోటీ చేయడానికి వీల్లేకుండా అయింది. పార్టీని ముందుండి నడిపించాల్సిన నాయకుడు కటకటాల మధ్య ఉంటే పార్టీ ఎంతవరకు మనుగడ సాగించగలదన్న ప్రశ్నలైతే వినిపిస్తున్నాయి. అయితే ఇమ్రాన్ ఆశలన్నీ ఇప్పుడు పై కోర్టులోనే ఉన్నాయి. కోర్టు ఇచ్చిన తీర్పుని పీటీఐ లాహోర్ హైకోర్టులో సవాల్ చేసింది. ఇమ్రాన్‌ను అరెస్ట్ చేయలేదని, ఆయనపై తుపాకీ గురిపెట్టి అపహరించుకొని వెళ్లిపోయారని పీటీఐ తన పిటిషన్‌లో విమర్శించింది. వచ్చే ఎన్నికల్ని దృష్టిలో ఉంచుకొని ఇమ్రాన్ కూడా శాంతి మార్గాన్నే అనుసరిస్తున్నారు. అరెస్ట్‌కు ముందే చేసి ఉంచిన రికార్డు మెసేజ్‌లో ఆయన కార్యకర్తలకి శాంతియుతంగా ఉండాలని పిలుపునిచ్చారు. అయితే తోషఖానాతో సహా 150 కేసుల్ని ఎదుర్కొంటున్న ఇమ్రాన్ ఆ ఉచ్చులోంచి ఎలా బయటకి రాగలరన్న సందేహాలైతే ఉన్నాయి.

కానుక	ఖరీదు (పాక్ రూపాయల్లో)	ఇమ్రాన్ చెల్లించిన ధర
గ్రాఫ్ వాచీ	38 లక్షలు	5 లక్షలు
డైమండ్ రిస్ట్ వాచీ	8.5 కోట్లు	2 కోట్లు
రోలెక్స్ గడియారం	15 లక్షలు	2.9 లక్షలు

ఇంకా 87.5 లక్షల ఉంగరం, 56 లక్షల విలువైన కఫ్ లింక్స్ పెయిర్, 15 లక్షలు చేసే కలం, పెర్‌ఫ్యూమ్స్, ఐ ఫోన్లతోపాటు మసీదు, అత్తరుసీసాల నమూనా కళాకృతులు వంటివి అత్యంత చౌకగా ఇమ్రాన్ దక్కించుకున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

హరియాణాలో ఆగని బుల్డోజర్ డ్రైవ్

నూహ్ అల్లర్ల నిందితుల దుకాణాలు నేలమట్టం

గురుగ్రామ్: హరియాణాలోని నూహ్ జిల్లాలో విశ్వహిందూ పరిషత్ ఊరేగింపును అడ్డుకునేందుకు మరో వర్గం వ్యక్తులు చేసిన రాళ్లదాడి తదనంతర ఘటనల్లో పాల్గొన్న వ్యక్తులపై రాష్ట్ర ప్రభుత్వం బుల్డోజర్లతో సమాధానం చెబుతోంది. నూహ్ అల్లర్ల సంబంధ సీసీటీవీ వీడియోలో పోలీసులు గుర్తించిన నిందితులకు చెందిన దుకాణాలను అధికారులు బుల్డోజర్లతో నేలమట్టం చేశారు. మూడో రోజైన శనివారం సైతం ఈ బుల్డోజర్ డ్రైవ్ కొనసాగింది. అయితే, నల్హార్ వైద్య కళాశాలకు చెందిన 2.6 ఎకరాల భూమిలో కట్టిన అక్రమ నిర్మాణాలనే తాము కూల్చేశామని అధికారులు చెప్పడం గమనార్హం. నూహ్ అల్లర్ల నిందితులను లక్ష్యంగా చేసుకునే ఈ కూల్చివేత ప్రక్రియ మొదలుపెట్టారన్న ఆరోపణలను అధికారులు కొట్టిపారేశారు. అయితే నూహ్ జిల్లాలో పరిస్థితి కాస్తంత అదుపులోకి వచ్చిన నేపథ్యంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి మూడు గంటలదాకా కర్ఫ్యూను ఎత్తేస్తున్నట్లు జిల్లా మేజిస్ట్రేట్ ధీరేంద్ర చెప్పారు. భయంతో తరలిపోతున్న వలసకార్మికుల్లో భరోసా కల్పించేందుకు జిల్లా యంత్రాంగం ప్రయత్నించింది. డెప్యూటీ కమిషనర్ నిశాంత్ కుమార్ సెక్టార్ 58, 70 సమీపంలోని పలు మురికివాడల్లో పర్యటించి వలసకార్మికులతో మాట్లాడారు. ఎలాంటి భయం లేకుండా పనులకు వెళ్లొచ్చని హామీ ఇచ్చారు.



యూనియన్ స్క్వేర్ వద్దకు చేరిన యువత. (ఇన్‌సెట్‌లో) కారుపై దాడి దృశ్యం

యూట్యూబర్ ఫ్రీ గిఫ్టుల ప్రకటన.. రణరంగంగా న్యూయార్క్ వీధులు

న్యూయార్క్: అభిమానులను నేరుగా కలుసుకుని, గిఫ్టులిస్తానంటూ ఆన్‌లైన్ ఇన్‌ఫ్లుయెన్సర్ చేసిన ప్రకటన..న్యూయార్క్ వీధుల్లో రణరంగానికి కారణమైంది. కాయ్ సెనట్(21)కు ట్విట్చ్, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఇతర సామాజిక మాధ్యమాల్లో లక్షల్లో ఫాలోవర్లున్నారు. శుక్రవారం లోయర్ మన్‌హట్టన్‌లో లైవ్ స్ట్రీమ్ ఈవెంట్ చేస్తానని, అభిమానులను నేరుగా కలుసుకుని ప్లేస్టేషన్–5 సహా పలు బహుమతులిస్తానంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు. దీంతో, యువత యూనియన్ స్క్వేర్, పరిసర వీధుల్లో రెండు వేల మందికి పైగా పోగయ్యారు. వీధుల్లో జనం పోటెత్తడంతో అక్కడే నిర్మాణ ప్రాంతం నుంచి కొందరు నినాదాలు చేస్తూ రాళ్లు, బాటిళ్లు వంటివి వారిపై విసిరారు. కొందరు వాహనాలను రోడ్డుపై అడ్డంగా ఉంచారు. కార్లను ధ్వంసం చేశారు. పరిస్థితిని చక్కదిద్దేందుకు వెయ్యి మందికి పైగా పోలీసులు రంగంలోకి దిగాల్సి వచ్చింది. ఘర్షణల్లో చాలా మంది గాయపడ్డారని పోలీసులు చెప్పారు. ఘటనకు కారణమైన సెనట్‌ను పోలీసులు ప్రశ్నిస్తున్నారు.

రాహుల్ సభ్యత్వాన్ని పునరుద్ధరించాలి

న్యూఢిల్లీ: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని ప్రభుత్వం తక్షణమే పునరుద్ధరించాలని ఆ పార్టీ నేత అధీర్ రంజన్ చౌధురి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. పరువు నష్టం కేసులో కోర్టు తీర్పుతో రాహుల్‌ను లోక్‌సభకు అనర్హుడిగా ప్రకటించినంత వేగంగానే సభ్యత్వాన్ని కూడా తిరిగి పునరుద్ధరించాలని స్పీకర్ ఓం బిర్లాను కోరామన్నారు. ఇందుకు అవసరమైన పత్రాలను సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన వెంటనే శుక్రవారం రాత్రి అందజేశామని, శనివారం ఉదయం కూడా మరికొన్నిటిని ఆయనకు పంపించామని వివరించారు. సోమవారం లోక్‌సభ సమావేశం ప్రారంభమయ్యేటప్పటికి రాహుల్ సభ్యత్వాన్ని పునరుద్ధరిస్తారని ఆశిస్తున్నామన్నారు. పరువు నష్టం కేసులో రాహుల్‌కు సూరత్ సెషన్స్ కోర్టు శిక్ష విధించిన 26 గంటల్లోనే ఆయన్ను ఎంపీగా అనర్హుడిగా ప్రకటిస్తూ లోక్‌సభ నోటిఫికేషన్ ఇచ్చిందని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ గుర్తు చేశారు. ఆ శిక్ష అన్యాయమంటూ సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పునకు కూడా 26 గంటలు గడిచాయన్నారు. అవిశ్వాస తీర్మానంపై చర్చలో రాహుల్ పాల్గొంటారని ప్రభుత్వం భయపడుతోందా అని జైరాం రమేశ్ ప్రశ్నించారు.

నేపాల్ ప్రధానితో మోదీ చర్చలు

న్యూఢిల్లీ: ఇరు దేశాల మధ్య పరస్పర సహకారంపై నేపాల్ ప్రధాన మంత్రి పుష్ప కమల్ దహల్ (ప్రచండ)తో భారత ప్రధాని మోదీ శనివారం చర్చలు జరిపారు. రెండు దేశాల మధ్య మైత్రి బంధాన్ని మరింత బలోపేతం చేయడంపై దృష్టిసారించామని ఆ తర్వాత ప్రధాని మోదీ చెప్పారు. ఈ మేరకు శనివారం ఇద్దరు నేతలు కొంతసేపు ఫోన్‌లో సంభాషించుకున్నారు. 'మే 31 నుంచి జూన్ మూడో తేదీ వరకు భారత్‌లో పర్యటించిన నేపాల్ ప్రధాని ప్రచండతో మోదీ పలు ద్వైపాక్షిక అంశాలపై చర్చించారు' అని ఆ తర్వాత ఢిల్లీలోని ప్రధాని కార్యాలయం శనివారం ఒక ప్రకటన విడుదలచేసింది. పొరుగు దేశం నేపాల్‌ను భారత్ చిరకాలంగా మిత్రదేశంగా పరిగణిస్తోంది.

లూనార్ ఆర్బిట్‌లోకి చంద్రయాన్‌-3

- చంద్రయాన్ ప్రయోగంలో విజయవంతంగా రెండో ఘట్టం పూర్తి
- ల్యాండర్ మాడ్యూల్‌ను చంద్రుడిపై దించడమే ఆఖరిఘట్టం



సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధనాసంస్థ (ఇస్రో) గత నెల 14న ప్రయోగించిన చంద్రయాన్-3 మిషన్‌ను శనివారం సాయంత్రం 7 గంటలకు లూనార్ ఆర్బిట్ (చంద్రుడి కక్ష్య)లోకి విజయవంతంగా ప్రవేశపెట్టారు. చంద్రయాన్-3 ప్రయోగాన్ని మూడు ఘట్టాలుగా విభజించారు. ప్రయోగం మొదటిది కాగా, ఉపగ్రహాన్ని చంద్రుడి కక్ష్యలోకి ప్రవేశపెట్టడం రెండోది. ల్యాండర్ మాడ్యూల్‌ను చంద్రుడిపై దించడమే ఆఖరి ఘట్టం. ఈ నెల 1న ట్రాన్స్ ఇంజెక్షన్ అనే ఆపరేషన్ ద్వారా అయిదురోజుల పాటు భూ మధ్యంత కక్ష్య నుంచి ప్రయాణించి లూనార్ ఆర్బిట్‌లోకి విజయవంతంగా చేరువైంది. భూ మధ్యంతర కక్ష్యలో భూమి దగ్గరగా (పెరిజీ) భూమికి దూరంగా (అపోజీ) మధ్యన దీర్ఘ వృత్తాకార కక్ష్యలో తిరిగే సమయంలో అయిదుసార్లు కక్ష్య దూరాన్ని పెంచిన విషయం తెలిసిందే. చంద్రుని కక్ష్యలో కూడా అయిదుసార్లు దీర్ఘ వృత్తాకార కక్ష్యలో పరిభ్రమిస్తూనే ఈ నెల 17 నాటికి చంద్రుడికి 100 కిలోమీటర్ల ఎత్తులో వృత్తాకార కక్ష్యలోకి దిగుతుంది. 23న ప్రొపల్షన్ మాడ్యూల్ చంద్రుడికి 30 కిలోమీటర్లు దగ్గరగా దిగి ల్యాండర్, రోవర్ మాడ్యూల్‌ను విడిచి పెడుతుంది. ఈ ఆపరేషన్‌తో ఈ ప్రయోగాన్ని విజయవంతం చేసేందుకు శాస్త్రవేత్తలు శ్రమిస్తున్నారు.

మళ్లీ మణిపూర్‌లో హింస

ముగ్గురిని హతమార్చిన మిలిటెంట్లు



ఇంఫాల్: జాతుల మధ్య వైరంతో రావణకాష్టంగా మారుతున్న మణిపూర్ రాష్ట్రంలో మళ్లీ ఘర్షణలు చెలరేగాయి. శుక్రవారం అర్ధరాత్రిదాటాకా బిష్ణుపూర్ జిల్లాలో ఓ వర్గం వారిపై జరిగిన దాడిలో తండ్రీకుమారుడు, మరో వ్యక్తి ప్రాణాలు కోల్పోయారు. క్వాక్టా ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. రాత్రి గాఢ నిద్రలో ఉండగా ఆందోళనకారులు వీరిపై కాల్పులు జరిపి తర్వాత కత్తులతో నరికారు. చురాచాంద్‌పూర్ ప్రాంతం నుంచి వచ్చిన వారే ఈ ఘాతుకానికి పాల్పడ్డారని పోలీసులు శనివారం తెలిపారు. తమ వారి మరణంతో ఆగ్రహించిన స్థానికులు ప్రతీకారం తీర్చుకునేందుకు చురాచాంద్‌పూర్‌కు బయల్దేరబో యారు. వీరిని భద్రతాబలగాలు అడ్డుకున్నాయి. అయితే దాడికి ప్రతీకారంగా ఉఖా తంపాక్ పట్టణంలో పలువురి ఇళ్లను నిరసనకారులు తగలబెట్టారు. శనివారం ఉదయం మిలిటెంట్లకు, భద్రతా బలగాలకు మధ్య జరిగిన కాల్పుల్లో ఒక పోలీసుసహా ముగ్గురికి బుల్లెట్ గాయాలయ్యాయి. మళ్లీ హింసాత్మక ఘటనలు పెరగడంతో కర్ఫ్యూ సడలింపు సమయాన్ని పాలనా యంత్రాంగం కుదించింది.

బంద్ ప్రశాంతం

మరోవైపు ఉద్రిక్త పరిస్థితులు, హింసాత్మక ఘటనలను నిరసిస్తూ శాంతి నెలకొనాలంటూ 27 శాసనసభ స్థానాల సమన్వయ కమిటీ ఇచ్చిన 24 గంటల సాధారణ బంద్ ఇంఫాల్ లోయలో జనజీవనాన్ని స్తంభింపజేసింది. శనివారం దాదాపు అన్ని ప్రాంతాల్లో వ్యాపారాలు, స్కూళలు మూతబడ్డాయి. అల్లర్లతో అవస్థలు పడుతున్న జనాన్ని మరింత ఇబ్బందిపెట్టడం మా ఉద్దేశం కాదు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకే ఈ బంద్ అని సమన్వయ కమిటీ ఎల్.వినోద్ స్పష్టంచేశారు. కుకీ మిలిటెంట్ సంస్థలకు, కేంద్ర ప్రభుత్వానికి మధ్య చాన్నాళ్ల తర్వాత చర్చలు పునరుద్ధరించబడిన తరుణంలో అల్లర్లు మొదలవడం గమనార్హం. మరోవైపు శాంతిస్థాపనకు చర్యలు చేపట్టాలని స్థానిక తెగల నేతల ఫోరం(ఐటీఎల్‌ఎఫ్) విజ్ఞప్తిచేసింది.

గ్రామాల బ్రాడ్‌బ్యాండ్ అనుసంధానికి రూ.1 లక్ష కోట్లు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా 6.4 లక్షల గ్రామాలను బ్రాడ్‌బ్యాండ్ ద్వారా అనుసంధానించే భారత్‌నెట్ ప్రాజెక్టు పనులు వేగం పుంజుకోనున్నాయి. ఇప్పటికే 1.94 లక్షల గ్రామాల్లో ఈ ఆప్టికల్ ఫైబర్ నెట్ అనుసంధానం పూర్తవ్వగా మొత్తంగా అన్ని గ్రామాలకు నెట్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన రూ.1.39 లక్షల కోట్ల నిధుల కేటాయింపునకు కేంద్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. మొదట నాలుగు జిల్లాల్లోని గ్రామాల అనుసంధానానికి ఉద్దేశించిన పైలెట్ ప్రాజెక్టు విజయవంతం కావడంతో ఈ ఫైబర్–టు–హోమ్ మోడల్‌ను తర్వాత వేర్వేరు రాష్ట్రాల్లోని 60వేల గ్రామాలకు విస్తరించారు. ప్రాజెక్టు ద్వారా 2.5 లక్షల ఉద్యోగాల సృష్టి సాధ్యమని ప్రభుత్వం భావిస్తోంది.

ఎట్టకేలకు గొన్సాల్వేజ్, ఫెరీరా విడుదల



ముంబై: ఎల్గార్ పరిషత్–మావోయిస్టులతో సంబంధాల కేసులో అరెస్టయి విచారణ ఖైదీగా సంవత్సరాల తరబడి జైలు జీవితం గడిపిన సామాజిక కార్యకర్తలు వెర్నాన్ గొన్సాల్వేజ్, అరుణ్ ఫెరీరాలు ఎట్టకేలకు జైలు నుంచి బెయిలుపై బయటికొచ్చారు. గత వారం వారికి బెయిల్ ఇస్తూ సర్వోన్నత న్యాయస్థానం తీర్పునివ్వడం తెల్సిందే. శనివారం ప్రత్యేక కోర్టు సంబంధిత విడుదల పత్రాలను నవీ ముంబైలోని తలోజ కారాగారం అధికారులకు పంపడంతో వారం తర్వాత ఎట్టకేలకు వారు బయటికొచ్చారు. జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్‌ఐఏ) దర్యాప్తు చేస్తూ ప్రత్యేక కోర్టు పరిశీలనలో ఉన్న ఈ కేసుకు సంబంధించి ఇప్పటిదాకా 16 మంది అరెస్టయ్యారు. గొన్సాల్వేజ్, అరుణ్‌తో కలిపి ఇప్పటిదాకా ఐదుగురు బెయిల్‌పై బయటికొచ్చారు. ఒక్కో నిందితుడు ఒక మొబైల్ వాడుకోవచ్చని, వారు ఉండే అడ్రస్ ఎన్‌ఐఏకు ఇవ్వాలని, సంబంధిత నిబంధనలు ఉల్లంఘిస్తే బెయిల్ రద్దు అవుతుందని ధర్మాసనం స్పష్టంచేసింది. విద్యావేత్త, కార్యకర్త ఆనంద్ తేల్‌తుంబ్డే, న్యాయవాది సుధా భరద్వాజ్‌లకు గతంలో సాధారణ బెయిల్ రాగా, అనారోగ్య కారణాలతో విప్లవ కవి వరవరరావు బెయిల్ సాధించారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో జైలు నుంచి బయటికొచ్చిన కార్యకర్త గౌతమ్ నవ్‌లఖా ప్రస్తుతం గృహనిర్బంధంలో ఉన్నారు.

గృహ నిర్బంధంలో మెహబూబా

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌కు స్వతంత్ర ప్రతిపత్తి కల్పించే రాజ్యాంగంలోని ఆర్టికల్ 370 రద్దుకు నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ఆందోళనలు జరగొచ్చన్న అనుమానాల నేపథ్యంలో పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. ముందు జాగ్రత్తగా వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నేతలను అదుపులోకి తీసుకుంది. పీడీపీ చీఫ్, మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీని గృహ నిర్బంధంలో ఉంచింది. కశ్మీర్‌లో సాధారణ పరిస్థితులున్నాయంటూ సుప్రీంకోర్టుకు చెబుతున్న కేంద్రం.. ఇక్కడ అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని మెహబూబా ట్వీట్ చేశారు. ఆర్టికల్ 370 రద్దుకు నాలుగేళ్లయిన సందర్భాన్ని పురస్కరించుకుని ఉత్సవాలు జరుపుకోవాలని ప్రజలను కోరుతూ భారీ హోర్డింగులు ఏర్పాటు చేసిన ప్రభుత్వం..మరో వైపు ప్రజల నిజమైన ఆకాంక్షలను అణగదొక్కుతోందన్నారు. ఆర్టికల్ 370 రద్దుపై విచారణ సమయంలో ఇలాంటి పరిణామాలను పరిగణనలోకి తీసుకోవాలని సుప్రీంకోర్టును ఆమె కోరారు. తాము శాంతియుతంగా నిర్వహించ తలపెట్టిన ర్యాలీకి పోలీసులు అనుమతివ్వలేదని పీడీపీ తెలిపింది. రాజ్‌భాగ్‌లో కొందరు పీడీపీ కార్యకర్తలు 'ఆగస్ట్ 5 బ్లాక్ డే'అనే ప్లకార్డులతో ర్యాలీ చేపట్టారు. కాగా, శ్రీనగర్‌లోని పీడీపీ, నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫీస్‌లను పోలీసులు మూసివేశారు.

Government Of India | Azadi Ka Amrit Mahotsav

అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా దేశవ్యాప్తంగా 508 రైల్వే స్టేషన్ల పునరుద్ధరణ

తెలంగాణ రాష్ట్రంలోని 21 స్టేషన్ల పునరాభివృద్ధి







₹ 25,000 కోట్ల వ్యయంతో 508 స్టేషన్లు ప్రపంచస్థాయి వసతులను సంతరించుకోనున్నాయి

తెలంగాణ రాష్ట్రంలో 21 స్టేషన్లు ₹ 914 కోట్ల వ్యయంతో ఆధునీకరణ

- ప్రతి స్టేషన్ నగర కేంద్రంగా అభివృద్ధి, స్టేషన్ భవనం అభివృద్ధి, రూఫ్ ప్లాజా, షాపింగ్ జోన్, ఫుడ్ కోర్ట్, పిల్లల ఆటస్థలం మొదలగు సౌకర్యాలు
- ప్రయాణికుల సౌకర్యార్థం వేరువేరుగా ప్రవేశ & నిష్క్రమణ మార్గాలు, మల్టీ లెవెల్ పార్కింగ్, లిఫ్టు, ఎస్కలేటర్, ఎగ్జిక్యూటివ్ లాంజ్, వేచియుండు ప్రదేశం, ట్రావలేటర్, దివ్యాంగుల కోసం ప్రత్యేక సదుపాయాలు
- మల్టీ మోడల్ కనెక్టివిటీ అనుసంధానంతో పునరాభివృద్ధి చెందిన స్టేషన్లు సామాజిక – ఆర్థిక కార్యకలాపాలకు కేంద్ర బిందువుగా రూపొందనున్నాయి

తెలంగాణ రాష్ట్రంలో పునరాభివృద్ధి చెందనున్న రైల్వే స్టేషన్లు

ఆదిలాబాద్	హైటెక్ సిటీ	జనగాం	కాజీపేట జం	మహబూబ్ నగర్	మల్కాజ్ గిరి	తాండూరు
భద్రాచలం రోడ్	ఉప్పుగూడ	కామారెడ్డి	ఖమ్మం	మహబూబాబాద్	నిజామాబాద్	యాదాద్రి
హఫీజ్ పేట	హైదరాబాద్	కరీంనగర్	మధిర	మలక్ పేట	రామగుండం	జహీరాబాద్

ప్రధాన మంత్రి

నరేంద్ర మోదీ

ద్వారా

శంకుస్థాపన

6 ఆగస్టు, 2023 ఉదయం 11.00 గం.లకు (వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా)



వీరి గౌరవ సమక్షంలో

శ్రీ అశ్విని వైష్ణవ్
కేంద్ర రైల్వే కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్స్ మరియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ మంత్రి

శ్రీ రావ్‌సాహెబ్ పాటిల్ దాన్వే
రైల్వే, బొగ్గు మరియు గనుల శాఖ సహాయ మంత్రి, భారత ప్రభుత్వం

శ్రీమతి దర్శన జర్దోష్
రైల్వే మరియు వస్త్ర శాఖ సహాయ మంత్రి భారత ప్రభుత్వం

DD NEWS న్యూస్ లో ప్రత్యక్ష ప్రసారం

PUB0678 A1231

క్లుప్తంగా...

కామారెడ్డి నుంచి అసెంబ్లీకి కేసీఆర్ పోటీ

ఎమ్మెల్యే గోవర్ధన్



సాక్షి, హైదరాబాద్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు వంద శాతం కామారెడ్డి నియోజకవర్గం నుంచే పోటీ చేస్తారని ఎమ్మెల్యే గంప గోవర్ధన్ వెల్లడించారు. కామారెడ్డి నుంచి పోటీ చేయాలని గతంలోనూ తాను కేసీఆర్‌ను కోరినట్లు తెలిపారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా శనివారం లాబీల్లో మీడియాతో కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్ పిచ్చాపాటిగా మాట్లాడారు. కామారెడ్డి జిల్లా కోనాపూర్ సీఎం కేసీఆర్ సొంత గ్రామమని, అది మానేరు జలాశయంలో మునిగిపోవడంతో వారి కుటుంబం చింతమడకకు వలస వెళ్లిందని పేర్కొన్నారు. కామారెడ్డిలో పోటీ చేస్తే ఒక సామాన్య కార్యకర్తగా సీఎం కేసీఆర్ విజయం కోసం పనిచేస్తానని, తన రాజకీయ భవిష్యత్తును కేసీఆర్ నిర్ణయిస్తారని గోవర్ధన్ పేర్కొన్నారు.

'భూ సర్వే చేయలేదు.. టైటిల్ గ్యారంటీ తేలేదు'

కోదండరెడ్డి, అన్వేశ్‌రెడ్డి విమర్శ..

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భూ సర్వే చేయలేదని, టైటిల్ గ్యారంటీ హామీ చట్టం తేలేదని ఏఐసీసీ కిసాన్ సెల్ వైస్‌చైర్మన్ కోదండరెడ్డి, టీపీసీసీ కిసాన్ సెల్ అధ్యక్షుడు అన్వేశ్‌రెడ్డి ఆరోపించారు. అసైన్డ్ భూములకు దేశంలో అన్ని రాష్ట్రాలు భూమి హక్కు చట్టం తెచ్చి పట్టా భూములు ప్రకటించాయని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పక్కనున్న ఆంధ్రప్రదేశ్‌లో కూడా చట్టం తెచ్చి భూమి హక్కు కల్పించిందని గుర్తు చేశారు. వెంటనే పక్క రాష్ట్రాల్లో తెచ్చిన చట్టాలను అధ్యయనం చేసి భూమి హక్కులు కల్పించాలని కోరారు.


'కూచుకుళ్ల రాజీనామా చేయాలి'

సాక్షి, హైదరాబాద్: కుమారుడిని కాంగ్రెస్‌లోకి పంపించిన ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి బీఆర్ఎస్ ద్వారా సంక్రమించిన తన పదవికి రాజీనామా చేయాలని స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గులాబీ కండువాను కప్పుకుని రేవంత్‌రెడ్డికి కూచుకుళ్ల గులాంగిరీ చేస్తామంటే సహించేది లేదని శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. నైతిక విలువలు ఉంటే కూచుకుళ్ల రాజీనామా చేయాలని హితవు పలికారు.

పాత పింఛన్ విధానాన్నే కొనసాగించాలి: స్థితప్రజ్ఞ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులందరికీ పాత పింఛన్ స్కీం(ఓపీఎస్)నే కొనసాగించాలని కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ డిమాండ్ చేశారు. దీని కోసం 16 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా పాత పింఛన్ సాధన సంకల్ప రథయాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సీపీఎస్ రద్దు.. ఓపీఎస్ పునరుద్ధరణపై తెలంగాణ హైకోర్టు సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి నిశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం జరిగిన సమావేశానికి స్థితప్రజ్ఞ, సంఘం ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థితప్రజ్ఞ మాట్లాడుతూ.. ఈ నెల 12న భారీ ఎత్తున ఉద్యోగులతో చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చలో హైదరాబాద్ కార్యక్రమానికి హైకోర్టు ఉద్యోగ సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటించింది.



గురుకులాల్లోని ఉపాధ్యాయులకు ప్రమోషన్లు కల్పించాలని, కాంట్రాక్టు టీచర్ల సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలని, హెల్త్ సూపర్‌వైజర్లకు పదోన్నతులు కల్పించాలని కోరుతూ ఎస్సీ, ఎస్టీ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి ఈ నవీన్ నికోలస్‌ను శనివారం కలిసి వినతిపత్రం అందజేస్తున్న సాంఘిక సంక్షేమ గురుకుల ఉపాధ్యాయ అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ బాలరాజు, ప్రధానకార్యదర్శి ఎస్.దయాకర్ తదితరులు – సాక్షి, హైదరాబాద్



హైదరాబాద్‌లో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు ఇప్పించడానికి కృషి చేయాలని కోరుతూ శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని శనివారం అసెంబ్లీలో కలిసి వినతిపత్రం అందజేస్తున్న డెక్కన్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ (డీజేహెచ్ఎస్) అధ్యక్షుడు బొల్లోజు రవి, ఉపాధ్యక్షుడు మరిపాల శ్రీనివాస్, డైరెక్టర్లు దండా రామకృష్ణ, డేగ కుమార్, సలహాదారు విక్రమ్‌రెడ్డి

దశాబ్దిలో రెండింతలు..!



రాష్ట్రంలో గణనీయంగా పెరిగిన వాహనాలు

2013–14 ఆర్థిక సంవత్సరంలో 70,73,109

2022–23 నాటికి 1.54 కోట్లకు పెరుగుదల

వీటిలో ద్విచక్ర వాహనాలే 1.13 కోట్లు


దాదాపు సగం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే

రాష్ట్ర రవాణా శాఖ గణాంకాల వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వాహనాల సంఖ్య గత పదేళ్ల కాలంగా గణనీయంగా పెరిగింది. 2013–14 ఆర్థిక సంవత్సరంలో 70,73,109 వాహనాలు ఉండగా.. 2022–23 నాటికి 1,54,77,512కు చేరాయి. సగటున ఏడాదికి 9% చొప్పున పెరుగుదల నమోదు అయినట్లు రవాణా శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఒక్క 2022–23 ఆర్థిక సంవత్సరంలోనే 10 లక్షల వాహనాలు కొత్తగా రోడ్లపైకి వచ్చాయి. ఇక రాష్ట్రంలోని మొత్తం వాహనాల్లో దాదాపు సగం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే ఉండటం విశేషం.

గణనీయంగా పెరుగుతున్న ఈవీలు

- తెలంగాణలోని మొత్తం 1.54 కోట్ల వాహనాల్లో ద్విచక్ర వాహనాలే 1.13 కోట్ల వరకు ఉన్నాయి. మోటారు కార్లు 20 లక్షలు, ఆటోలు 4.5 లక్షలు, స్కూలు బస్సులు 28,962, గూడ్స్ ఆటోలు 6.09 లక్షలు, ఈ–కార్స్ 235, మోటారు క్యాబ్స్ 20,335, మ్యాక్సీ క్యాబ్స్ 31,060, కాంట్రాక్ట్ క్యారేజెస్ 9,244, ట్రక్కులు/ట్రాక్టర్లు 7 లక్షల వరకు ఉన్నాయి. గ్రేటర్ పరిధిలో ఉన్న 70 లక్షల వాహనాల్లో 50 లక్షలు ద్విచక్ర వాహనాలు కాగా కార్ల వంటి తేలికపాటి వాహనాలు 13 లక్షలు ఉన్నాయి.
- 2013–14 నాటికి రాష్ట్రంలో రిజిస్టర్ అయి ఉన్న 70.73 లక్షల వాహనాల్లో 8.22 లక్షలు రవాణా వాహనాలు ఉండగా... 63.68 లక్షలు సరుకు రవాణా వాహనాల కేటగిరీకి చెందినవి. అప్పట్లో ద్విచక్ర వాహనాలు 52.84 లక్షలు, కార్లు 7,96,232, జీపులు 14,989, ట్యాక్సీలు 74,097, బస్సులు 40,807, సరుకు రవాణా చేసే తేలికపాటి వాహనాలు 1,85,688, ట్రక్కులు/ట్రాక్టర్లు 1,25,240 ఉండేవి.
- సెకండ్ హ్యాండ్ మార్కెట్‌ను సైతం పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఢిల్లీ, ముంబై, బెంగళూరు సహా కొన్ని ఉత్తరాది నగరాల్లోని బడాబాబులు, సంస్థలు ఆర్థిక సంవత్సరం ముగిసేటప్పుడు పెద్ద సంఖ్యలో కొత్త వాహనాలను ఖరీదు చేస్తుంటారు. ఆదాయపన్ను రిటర్న్స్‌లో లెక్కలు చూపించడానికే ఇలా చేస్తుంటారు. ఆయా సమయాల్లో అక్కడ నుంచి భారీ సంఖ్యలో సెకండ్ హ్యాండ్ వాహనాలు దేశంలోని అనేక ప్రాంతాలకు వెళ్తుంటాయి.
- రాష్ట్రం ఏర్పడే నాటికి హైదరాబాద్‌లో వాహనాల సంఖ్య 25 లక్షలు ఉండగా... గత దశాబ్ద కాలంగా ఏటా ఈ వాహనాలు పెరుగుతూ వస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలోని రోడ్లపై 46,937 విద్యుత్ (ఎలక్ట్రిక్) వాహనాలు రాకపోకలు సాగిస్తున్నట్లు రవాణశాఖ గణాంకాలు చెప్తున్నాయి. ఈ వాహనాలకు తెలంగాణ ప్రభుత్వం రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ చార్జీలు మినహాయింపు ఇస్తోంది. దీంతో ఏటా ఈ వాహనాల సంఖ్య పెరుగుతోందని, రానున్న రోజుల్లో మరింత పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. ఈ గణాంకాలు కేవలం తెలంగాణలో రిజిస్టర్ అయిన వాహనాలకు సంబంధించినవి మాత్రమే కాగా.. ఆంధ్రప్రదేశ్ సహా ఇతర రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో రిజిస్టర్ అయినవి కూడా రాష్ట్రంలో ఉంటాయని అధికారులు చెబుతున్నారు.
- వీటిలో నగరానికి వచ్చేవీ పెద్ద సంఖ్యలోనే ఉంటున్నాయి. ఆయా రాష్ట్రాల నుంచి ఇక్కడకు తీసుకువచ్చే వాహనాలను రిజిస్టర్ చేయించి నంబర్ మార్చుకోవాల్సి ఉంటుంది. అయితే ఇది పూర్తి స్థాయిలో అమలు కాకపోవడంతో ఇప్పటికీ వేల సంఖ్యలో వాహనాలు అక్కడి రిజిస్ట్రేషన్ నంబర్లతోనే తిరిగేస్తున్నాయి. ఈ కారణంగా వీటి సంఖ్య అధికారిక గణాంకాల్లోకి చేరట్లేదు.





శనివారం కరీంనగర్ జిల్లా రామడుగు మండలం మోతె వద్ద తెగిన రహదారిని పరిశీలిస్తున్న బండి సంజయ్

రైతులేమైనా బిక్షగాళ్లా..?

బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్

శంకరపట్నం (మానకొండూర్)/రామడుగు(చొప్పదండి): భారీ వర్షాలతో పంటలు నష్టపోయిన రైతుల పరిస్థితి దయనీయంగా ఉందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఆయన కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కల్వల ప్రాజెక్ట్ గండిని పరిశీలించారు. గండి పడటానికి దారితీసిన కారణాలను డీఈ కవితను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తు కింద ఎనిమిదేళ్లలో తెలంగాణకు రూ.3వేల కోట్ల సాయం చేసిందన్నారు. అయితే అందులో సగం నిధులను దారిమళ్లించారని ఆరోపించారు. సీఎం కేసీఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే ఈ నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. భారీ వర్షాలతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 30 వేల ఎకరాలు, కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో 7వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని తెలిపారు. రోడ్లు, కల్వర్టులు తీవ్రంగా దెబ్బతిన్నాయని, 50 ఏళ్లనాటి కల్వల ప్రాజెక్ట్‌కు గండిపడితే అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపించలేదని మండిపడ్డారు. 'రైతు లేమైనా భిక్షగాళ్లు అనుకుంటున్నవా? ప్రతీసారి చేయిచాచి సాయం చేయాలని అడుక్కోవాలా? వారిని ఆదుకోని ప్రభుత్వం ఉంటే ఎంత? ఊడితే ఎంత'అని ముఖ్యమంత్రిపై మండిపడ్డారు. కాగా, ఆగ మేఘాలపై ఆర్టీసీ బిల్లును పంపి గవర్నర్ సంతకం చేయలేదంటే ఎలా? ఆ బిల్లులో ఏమైనా లోపాలు ఉన్నాయా? న్యాయపరమైన ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా? అని పరిశీలన చేయకుండానే సంతకం పెట్టమంటే ఎలా? అని సంజయ్ ప్రశ్నించారు.

నివేదికలు ఇవ్వలేని స్థితిలో రాష్ట్రం..

భారీవర్షాలతో దెబ్బతిన్న పంటలు, రోడ్లు, ఆస్తి నష్టాలు తెలుసుకునేందుకు కేంద్రబృందం పరిశీలనకు వస్తే ప్రభుత్వం నివేదికలు కూడా ఇవ్వలేని స్థితిలో ఉందని బండి సంజయ్ విమర్శించారు.

కేసీఆర్‌కు ఓటమి భయం

- 'బంధు' పథకాలతో బీఆర్ఎస్ పార్టీ మూతపడడం ఖాయం
- 100 రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటవుతుంది
- భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నల్లగొండ రూరల్: సీఎం కేసీఆర్‌కు ఓటమి భయం పట్టుకుందని, ఎన్నికల సమయంలో దళిత బంధు, బీసీ బంధు, మైనార్టీ బంధు పథకాలు పెడుతున్నాడని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. 'బంధు'పథకాలతో బీఆర్ఎస్ పార్టీ వచ్చే ఎన్నికల్లో బంద్ అవుతుందని చెప్పారు. నల్లగొండ పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులకు శనివారం ఆయన కాంగ్రెస్ పార్టీ పక్షాన మద్దతు ప్రకటించి మాట్లాడారు. భూ మండలం తలకిందులైనా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం కుదరదని అసెంబ్లీలో ప్రకటించిన కేసీఆర్.. నేడు ఎన్నికల కోసం ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం అంటున్నాడని విమర్శించారు. కేసీఆర్ మాటలకు, ఉత్తుత్తి జీవో కాపీలకు మోసపోవద్దని సూచించారు. గ్రామపంచాయతీ కార్మికులు 30 రోజులుగా సమ్మె చేస్తున్నా పట్టించుకోకపోవడం దారుణమని, కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి పారిశుధ్య పనులు చేపడితే వారికి సమాజం పాదాభివందనం చేసిందని, అలాంటి వారి పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. మీరు పోరాటం ఆపొద్దని సమస్య పరిష్కారమయ్యే వరకు అండగా ఉంటామని రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ కార్మికులకు విజ్ఞప్తి చేస్తున్నట్లు కోమటిరెడ్డి చెప్పారు. ఏపీ సీఎం జగన్ అక్కడి ప్రజలకు వైద్యం ఖర్చు రూ.వెయ్యి దాటితే పెద్ద ఆస్పత్రిలో పూర్తి స్థాయి వైద్యం ఆరోగ్యశ్రీ ద్వారా అందిస్తున్నారని కోమటిరెడ్డి చెప్పారు. వంద రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందని, ప్రజల సమస్యలన్నీ పరిష్కరిస్తామన్నారు.

'కల్వకుంట్ల' మళ్లీ అధికారంలోకి వస్తే అంతే..

తెలంగాణ పూర్తిగా తిరోగమనంలోకే

- ప్రజలను మరోసారి మభ్యపెట్టేందుకు కేసీఆర్ కొత్త హామీలు...
- తెలంగాణను మోదీ ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటోంది
- బీఆర్ఎస్ సర్కారు గోబెల్స్ ప్రచారం చేస్తోంది
- బీజేపీ మీడియా, సోషల్ మీడియా వర్క్‌షాపులో కిషన్‌రెడ్డి



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ప్రకాశ్ జవదేకర్. చిత్రంలో డీకే అరుణ, కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్

సాక్షి, హైదరాబాద్: కల్వకుంట్ల కుటుంబం మరోసారి అధికారంలోకి వస్తే తెలంగాణ అన్ని రంగాల్లో పూర్తిగా తిరోగమన బాట పడుతుందని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. నేను.. నా కుటుంబం.. అనే విధంగా సాగుతున్న కేసీఆర్ పాలనకు చరమగీతం పాడాల్సిన సమయం వచ్చిందన్నారు. శనివారం బీజేపీ కార్యాలయంలో జరిగిన బీజేపీ మీడియా, సోషల్ మీడియా వర్క్‌షాపులో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలను మళ్లీ మభ్యపెట్టి ఓట్లు దండుకునేందుకు సీఎం కేసీఆర్ కొత్త హామీలిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణను మోదీ ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుని అభివృద్ధికి అండదండలిస్తుంటే బీఆర్ఎస్ సర్కారు దుష్ప్రచారం చేస్తోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తన వైఫల్యాలు, అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు బీజేపీ ఎమ్మెల్యేల గొంతు నొక్కుతోందని ధ్వజమెత్తారు. మోదీ నాయకత్వంలో తెలంగాణకు ఏయే రూపాల్లో నిధులు ఇచ్చామో చెప్పేందుకు బీజేపీ సిద్ధంగా ఉందన్నారు.

ఆ మోసాలను బయట పెట్టండి

కల్వకుంట్ల కుటుంబ పార్టీ చేస్తున్న విష ప్రచారాన్ని సామాజిక మాధ్యమాలు ఇతర రూపాల్లో తిప్పికొట్టాల్సిన అవసరం, బాధ్యత పార్టీనాయకులు, కార్యకర్తలపై ఉందని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. 'దళితబంధు పేరుతో.. ప్రజలను దగా చేయడం, మోసం చేయడం కేసీఆర్‌కు అలవాటు.ఊరికి ఒకరికో ఇద్దరికో ఇచ్చి.. అందరికీ ఇచ్చినట్లు ప్రచారం చేస్తున్నారు. డబుల్ బెడ్ రూమ్‌ఇళ్లు మండలానికి ఇద్దరికి ఇచ్చి అందరికీ ఇచ్చినట్లు ప్రచారం చేస్తున్నారు. ఇలాంటి విషయాల్లో ప్రభుత్వాన్ని ఎప్పటికప్పుడు ఎండగడుతూ.. ప్రజల మద్దతును కూడగట్టాలి'అని ఆయన పిలుపునిచ్చారు.

బీజేపీ ఎప్పటికీ బీఆర్ఎస్, కాంగ్రెస్‌తో కలవదు

''గతంలో కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో కేసీఆర్‌మంత్రిగా పనిచేశారు. బీజేపీ ఏ రోజు కూడా బీఆర్ఎస్, కాంగ్రెస్‌తో కలవలేదు.. భవిష్యత్‌లో కలవబోదు.'అని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.''12 మంది కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు కనీసం రాజీనామా చేయకుండా.. చేతి గుర్తుతో గెలిచి బీఆర్ఎస్‌లో కేసీఆర్‌తో సంసారం చేస్తున్నారు. వాళ్లు ఇప్పుడు నీతులు చెబుతున్నారు. ఈరోజైనా, రేపైనా.. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎంలు ఒక్కటే. ఈ పార్టీలు మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా.. పెట్టిన అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా సంతకాలు చేశాయి'అని అన్నారు. రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాశ్ జవదేకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు డీకే అరుణ, ఈటల రాజేందర్, నల్లు ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.

బాబ్రీ లాంటి ఘటనలు పునరావృతం కావొద్దు

ఎంపీ అసదుద్దీన్



సాక్షి, హైదరాబాద్: జ్ఞానవాపి మసీదుపై ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(ఏఎస్ఐ) నివేదిక వచ్చిన తర్వాత 'డిసెంబర్ 23 లేదా డిసెంబర్ 6'లాంటి ఘటనలు పునరావృతం కాకూడదని ఆశిస్తున్నానని ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. ఏఎస్ఐ నివేదిక వచ్చిన తర్వాత బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల కల్పితకథతో రెండో బాబ్రీగా అది పునరావృతమయ్యే ప్రమాదం లేకపోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్ దారుస్సలాంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 1949 డిసెంబర్ 23న బాబ్రీ మసీదులో ప్రార్థనలు ఆగిపోయాయని, 1992లో మసీదును కోల్పోయామని విచారం వ్యక్తం చేశారు. జ్ఞానవాపిపై ఏఎస్ఐ నివేదిక వచ్చిన తర్వాత మసీదులో ప్రార్థన ఆగిపోతుందా? మసీదు స్వభావం ఉంటుందా? లేదా మారుతుందా? అని ఆయన సందేహం వ్యక్తం చేశారు. హరియాణాలోని బీజేపీ ప్రభుత్వ తీరుపై ఒవైసీ మండిపడ్డారు.

ఎన్నికల వేళ ఇదేం గోల?

- అధికారంలోకి వస్తే మంత్రులు, సీఎంలయ్యేది మీరే... మేం కాదు
- తెలంగాణ కాంగ్రెస్ నేతలకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్ క్లాస్



వేణుగోపాల్‌కు స్వాగతం పలుకుతున్న మాణిక్‌రావ్ ఠాక్రే, రేవంత్‌రెడ్డి.

సాక్షి, హైదరాబాద్: 'రాష్ట్రంలో ఓవైపు ఎన్నికలు తరుముకొస్తుంటే మీరిలా పరస్పరం ఫిర్యాదులు చేయడం, లేఖలు రాయడం ఏమిటి? ఎన్నికల వేళ ఈ లొల్లి ఆగకపోతే ఎలా? కాంగ్రెస్ కచ్చితంగా గెలిచే రాష్ట్రాల్లో తెలంగాణ తొలి స్థానంలో ఉంది. కష్టపడి పార్టీని గెలిపిస్తే మంత్రులు, ముఖ్యమంత్రులు అయ్యేది మీరే... మేం కాదు. కర్ణాటక నేతలను చూసి నేర్చుకోండి. వారిని ఆదర్శంగా తీసుకొని ఈ 100 రోజులు ఐకమత్యంగా పనిచేయండి'అని తెలంగాణ కాంగ్రెస్ నేతలకు ఆ పార్టీ జాతీయ సంస్థాగత వ్యవహారాల ఇన్‌చార్జి, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ క్లాస్ తీసుకున్నారు. శనివారం గాంధీ భవన్‌లో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే అధ్యక్షతన టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నేతల అనైక్యత గురించి వేణుగోపాల్ మాట్లాడారు. నేతల మధ్య భేదాభిప్రాయాలను అధిష్టానం చూసుకుంటుందని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను సద్వినియోగం చేసుకుంటూ నిరంతరం ప్రజల్లోనే ఉండాలని సూచించారు.

బరాబర్... కలుగజేసుకుంటాం

సమావేశంలో భాగంగా పార్టీ మండల కమిటీల ఏర్పాటుపై టీపీసీసీ మాజీ చీఫ్, నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరి అభ్యంతరం తెలిపారు. కమిటీల ఏర్పాటు ఏకపక్షంగా ఉంటే ఎలా అని ప్రశ్నించారు. దీనిపై రేవంత్ స్పందిస్తూ అన్ని జిల్లాల్లోనూ కలుగజేసుకుంటామంటే ఎలా అని ప్రశ్నించినట్లు సమాచారం. దీంతో తీవ్రంగా స్పందించిన ఉత్తమ్... పీసీసీ చీఫ్‌గా పార్టీని నడిపించామని, 30–40 ఏళ్లుగా పార్టీలో ఉంటున్నామని, తమకు రాష్ట్రమంతా అనుచరులు ఉన్నందున కలుగజేసుకోవద్దంటే ఎలా అని వ్యాఖ్యానించారు. కొత్తగా వచ్చిన వాళ్లు నిర్ణయాలు తీసుకుంటుంటే తాము పట్టించుకోకుండా ఎలా ఉంటామని, బరాబర్ కలుగజేసుకుంటామని స్పష్టం చేశారు. మధ్యలో కలుగజేసుకున్న వేణుగోపాల్ నేతలందరూ సమన్వయంతో పనిచేసి ఈనెల 15లోపు మండల కమిటీలను పూర్తి చేయాలని ఆదేశించారు. సీనియర్ నేత, మాజీ ఎంపీ వీహెచ్ మాట్లాడుతూ బీసీ డిక్లరేషన్ గురించి కసరత్తు చేస్తున్నామని చెప్పగా అన్ని వర్గాల డిక్లరేషన్లనూ పూర్తి చేయాలని వేణుగోపాల్ సూచించారు.

ఆరు సభలు... సోనియా, రాహుల్, ప్రియాంక రాక

ఎన్నికల సన్నద్ధతలో భాగంగా పలు వర్గాలకు డిక్లరేషన్లు ప్రకటించడం కోసం ఆరు భారీ బహిరంగ సభలు నిర్వహించాలని టీపీసీసీ నేతలు పీఏసీ భేటీలో నిర్ణయించారు. ఈ సభలకు సోనియా, రాహుల్, ప్రియాంక, ఖర్గే, సిద్ధరామయ్యలను ఆహ్వానించాలని, సమయాన్నిబట్టి ఒక్కో సభకు ఒక్కో జాతీయ నేతను తీసుకురావాలని, రాహుల్ వీలైనన్ని సభలకు వచ్చేలా చూడాలని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ వర్గాలతో పాటు ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీలను ఆకట్టుకునేలా ప్రణాళిక రూపొందించాలని నిర్ణయించారు.

సెప్టెంబర్ 15లోగా 3 బహిరంగ సభలు: షబ్బీర్ అలీ

పీఏసీ సమావేశం అనంతరం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్ యాదవ్‌తో కలసి పీఏసీ కన్వీనర్ షబ్బీర్ అలీ విలేకరులతో మాట్లాడారు. పార్టీ గెలుపునకు కేసీ వేణుగోపాల్ కీలక సూచనలు చేశారని చెప్పారు. గిరిజన దినోత్సవం రోజున తండాలలో బస చేయాలని, రాష్ట్రంలో భూ కుంభకోణాలు, అమ్మకాలపై చార్జిషీట్ వేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ నెల 15 నుంచి సెప్టెంబర్ 15లోగా జహీరాబాద్, మహబూబ్‌నగర్, నల్లగొండల్లో బహిరంగ సభలు నిర్వహిస్తామని తెలిపారు. అంతకుముందు కె.సి.వేణుగోపాల్‌కు రాష్ట్ర కాంగ్రెస్ నేతలు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం పలికారు.

కచ్చితంగా గెలిచేవి.. 41
కష్టపడితే గెలిచేవి.. 42
గెలుపు కష్టమైనవి.. 36

- నియోజకవర్గాలవారీగా రాష్ట్రంలో కాంగ్రెస్ పరిస్థితిపై పార్టీ వ్యూహకర్త నివేదిక
- పార్టీ సంస్థాగత వ్యవహారాల ఇన్‌చార్జి కె.సి.వేణుగోపాల్‌కు అందజేసిన సునీల్ కనుగోలు
- హైదరాబాద్, సికింద్రాబాద్, మేడ్చల్, నిజామాబాద్, కరీంనగర్ ఎంపీ సీట్లలో గెలుపు కష్టమేనని వెల్లడి



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ కసరత్తు ముమ్మరం చేసింది. ఇప్పటికే అభ్యర్థుల ఖరారు కోసం స్క్రీనింగ్ కమిటీలను ఏర్పాటు చేసుకున్న టీ కాంగ్రెస్... అసెంబ్లీ నియోజకవర్గాలవారీగా పార్టీ పరిస్థితిపై ఓ అంచనాకు వస్తోంది. ఆ పార్టీ వ్యూహకర్త సునీల్ కనుగోలు ఆధ్వర్యంలో జరిగిన ఈ కసరత్తు నివేదిక ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ఇన్‌చార్జి కె.సి.వేణుగోపాల్‌కు అందినట్లు తెలుస్తోంది. శనివారం హైదరాబాద్‌లో ఆయన పర్యటనకు ముందే సునీల్ కనుగోలు ఈ నివేదికను వేణుగోపాల్‌కు అందజేశారు. ఈ నివేదిక ఆధారంగానే ఏఐసీసీ నియమించిన పార్లమెంటరీ నియోజకవర్గాల పరిశీలకుల సమావేశంలో వేణుగోపాల్ పలు సూచనలు చేసినట్లు సమాచారం.

మూడు రకాలుగా విభజన...

వాస్తవానికి గత నెల 24న జరిగిన రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశంలో పార్లమెంటు నియోజకవర్గాలవారీగా సునీల్ కనుగోలు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజిగిరి, కరీంనగర్, నిజామాబాద్ ఎంపీ స్థానాల పరిధిలో పార్టీ అంతంత మాత్రంగానే ఉందని, మిగిలిన చోట్ల ప్రత్యర్థులకు పోటీ ఇచ్చే స్థితిలో ఉన్నామని వివరించారు. అయితే ఏ అసెంబ్లీ స్థానంలో పార్టీ పరిస్థితి ఎలా ఉందనే విషయాన్ని ఆయన ఆ సమావేశంలో వెల్లడించలేదు. తాజాగా రాష్ట్రంలోని 119 నియోజకవర్గాలకుగాను 41 అసెంబ్లీ స్థానాల్లో పార్టీ గెలిచే అవకాశముందని, మరో 42 చోట్ల గెలుపు కోసం కష్టపడాల్సి ఉంటుందని, 36 స్థానాల్లో గెలుపు అంత సులభం కాదని, ఆ స్థానాలపై ప్రస్తుత పరిస్థితుల్లో ఆశలు వదులుకోవాల్సిందేనని కె.సి.వేణుగోపాల్‌కు ఇచ్చిన నివేదికలో ఆయన పేర్కొన్నట్లు తెలిసింది. ఈ నివేదిక ప్రకారం గెలుపు అవకాశాలున్న చోట్ల ఎన్నికల వరకు ఇదే ఊపును కొనసాగించాలని, గెలుపు కోసం కష్టపడాల్సిన స్థానాల్లో పార్టీని మరింత ముందుకు తీసుకెళ్లేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని కె.సి.వేణుగోపాల్ సూచించినట్లు సమాచారం. ఇక, పరిస్థితి ఏమాత్రం బాగాలేని 36 స్థానాల్లో ఏం చేస్తే మెరుగుపడతామన్న దానిపై ప్రత్యేక దృష్టి సారించాలని వేణుగోపాల్ మార్గనిర్దేశం చేసినట్టు తెలుస్తోంది. ఈ సమావేశంలో ఏఐసీసీ నియమించిన స్క్రీనింగ్ కమిటీ సభ్యురాలు దీపాదాస్ మున్షీ, రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, నల్లగొండ ఎంపీ ఉత్తమ్, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్, ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ దామోదర రాజనర్సింహ, ఏఐసీసీ కార్యదర్శులు శ్రీధర్‌బాబు, విష్ణునాథ్, మన్సూర్‌అలీఖాన్, రోహిత్‌చౌదరి, వంశీచందర్ రెడ్డి, సంపత్‌కుమార్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసి డెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్లలో బదిలీలు, పదోన్నతుల ఆశలు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉపాధ్యాయుల్లో మళ్లీ బదిలీలు, పదోన్నతుల చర్చ మొదలైంది. కోర్టు స్టేకు మూలమైన జీవో 5కు అసెంబ్లీ ద్వారా చట్టబద్ధత తీసుకొచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయనే సంకేతాలు వస్తున్నాయి. దీనిద్వారా కోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు తొలగించే వీలుందని ఉపాధ్యాయ నేతలు చెబుతున్నారు. ఈ కారణంగా త్వరలో షెడ్యూల్ వెలువడే వీలుందని ఉపాధ్యాయుల్లో చర్చ జరుగుతోంది. దీర్ఘకాలికంగా బదిలీలు, పదోన్నతులు చేపట్టకపోవడంతో ఉపాధ్యాయ వర్గాల్లో తీవ్ర అసంతృప్తి చోటుచేసుకుంది. గతేడాది ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ ఇచ్చారు. అయితే 317 జీవో ద్వారా కొత్త జిల్లాలకు బదిలీ అయిన టీచర్లు, స్పౌజ్‌ల అంశం వివాదాస్పదమైంది. బదిలీల జీవోకు చట్టబద్ధతలేదని నాన్‌స్పౌజ్‌లు కోర్టును ఆశ్రయించడంతో ప్రక్రియను నిలిపివేస్తూ స్టే ఇచ్చింది. అయితే ప్రభుత్వం సరైనరీతిలో వాదనలు వినిపించలేదని టీచర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయ సంఘాలపైనా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టీచర్ల అసంతృప్తి కొత్త సమస్యలకు కారణమవుతుందని అధికారపార్టీ వర్గాలు భావిస్తున్నాయి. దీంతో ప్రభుత్వం జీవో 5కు చట్టబద్ధత తీసుకొచ్చి, ఈ విషయాన్ని కోర్టుకు వివరించాలని నిర్ణయించింది. దీని ఆధారంగా కోర్టు మధ్యంతర ఉత్తర్వులను ఎత్తేస్తుందని టీచర్లు ఆశాభావంతో ఉన్నారు.

సాక్షి
కరీంనగర్

సాక్షి టాక్ షో
స్పెషల్ స్టోరీస్
సండే స్పెషల్

ఆదివారం | 6 | ఆగస్టు | 2023





కరీంనగర్‌లో శ్రీచైతన్య డిగ్రీ కళాశాల విద్యార్థినులు



తిమ్మాపూర్ వాగేశ్వరి ఫార్మసీ విద్యార్థులు

స్నేహం.. ఓ వరం

- అనుకోకుండా పరిచయమై, జీవితాంతం తోడుంటుంది..
- కష్టనష్టాల్లో అండగా ఉండేవారే మిత్రులు
- నేడు స్నేహితుల దినోత్సవం

కరీంనగర్ సిటీ/విద్యానగర్(కరీంనగర్)/: 'స్నేహానికి కన్న మిన్న లోకాన లేదురా.. కడదాక నీడ లాగ నిను వీడిపోదురా' అని ఓ కవి అన్నట్లు స్నేహబంధం ఎప్పటికీ మనతోనే ఉంటూ మన జీవితంలో భాగమవుతుంది. అది ఓ వరం. పుట్టినప్పుడు మనతోపాటు ఎన్నో బంధాలు, రక్త సంబంధాలు ఏర్పడుతాయి. కానీ తర్వాత మన నడవడిక, వ్యక్తిత్వం ఆధారంగా స్నేహం మన జీవితంలోకి వస్తుంది. ఆపదలో ఆదుకుంటూ.. కష్టాల్లో పక్కనుంటూ.. ఎదుగుదలలో తోడుంటూ.. ఇలా రక్త సంబంధం చేయలేనిది కూడా స్నేహ హస్తం చేస్తుంది. మనం విజయం సాధించినప్పుడు చప్పట్లు కొట్టేవాళ్లు.. విషాదంలో ఉన్నపుడు ఓదార్చేవాళ్లు నలుగురు లేని జీవితాన్ని ఎవరూ ఊహించరు. అందుకే మనుషులందరికీ తలా ఓ పేరున్నప్పటికీ అందరినీ దగ్గరకు చేర్చేది మాత్రం స్నేహబంధమే. నేడు స్నేహితుల దినోత్సవం. ఈ సందర్భంగా కరీంనగర్‌లోని శ్రీచైతన్య డిగ్రీ కాలేజీలో 'సాక్షి' 40 మంది విద్యార్థులతో శనివారం చర్చావేదిక నిర్వహించింది. ఎక్కువ మంది ఆన్‌లైన్ స్నేహంలో మోసాలుంటాయని, నమ్మకం లేదని చెప్పారు. చిన్నప్పటి నుంచి ఉన్న స్నేహం బలంగా ఉంటుందని తెలిపారు.

పేరెంట్స్ తర్వాత ఫ్రెండ్సే..



పేరెంట్స్ తర్వాత ఫ్రెండ్సే ముఖ్యం. ఇంట్లో చెప్పలేని విషయాలు కూడా ఫ్రెండ్స్‌తో షేర్ చేసుకుంటాం. ఆపదలో ఒకరికి ఒకరు తోడుగా నిలిచేది ఫ్రెండ్సే. వారితో ప్రయాణం చాలా విలువైనది.

– అసాధ్య, ఫార్మ్ డీ, వాగేశ్వరి

ఒకరికొకరు తోడు..



స్నేహితులను ఎంచుకునే సమయంలో మంచి వారిని ఎంచుకుంటే జీవితంలో కష్టసుఖాల్లో తోడుంటారు. మంచి వారు ఎప్పుడూ ఒకరికొకరు తోడుంటారు.

– చందన, వాగేశ్వరి

స్వార్థం లేనిది..



నిస్వార్థమైనది స్నేహమొక్కటే. కష్టమొచ్చినా.. సంతోషమొచ్చినా తోడుండే వారే ఫ్రెండ్స్. నేను ఎక్కడో మహబూబాబాద్ జిల్లా నుంచి వచ్చిన. ఇక్కడ అందరూ అన్నదమ్ములుగా ఉండి స్నేహం విలువ తెలిపారు.

– ప్రశాంత్, వాగేశ్వరి

ఫ్రెండ్ అవసరమే..



ఆరు సంవత్సరాల ఫార్మసీ రంగంలో నాకు ప్రతీ ఫ్రెండ్ అవసరమే. కష్టసుఖాల్లో స్నేహితులే దేవుళ్లు. మా ఓర్పును భరించడమే కాకుండా జీవితంలో ముందడుగు వేయడానికి ప్రతీ స్నేహితుడు అవసరమే.

– అక్షయ, వాగేశ్వరి

విద్యార్థులే స్నేహితులు..



కళాశాలలో 20 సంవత్సరాల సుదీర్ఘకాలంలో మాకు విద్యార్థులను మించిన స్నేహితులు లేరు. ప్రతీ బ్యాచ్‌తో మాకు గొప్ప అనుభవం ఎదురవుతుంది. ఫ్రెండ్‌షిప్ విలువ తెలిసిన వారు జీవితంలో ఎదుగుతారు.

– శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్, ఫార్మసీ కాలేజీ

– తిమ్మాపూర్

నాలుగో తరగతి నుంచి డిగ్రీ వరకు..



మేము నాలుగో తరగతిలో పరిచయమయ్యాం. మా ప్రయాణం ఇబ్బంది లేకుండా డిగ్రీ వరకు వచ్చింది. ఎంతో స్నేహంగా ఉంటూ సంతోషాలు, బాధలను పంచుకుంటాం. కష్టాల్లో ఒకరికొకరం అండగా ఉంటాం.– కీర్తిక, కేజీయా, కొత్తపేట, బోయినపల్లి మండలం

స్నేహితులకే చెప్పకుంటాం

తల్లిదండ్రులు, తోబుట్టువులు, బంధువులకు చెప్పుకోలేని చాలా సమస్యలను స్నేహితులతో చెప్పుకుంటాం. అనుకోకుండా పరిచయమై, జీవితాంతం నేనున్నా అంటూ వచ్చేది ఒక్క స్నేహమే.

– సుచరిత, శివాణి, పెద్దపల్లి



కష్టాల్లో ఆదుకునేలా ఉండాలి



స్నేహం కష్టాల్లో ఆదుకునేలా ఉండాలి. బాధలో ఉన్నప్పుడు మనసు విప్పి మాట్లాడితే సాంత్వన చేకూరుతుంది. ఒక మంచిమాటతో మనసును కుదుటపడేలా చేసి, ముందుకు నడిపించేది స్నేహమే. – భూమిక, జగిత్యాల

నమ్మకం.. నిజాయితీ ఉండాలి



నిజాయితీ, నమ్మకంతో కూడిన స్నేహం కావాలి. కానీ నేడు అవసరాలకు మాత్రమే చేస్తున్నారు. అవి తీరగానే దూరమైపోతున్నారు. జీవితాంతం తోడు నిలిచే స్నేహం ఆనందాన్నిస్తుంది.

– విద్య, తాళ్లపల్లి, ఇల్లంతకుంట మండలం

ఆ బంధం గొప్పది



స్నేహంలో ఆడ, మగ అనే తేడా ఉండదు. మన మంచికోరే వారితో ఫ్రెండ్‌షిప్ జీవితాంతం బాగుంటుంది. నేను ఎక్కువ సమయం స్నేహితులతోనే ఉంటా. స్నేహ బంధం ఎంతో గొప్పది.

– కృష్ణతేజ, వేములవాడ

నలుగురం కలిసి చదువుకున్నం



కోరుకంటి శ్రీకాంత్, తణుకు శ్రీనాథ్, సుంచు మల్లయ్య, నేను నలుగురం స్నేహితులం. శిశు తరగతి నుంచి ఇంటర్ వరకు కలిసే చదువుకున్నం. అప్పటి స్నేహం ఇంకా కొనసాగుతోంది. అందరం జీవితాల్లో స్థిరపడ్డాం. ప్రతీ వారం కలుసుకుంటం. పండుగలు, శుభకార్యాలకు ఒకరింటికి ఒకరం వెళ్తాం. కష్టనష్టాల్లో తోడుగా ఉంటున్నం.

– రావుల సుధాకర్, కిసాన్‌నగర్, కరీంనగర్

వైద్యానికి సాయం



బోయినపల్లి(చొప్పదండి): బూర్గుపల్లికి చెందిన అక్కరాజు గంగరాజుది పేద కుటుంబం. తల్లి పడుతున్న కష్టాన్ని చూడలేక ఇంటర్ వరకు చదివి ఆపేశాడు. చిన్నాచితక పనులు చేస్తూ తల్లికి సాయంగా ఉండేవాడు. నెల రోజుల క్రితం కాలేయ సంబంధిత వ్యాధితో ఆస్పత్రిలో చేరాడు. విషయం తెలుసుకున్న అతని స్నేహితులు పెరుక మహేశ్ వాట్సాప్ గ్రూపుల ద్వారా రూ.1.37 లక్షలు సేకరించి, చికిత్స చేయించారు.

స్నేహబంధమే శాశ్వతం



సాక్షి, పెద్దపల్లి: స్నేహబంధమే శాశ్వతం. ఇప్పటికీ నా స్కూల్‌మేట్స్‌ను కలుస్తుంటా. నా బెస్ట్ ఫ్రెండ్ అమూద్. వాడు నేను అహ్మద్‌నగర్‌లో స్కూల్, కాలేజీ వరకు కలిసి చదువుకున్నాం. సివిల్స్ ప్రిపేర్ అవుతున్న సమయంలో నాలో కాన్ఫిడెన్స్ తగ్గకుండా ఎప్పుడూ మోటివేట్ చేస్తుండేవాడు. అమూద్ ఇంజినీర్‌గా, మిగతా మిత్రులు వివిధ దేశాలు, పట్టణాల్లో డాక్టర్లు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా, ఉద్యోగులుగా, వ్యాపారులుగా స్థిరపడ్డారు. మేము ఎక్కడ ఉన్నా కష్టసుఖాల్లో పాలుపంచుకుంటాం. ఏటా టూర్ ప్లాన్ చేసుకుంటాం.

– వైభవ్‌గైక్వాడ్, పెద్దపల్లి డీసీపీ

8వ తరగతిలో పరిచయం



మేము ముగ్గురం 8వ తరగతిలో పరిచయమయ్యాం. డిగ్రీ వరకు కలిసే చదువుకున్నాం. ఏ సమస్య వచ్చినా చర్చించుకొని, పరిష్కరించుకుంటాం.

– కావ్య, వర్షిణి, తేజస్విని, వేములవాడ

మిత్రుడి పేరిట స్కూల్..



విద్యార్థులకు మెమొంటోలు అందిస్తున్న గాజుల శ్రీనివాస్, మిత్రులు (ఫైల్)



దయానంద్ (ఫైల్)

సిరిసిల్ల: పట్టణంలోని పద్మనగర్‌కు చెందిన గోసికొండ దయానంద్ 2002లో ఆత్మహత్య చేసుకున్నారు. ఆయన యాదిలో చిన్ననాటి మిత్రులు ఏదైనా చేయాలని నిర్ణయించుకున్నారు. గాజుల శ్రీనివాస్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, యూఎస్‌ఏ సిరిసిల్ల పట్టణ శివారులో 22 గుంటల స్థలం కొనుగోలు చేసి, రూ.30 లక్షలతో 2006లో దయానంద్ మెమోరియల్ స్కూల్ స్థాపించారు. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు ఉచితంగా ఆంగ్ల మాధ్యమంలో విద్యనందిస్తున్నారు. రాజీవ్‌నగర్ కార్మిక క్షేత్రంలోని పేదవాళ్లు తమ పిల్లలను ఇక్కడికి పంపిస్తున్నారు. ప్రస్తుతం 65 మంది విద్యార్థులు ఉన్నారు. స్కూల్ నిర్వహణకు ఏటా రూ.5 లక్షలు ఖర్చవుతోంది. ఇందులో ఎక్కువ మొత్తాన్ని శ్రీనివాస్ భరిస్తున్నారు. బోడ రవీందర్, సిరిసిల్ల తిరుపతి, కట్కం గోపి, పయ్యావుల శ్రీనివాస్, బి.రాము, బొడ్డు శ్రీధర్, లింగమూర్తి, సిరిసిల్ల తిరుమలేశ్, వూరడి రవి, కోడం సుధాకర్ పాఠశాల నిర్వహణలో భాగస్వాములవుతూ స్నేహానికి నిజమైన నిర్వచనంగా నిలుస్తున్నారు.

ఊరి నుంచి గల్ఫ్ దాకా..



స్నేహితులతో దేవ్‌యాదవ్ (సర్కిల్‌లో)

కథలాపూర్(వేములవాడ): మండలంలోని చింతకుంటకు చెందిన బైర దేవ్‌యాదవ్ ఉపాధి నిమిత్తం 12 ఏళ్ల క్రితం సౌదీ అరేబియా వెళ్లాడు. అక్కడ ఓ కంపెనీలో సరైన పని దొరికింది. తన స్నేహితులు గ్రామంలోనే వ్యవసాయం, కూలీ పనులు చేస్తూ ఆర్థికంగా ఎదగడం లేదని భావించాడు. ఒక్కొక్కరికి వీసా పంపిస్తూ 18 మందిని సౌదీ రప్పించుకొని, ఉపాధి చూపించాడు. చిన్నతనంలో గ్రామంలో అందరం కలిసి ఆడుకునే వాళ్లమని.. గల్ఫ్‌లో ఒకేచోట పని చేస్తుండటం ఆనందంగా ఉందని దేవ్‌యాదవ్ తెలిపాడు.

వైద్య మిత్రులు





పెంచలయ్య, పి.చంద్రశేఖర్, రమణారావు రిటైర్డ్ డీఎంహెచ్‌వో

సిరిసిల్ల: సిరిసిల్లకు చెందిన ప్రముఖ వైద్యులు పెంచలయ్య, రమణారావు, చంద్రశేఖర్ మంచి మిత్రులు. 40 ఏళ్ల క్రితం మెడిసిన్ చదువుతున్న రోజుల్లో ముగ్గురూ కర్నూలు మెడికల్ కాలేజీలో స్నేహితులయ్యారు. పెంచలయ్య కడప పట్టణానికి, ఎస్వీ రమణారావు నెల్లూరు జిల్లా సర్వేపల్లి మండలం నిడిగుంటపాలెంకు, చంద్రశేఖర్ నెల్లూరు పట్టణానికి చెందినవారు. ఎంబీబీఎస్ సెకండియర్ చదివే పెంచలయ్యకు ఫస్టియర్ చదివే రమణారావు, చంద్రశేఖర్‌ల మధ్య కాలేజీ ఫంక్షన్‌లో స్నేహం కుదిరింది. పెంచలయ్య, చంద్రశేఖర్ 1993లో సిరిసిల్లకు వచ్చి, ప్రాక్టీస్ ప్రారంభించగా.. 1995లో రమణారావు వచ్చారు. ప్రభుత్వ వైద్యులుగా సర్జన్ పెంచలయ్య, రిటైర్డ్ డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, ఆర్థోపెడిక్ రమణారావు నిజాయితీకి మారుపేరుగా గుర్తింపు పొందారు.

మెడికల్ కాలేజీలకు పక్కా భవనాలు

- రాజన్నసిరిసిల్ల కళాశాలకు రూ.107 కోట్లు
- కరీంనగర్ కాలేజీకి రూ.104 కోట్లు అంచనా
- టెండర్లు పిలిచిన రాష్ట్ర ప్రభుత్వం
- భవన నిర్మాణాల పూర్తికి 15 నెలల కాలపరిమితి
- వచ్చే విద్యాసంవత్సరం అందుబాటులోకి..

సాక్షిప్రతినిధి, కరీంనగర్:

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వైద్య విద్యార్థులకు ప్రభుత్వం తీపికబురు చెప్పింది. ఈ ఏడాది పాత జిల్లాలో మంజూరైన సిరిసిల్ల, కరీంనగర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీల భవన నిర్మాణాల పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. రాష్ట్రంలో రూ.991 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న 9 మెడికల్ కాలేజీలు అత్యాధునిక సదుపాయాలతో వచ్చే విద్యాసంవత్సరం అందుబాటులోకి రానున్నాయి. గత నెల 31వ తేదీన ప్రభుత్వం సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణం కోసం టెండర్లు పిలిచింది. ఇందులో కరీంనగర్ కాలేజీకి రూ.104.5 కోట్లు, రాజన్న సిరిసిల్ల కాలేజీకి రూ.107.3 కోట్లు అంచనాగా పేర్కొంది. టెండర్ల ప్రక్రియ రెండు వారాల్లో ముగిసి, దక్కించుకున్న సంస్థ ఈ నెల చివరలో పనులు ప్రారంభించనున్నట్లు సమాచారం. పనులు మొదలైన 15 నెలల్లోగా నిర్మాణాలు పూర్తి చేయాలని ప్రభుత్వం గడువు విధించింది. ఈలోగా నీట్ కౌన్సెలింగ్ ముగిసి, 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించిన తరగతులు తాత్కాలిక భవనాల్లో ప్రారంభం కానున్నాయి.

పెద్దూరులో 80 ఎకరాలు కేటాయింపు

రాజన్న సిరిసిల్ల జిల్లాకు 11 మే 2023న మెడికల్ కళాశాల మంజూరైంది. మొత్తం 100 సీట్లకు గాను ప్రభుత్వం రూ.166 కోట్లు ఖర్చు చేయనుంది. జిల్లాలో 255 గ్రామాలుండగా సుమారు 5,80,000 జనాభా ఉంది. 13 మండలాలు, 2 మున్సిపాలిటీలు ఉన్నాయి. సర్కారు మెడికల్ కాలేజీకి సిరిసిల్ల పట్టణ శివారులోని పెద్దూరులో 80 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. ఇక్కడ కళాశాల భవన నిర్మాణం పూర్తి కావొచ్చింది. పలు దఫాలుగా నిధులు విడుదల చేస్తున్న ప్రభుత్వం ఈసారి రూ.107.3 కోట్ల పనులకు టెండర్లు పిలవడంతో పనులు త్వరగా పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం మెడికల్ కళాశాలలో సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ జరుగుతుండగా.. ఫస్ట్ ఫేజ్‌లో 15 మంది విద్యార్థులను కేటాయించారు. సెప్టెంబర్ ఒకటి నుంచి తరగతులు ప్రారంభం అవుతాయి.

కొత్తపల్లి విత్తనాభివృద్ధి కేంద్రంలో 20 ఎకరాలు

కరీంనగర్ మెడికల్ కళాశాల ఏర్పాటుకు తొలుత నవంబర్ 2022లో ప్రభుత్వ ప్రకటన చేసింది. చాలా ఏళ్లుగా కరీంనగర్ కేంద్రంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీ నెలకొల్పాలన్న ప్రజల డిమాండ్ ఎట్టకేలకు నెరవేరినట్లయింది. వాస్తవానికి ఈ కళాశాల అనుమతి కొన్ని సాంకేతిక కారణాల వల్ల ఆలస్యమైందన్న ప్రచారం జరిగింది. చివరకు 2023న జూన్‌లో నేషనల్ మెడికల్ కౌన్సిల్ నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చింది. అదే నెల 17న 100 మెడికల్ సీట్ల భర్తీకి అనుమతి లభించింది. 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. కొందుకు విద్యార్థులు అడ్మిషన్ పొందారు. మెడికల్ కాలేజీకి భవనాలు నిర్మించేందుకు కొత్తపల్లి విత్తనాభివృద్ధి కేంద్రంలో 20 ఎకరాల స్థలం కేటాయించారు. అక్కడే ఉన్న గోదాముల్లో తాత్కాలిక తరగతి గదుల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం ఇప్పటికే ప్రభుత్వం రూ.25 కోట్లు మంజూరు చేసింది. తాజాగా రూ.104.5 కోట్ల అంచనా వ్యయంతో భవనాల నిర్మాణాలకు టెండర్లు పిలవడంతో పనులు ఊపందుకోనున్నాయి. నిర్మాణాల పూర్తికి సర్కారు 15 నెలల కాలపరిమితి విధించింది.



సిద్ధమవుతున్న మెడికల్ కాలేజీ భవనం

వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి కృషి



మొక్క నాటుతున్న మేయర్ సునీల్‌రావు చైర్మన్ మధు

కరీంనగర్ అర్బన్: కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తామని మేయర్ వై.సునీల్‌రావు అన్నారు. శనివారం వ్యవసాయ మార్కెట్‌లో మార్కెట్ కమిటీ పాలకవర్గం ఏడాది పాలనాకాలం పూర్తి చేసుకున్న సందర్భంగా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేసి, మొక్కలు నాటారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్‌తో కలిసి మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు, వైస్ చైర్మన్ ఉప్పు రాజశేఖర్, పాలకవర్గ సభ్యులను సన్మానించారు. కో–ఆప్షన్ మెంబర్ సాబీర్ పాషా, ప్యాక్స్ చైర్మన్ శ్యాంసుందర్, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, బీఆర్‌ఎస్ నాయకులు, డైరెక్టర్లు చలమయ్య, రంగారెడ్డి, గుంటి రాజమల్లు, మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి పురుషోత్తం పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన



డిపో ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

కరీంనగర్: టీఎస్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు సంబంధించిన ఫైల్‌కు గవర్నర్ తమిళిసై ఆమోదం తెలపకుండా తాత్సారం చేయడాన్ని నిరసిస్తూ కరీంనగర్ వన్, టూ డిపోల ఉద్యోగులు శనివారం ఉదయం ఆయా డిపోల ఎదుట నిరసన తెలిపారు. దీంతో ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు బస్సులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నిరసనలో కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భార్యతో గొడవ పడి భర్త ఆత్మహత్య


శ్రీధర్‌ (ఫైల్‌)

కరీంనగర్‌రూరల్‌: భార్యతో గొడవ పడిన ఓ వ్యక్తి ఆమె పుట్టింటికి వెళ్లిపోవడంతో ఆత్మహత్య చేసుకున్నాడు. కరీంనగర్‌రూరల్‌ పోలీసుల కథనం ప్రకారం.. కరీంనగర్‌ మండలంలోని చామనపల్లికి చెందిన జగ్గాని శ్రీధర్‌(25)కు భార్య లావణ్య, ఒక కుమారుడు ఉన్నారు. అతను కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొన్ని రోజులుగా మద్యానికి బానిసై, భార్యతో తరచూ గొడవ పడుతున్నాడు. ఈ నెల 3న గొడవ జరగడంతో ఆమె సిర్పూర్‌ కాగజ్‌నగర్‌లోని తన పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన శ్రీధర్‌ శుక్రవారం రాత్రి ఇంట్లోనే ఉరేసుకున్నాడు. తల్లిదండ్రులు శంకరమ్మ–పర్శరాములు వెంటనే అతన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. తన భర్త తాగుడుకు బానిసై, జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

సీతంపేటలో వృద్ధురాలు..


సారమ్మ (ఫైల్‌)

ఇల్లందకుంట: మండలంలోని సీతంపేటకు చెందిన చిలుక సారమ్మ (90) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రాజ్‌కుమార్‌ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. సారమ్మకు భర్త కొన్నేళ్ల క్రితమే మృతిచెందగా ముగ్గురు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. ఆమె కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. మృతురాలి కుమారుడు సదయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వైన్స్‌కు 7 దరఖాస్తులు

కరీంనగర్‌క్రైం: జిల్లాలో వైన్స్‌ టెండర్లకు దరఖాస్తులు ప్రారంభమవగా శనివారం తిమ్మాపూర్‌ పరిధిలోని షాపులకు రెండు అర్జీలు వచ్చాయి. ఇప్పటివరకు మొత్తం 7 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్‌ అధికారులు తెలిపారు.

భాషా ప్రమాణాలు పెంపొందించాలి

● డీఈవో జనార్దన్‌రావు


మాట్లాడుతున్న డీఈవో జనార్దన్‌రావు

చిగురుమామిడి: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలు పెంపొందించాలని, దీనివల్ల వారు అన్ని సబ్జెక్టుల్లో విద్యాప్రమాణాలను సులభంగా సాధిస్తారని డీఈవో ఎస్‌.జనార్దన్‌రావు అన్నారు. చిగురుమామిడి మండలంలోని సుందరగిరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఎఫ్‌ఎల్‌ఎన్‌ గణిత శిక్షణ తరగతులకు శనివారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రతి విద్యార్థితో తప్పనిసరిగా తెలుగు, ఆంగ్ల భాషల్లో చదవడం, రాయడం, గణితంలో చతుర్విధ ప్రక్రియలు చేయించాలన్నారు. పిల్లలకు సులభంగా అర్థమయ్యేలా గణిత బోధన చేపట్టాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులు డీఈవోను సన్మానించారు. జిల్లా క్వాలిటీ కో–ఆర్డినేటర్‌ అశోక్‌రెడ్డి, ఎంఈవో కె.శ్రీనివాస్‌రెడ్డి, మండల నోడల్‌ అధికారిణి శోభారాణి, మండల రిసోర్స్‌ పర్సన్లు మునిప్రసాద్‌, కరుణాకర్‌ పాల్గొన్నారు.

తొలిమెట్టు శిక్షణ వినియోగించుకోండి

తిమ్మాపూర్‌: తొలిమెట్టు శిక్షణ తరగతులను వినియోగించుకొని, ఉపాధ్యాయులు విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలని, భాషా నైపుణ్యం, గణిత అభ్యసన సామర్థ్యాలు సాధించేలా చూడాలని డీఈవో జనార్దన్‌రావు అన్నారు. ఎల్‌ఎండీ కాలనీలోని డైట్‌ కళాశాలలో తిమ్మాపూర్‌, గన్నేరువరం మండలాల ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న ఎఫ్‌ఎల్‌ఎన్‌ శిక్షణ శిబిరంలో శనివారం ఆయన మాట్లాడారు. ప్రస్తుత శిక్షణలో పిల్లల్లో సూక్ష్మ సామర్థ్యాల సాధనపై మరింత అవగాహన పెంచుకోవాలని చెప్పారు. టీచింగ్‌ మాడ్యూల్‌, పిల్లల అభ్యాస దీపికలు ఇప్పటికే అందరికీ అందించామని తెలిపారు. వాటిని పూర్తిగా సద్వినియోగపరచాలన్నారు. పిల్లల్లో గణితంపై ఆసక్తి రేకెత్తేలా విద్యాబోధన చేయాలని సూచించారు. బడికి రాని పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పచ్చదనం పెంచేలా ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం జిల్లా సెక్టోరియల్‌ అధికారి, క్వాలిటీ కో–ఆర్డినేటర్‌ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. గణిత భావనల పరిచయం, సమస్యల సాధనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గన్నేరువరం మండల నోడల్‌ అధికారి రవీంద్రాచారి, పర్లపల్లి, జంగపల్లి క్లస్టర్‌ నోడల్‌ అధికారులు దేవశంకర్‌, సుమలత, రిసోర్స్‌ పర్సన్లు కరుణాకర్‌, చంద్రశేఖర్‌, మాధవ్‌, శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంల అరెస్టుకు నిరసనగా ధర్నా


ధర్నా చేస్తున్న ఏఎన్‌ఎంలు, నాయకులు

కరీంనగర్‌టౌన్‌: ప్రభుత్వ ఉద్యోగుల గుర్తించాలని, సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 4న చేపట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళ్తున్న రెండో ఏఎన్‌ఎంలను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్‌ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి సమ్మయ్య మాట్లాడుతూ.. ఏఎన్‌ఎంల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. అసెంబ్లీ ముట్టడికి వెళ్తుంటే అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం రెండో ఏఎన్‌ఎంలను ప్రభుత్వ ఉద్యోగుల గుర్తించాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్‌, ఏఎన్‌ఎంలు రజిత, ఎస్‌.సుబ్బలక్ష్మి, మమత, శ్రీవాణి, సరోజన, అరుణ, కనకలక్ష్మి, విజయ, పద్మ, సంపూర్ణ, శ్యామల, సుజాత తదితరులు పాల్గొన్నారు.

‘స్వీపర్లపై చిన్నచూపు తగదు’


స్వీపర్లకు మద్దతు తెలుపుతున్న వాసుదేవరెడ్డి

విద్యానగర్‌: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న స్వీపర్లను వెంటనే రెగ్యులరైజ్‌ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్‌ చేశారు. శనివారం కరీంనగర్‌ కలెక్టరేట్‌ ఎదుట స్వీపర్ల రిలే నిరాహార దీక్షల శిబిరం వద్దకు వెళ్లి, మద్దతు తెలిపారు. 40 ఏళ్లుగా చాలీచాలని జీతంతో పని చేస్తున్న స్వీపర్లకు ప్రస్తుతం రూ.5,200 గౌరవ వేతనం ఇస్తున్నారని అన్నారు. ఈ మొత్తంతో కుటుంబం ఎలా గడుస్తుందని ప్రశ్నించారు. 25 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. బంగారు తెలంగాణలో స్వీపర్ల పట్ల చిన్నచూపు తగదని పేర్కొన్నారు. వెంటనే వారిని రెగ్యులరైజ్‌ చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నరేశ్‌, నాయకులు అలీం, రమేశ్‌, శంకరయ్య, మొండయ్య తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనలో నలుగురిపై కేసు

జమ్మికుంట: భూ వివాదంలో ఓ వ్యక్తిపై దాడికి పాల్పడిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌ కానిస్టేబుల్‌ మోహన్‌ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. జమ్మికుంట పట్టణంలోని శాలవాడకు చెందిన తోట కుమార్‌కు, అదే కాలనీకి చెందిన కల్లూరి రవి, జంపయ్య, ధర్ముల రాకేశ్‌, ప్రకాశ్‌లకు భూ తగాదా ఉన్నాయి. శుక్రవారం రాత్రి వారు కుమార్‌పై రాళ్లతో దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌ కానిస్టేబుల్‌ పేర్కొన్నారు.

బాలసదనం, శిశు గృహ తనిఖీ


శిశుగృహలో పిల్లలతో మాట్లాడుతున్న జడ్జి వెంకటేశ్‌

కరీంనగర్‌టౌన్‌: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్‌ సివిల్‌ జడ్జి వెంకటేశ్‌ శనివారం బాలసదనం, శిశు గృహను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలతో మాట్లాడి, వసతులున్నాయా లేదా తెలుసుకున్నారు. అన్ని వసతులు కల్పించాలని బాలసదనం సూపరింటెండెంట్‌ సంతోషిని ఆదేశించారు. కార్యక్రమంలో లీగల్‌ ఎయిడ్‌ కౌన్సిల్‌ మహేశ్‌, శ్రీనివాస్‌, చైల్డ్‌ లైన్‌ 1098 జిల్లా కో–ఆర్డినేటర్‌ సంపత్‌ తదితరులు పాల్గొన్నారు.

నీళ్లు నిలిచిన చోట ఆయిల్‌ బాల్స్‌

● దోమలు వృద్ధి చెందకుండా నగరపాలక సంస్థ చర్యలు



సాక్షి ఎఫెక్ట్‌..

కరీంనగర్‌ కార్పొరేషన్‌: వర్షపు నీళ్లు నిలిచి మురికికూపాలుగా మారిన చోట దోమలు వృద్ధి చెందకుండా నగరపాలక సంస్థ ఆయిల్‌ బాల్స్‌ వేసే కార్యక్రమం ప్రారంభించింది. నగరంలోని వివిధ డివిజన్‌లలోని పలుకాలనీల్లో వర్షపు నీళ్లు, డ్రైనేజీ నీళ్లు నిలిచి దోమలు పుట్టుకొస్తున్న వైనంపై ‘ఖాళీ జాగా...వ్యాధుల పాగా’ పేరిట శనివారం ‘సాక్షి’లో వచ్చిన కథనంపై నగరపాలక సంస్థ స్పందించింది. శనివారం పలుప్రాంతాల్లో నిలిచిన నీళ్లల్లో దోమలు పుట్టకుండా ఉండేందుకు ఆయిల్‌బాల్స్‌ వేశారు. రెండో డివిజన్‌ పరిధిలోని తీగలగుట్టపల్లిలో నీళ్లు నిలిచినచోట నగరపాలకసంస్థ కమిషనర్‌ సేవా ఇస్లావత్‌, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ వైద్యుల శ్రీధర్‌, జవాన్లు ఆయిల్‌బాల్స్‌ వేశారు. కాలనీల్లోని మురికికూపాలపై కమిషనర్‌ ఆరాతీశారు. శివారు ప్రాంతాల్లో స్వయంగా పరిశీలించారు.

మద్యం మత్తులో యువకుల వీరంగం

● అగ్గిపెట్టె లేదన్నందుకు ఇద్దరిపై దాడి ● ముగ్గురిపై కేసు


బాధితుడు రాజు

చొప్పదండి: పట్టణంలో శుక్రవారం తెల్లవారుజామున యువకులు వీరంగం సృష్టించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇద్దరు వ్యక్తులను కొట్టిన ముగ్గురు యువకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుడి కథనం ప్రకారం.. చొప్పదండికి చెందిన అనుమాండ్ల రాజు పెద్ది రమేశ్‌తో కలిసి కరీంనగర్‌లో కూరగాయలను హోల్‌సేల్‌గా కొనుగోలు చేసి, శుక్రవారం తెల్లవారుజామున ట్రాలీ ఆటోలో వస్తున్నాడు. చొప్పదండి పట్టణంలోని గాంధీనగర్‌ దాటిన తర్వాత ముగ్గురు యువకులు బైక్‌పై వచ్చి, వాహనానికి అడ్డుగా నిల్చొని, రాజును అగ్గిపెట్టె అడిగారు. అతను లేదని చెప్పి, ముందుకు వెళ్లగా మళ్లీ అడ్డగించారు. ఈసారి మరింత మంది జమకూడి, రాజును, అడ్డువచ్చిన రమేశ్‌పై దాడి చేశారు. ట్రాలీ ఆటో అద్దం పగులగొట్టారు. వారంతా మద్యం మత్తులో ఉన్నారని రాజు తెలిపాడు. గాయపడిన అతను కరీంనగర్‌ ఆస్పత్రికి వెళ్లి, చికిత్స చేయించుకున్నాడు. శనివారం చొప్పదండి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు చొప్పదండికి చెందిన ఎండీ.ఫయాజ్‌, కోరుట్లకు చెందిన లింగంపల్లి మానేశ్‌, ఎలిగేడుకు చెందిన సింగిరెడ్డి రమణలపై కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో యువతి మృతి


సమత (ఫైల్‌)

తిమ్మాపూర్‌: విద్యుదాఘాతంతో ఓ యువతి మృతిచెందిన ఘటన తిమ్మాపూర్‌ మండలంలోని పోరండ్లలో చోటుచేసుకుంది. ఎస్సై ప్రమోద్‌రెడ్డి కథనం ప్రకారం.. పోరండ్లకు చెందిన బొజ్జ సంపత్‌ కుమార్తె సమత(19) శనివారం ఉదయం 9.30 గంటలకు ఇంటి ఆవరణలోని దండెంపై దుస్తులు ఆరేస్తోంది. ఆ సమయంలో విద్యుత్‌ సరఫరా కావడంతో షాక్‌కు గురై, కుప్పకూలింది. గమనించిన కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒలింపియాడ్‌ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్‌ శ్రీపాల్‌రెడ్డి

కరీంనగర్‌రూరల్‌: భగత్‌నగర్‌లోని సిద్దార్థ ఇంగ్లిష్‌ మీడియం హైస్కూల్‌ విద్యార్థులు ఇండియన్‌ టాలెంట్‌ ఒలింపియాడ్‌ టెస్ట్‌లో రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచారని పాఠశాల అకాడమిక్‌ డైరెక్టర్‌ దాసరి శ్రీపాల్‌రెడ్డి తెలిపారు. ఆరోతరగతి విద్యార్థి కె.అర్జున్‌ రాష్ట్రస్థాయిలో టాపర్‌గా నిలిచి బంగారు పతకంతోపాటు నగదు బహుమతిని అందుకున్నట్లు పేర్కొన్నారు. ఏడోతరగతి విద్యార్థిని ఎం.సాన్వి, ఎనిమిదో తరగతి విద్యార్థి ఆర్‌.సాయిచరణ్‌లు రాష్ట్రస్థాయిలో ఎక్సలెన్స్‌ అవార్డు, ప్రశంసాపత్రాలు అందుకున్నారని తెలిపారు. వారిని డైరెక్టర్‌తోపాటు ఉపాధ్యాయులు శనివారం అభినందించారు.

హైకోర్టు విశ్రాంత చీఫ్‌ జస్టిస్‌కు సన్మానం


జస్టిస్‌ నవీన్‌రావును సన్మానిస్తున్న కరీంనగర్‌ బార్‌ అసోసియేషన్‌ ప్రతినిధులు

కరీంనగర్‌ క్రైం: ఉమ్మడి కరీంనగర్‌ జిల్లా వాసి, హైకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్‌ పి.నవీన్‌రావును కరీంనగర్‌ బార్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కోర్టు ఆవరణలో ఘనంగా సన్మానించారు. జిల్లా జడ్జి బి.ప్రతిమ, బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు బి.రఘునందన్‌రావు, ప్రధాన కార్యదర్శి లింగంపల్లి నాగరాజు తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను కరీంనగర్‌లోనే తెలుగు మీడియంలో చదువుకున్నానని తెలిపారు. లాయర్‌ వృత్తికి పనికిరానని తన తల్లిదండ్రులు అనేవారని, కష్టపడితే సాధించలేనిది ఏదీ లేదన్నారు. పట్టుదలతోనే ఈ స్థాయికి వచ్చానని పేర్కొన్నారు. హైకోర్టు జడ్జి అయిన తాను అక్కడే ప్రధాన న్యాయమూర్తిగా పదవీ విరమణ చేయడం తన అదృష్టమని తెలిపారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు వృత్తితోపాటు తమ కుటుంబాలకు సమయాన్ని ఇవ్వాలని సూచించారు. హైకోర్టు జడ్జిగా కొత్త కోర్టుల ఏర్పాటు, జ్యుడీషియరీ విస్తరణ కోసం తనవంతు కృషి చేశానన్నారు. కరీంనగర్‌ జిల్లా కోర్టుల నూతన భవన సముదాయం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపానని, ప్రభుత్వం నుంచి త్వరలో అనుమతి వస్తుందని చెప్పారు. జిల్లా జడ్జి ప్రతిమ, రాష్ట్ర బార్‌ కౌన్సిల్‌ మెంబర్‌ కాసుగంటి లక్ష్మణకుమార్‌, సీనియర్‌ న్యాయవాదులు ఈ.మధుసూదన్‌రావు, బాస సత్యనారాయణ, ఎర్రం రాజారెడ్డి ఇతరులు మాట్లాడారు. జస్టిస్‌ నవీన్‌రావు కుటుంబ నేపథ్యం, ఆయన పట్టుదల, హైకోర్టు జడ్జిగా ఆయన సేవలను వివరించారు. కార్యక్రమంలో వేములవాడ, సిరిసిల్ల, సుల్తానాబాద్‌, పెద్దపల్లి బార్‌ అసోసియేషన్ల కార్యవర్గ సభ్యులు, పబ్లిక్‌ ప్రాసిక్యూటర్లు, సీనియర్‌, జూనియర్‌ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

తెగిపోయిన తారురోడ్డు పరిశీలన

● నిధుల మంజూరుకు కృషి చేస్తా
● ఎంపీ సంజయ్‌కుమార్‌

వీణవంక: మండలంలోని కనపర్తిలో వీణవంక–కనపర్తి గ్రామాలకు వెళ్లే తారురోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు తెగిపోగా కరీంనగర్‌ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్‌ శనివారం పరిశీలించారు. వరద ఉధృతి వల్ల పంటలు దెబ్బతిన్నాయా అని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. బ్రహ్మణపల్లి గ్రామంలోని మానేరు వాగులో నిర్మించిన చెక్‌డ్యాంకు గండి పడగా పరిశీలించారు. దెబ్బతిన్న రోడ్ల మరమ్మతు నిమిత్తం నిధుల మంజూరుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కటంగూరి అనిల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్‌ మాడ గౌతంరెడ్డి, మండల అధ్యక్షుడు రామిడి ఆదిరెడ్డి, నాయకులు నరసింహరాజు, మల్లారెడ్డి, రాజు, సమ్మిరెడ్డి, సురేందర్‌రెడ్డి, గణపతి తదితరులు పాల్గొన్నారు.

వేరుకుళ్లు తెగులు నివారించాలి

● ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు
● రెండు గ్రామాల్లో పంటల పరిశీలన


వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

చొప్పదండి: ప్రస్తుత పరిస్థితుల్లో పత్తి పంటలో వేరుకుళ్లు తెగులు, రసం పీల్చే పురుగుల ఉధృతి పెరిగిందని, రైతులు వీటి నివారణపై దృష్టిసారించాలని జిల్లా ఏరువాక కేంద్రం, వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు సూచించారు. చొప్పదండి మండలంలోని గుమ్లాపూర్‌, రామడుగు మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామాల్లో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్‌ జి.మంజులత, శాస్త్రవేత్తలు డాక్టర్‌ డి.శ్రావణి, డాక్టర్‌ ఎం.రాజేంద్రప్రసాద్‌, వ్యవసాయ అధికారి వంశీకృష్ణ శనివారం పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ.. తెగులు నివారణకు కాపర్‌ ఆక్సీక్లోరైడ్‌ ఎకరానికి 600 గ్రాములు మొక్క మొదళ్ల దగ్గర పోయాలన్నారు. చేలల్లో మురుగు నీటిని తొలగించాలని, రసం పీల్చే పురుగుల నివారణకు ఎసిఫేట్‌ లీటర్‌ నీటికి 1.5 గ్రాములేదా ఇమిడాక్లాప్రైడ్‌ లీటరు నీటికి 0.3 మిల్లీలీటర్‌ చొప్పున కలిపి, పిచికారీ చేయాలని సూచించారు. మొగి పురుగు లక్షణాలు కనిపిస్తే నారు తీసే వారం రోజుల ముందు 2 గుంటల నారు మడికి 800 గ్రాముల కార్బోఫ్యూరాన్‌ 3జి గుళికలను చల్లి, ఆ నీటిని నారు మడిలోనే ఇంకేటట్లు చూసుకోవాలన్నారు. ముదురు నారు నాటేటప్పుడు నారు కొనలను తుంచివేయాలని చెప్పారు. నాటు వేసిన పక్షం రోజుల్లోపు కార్బోఫ్యూరాన్‌ 3జి గుళికలను ఎకరానికి పది కిలోల చొప్పున లేదా కార్టప్‌ హైడ్రో క్లోరైడ్‌ 4జి గుళికలు ఎకరానికి 8 కిలోల చొప్పున లేదా క్లోరాంత్రనిలిప్రోల్‌ 0.4జి గుళికలు 4 కిలోలు చల్లుకోవాలని సూచించారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు సమస్య ఉందని, నివారణకు ఎకరానికి ఒక లీటర్‌ వేప కషాయం లేదా ఇమామెక్టిన్‌ బెంజోయేట్‌ 20ను 80 గ్రాములు ఒక ఎకరానికి లేదా క్లోరాంత్రనిలిప్రోల్‌ 80 మిల్లీలీటర్లు ఎకరానికి సుడుల్లో మందు పడేలా పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవోలు సాయిప్రసన్న, రాజేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



కొత్తపల్లి(కరీంనగర్‌): కొత్తపల్లిలోని అల్ఫోర్స్‌ ఇ–టెక్నో స్కూల్‌లో శనివారం విద్యార్థులు, టీచర్లకు విద్యాసంస్థల చైర్మన్‌ వి.నరేందర్‌ రెడ్డి మొక్కలు పంపిణీ చేశారు. మొక్కలు పెంచి, పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల ప్రిన్సిపాల్‌, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ చైతన్య స్కూల్‌లో రెడ్‌ కలర్‌ డే



తిమ్మాపూర్‌: మండల కేంద్రంలోని శ్రీ చైతన్య పాఠశాలలో ప్రిన్సిపాల్‌ రవీందర్‌ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం రెడ్‌ కలర్‌ డే ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఎరుపు రంగు ప్రేమకు చిహ్నమని తెలిపారు. విద్యార్థులందరూ ఎరుపు దుస్తుల్లో ఎరుపు రంగు వస్తువులు, పుష్పాలు, బొమ్మలను తీసుకువచ్చారు. పాఠశాల డీజీఎం లక్ష్మణరావు, రీజినల్‌ ఇన్‌చార్జి రాజు, పీపీటీ కో–ఆర్డినేటర్‌ నూరి, ప్రైమరీ కో–ఆర్డినేటర్‌ విజయలక్ష్మి, పీపీటీ ఇన్‌చార్జి కృష్ణవేణి, ఏవో జ్యోతి రెడ్డి, డీన్‌ విజయ్‌ కృష్ణ, టీచర్లు పాల్గొన్నారు.

ఓపెన్‌ స్కూల్‌ సద్వినియోగం చేసుకోండి



కొత్తపల్లి: బడి మధ్యలో మానేసి, చదువుకోలేని వారికి ఓపెన్‌ స్కూల్‌ ఓ వరమని ఓపెన్‌ స్కూల్‌ జిల్లా కో–ఆర్డినేటర్‌ చలవాజ నాగేశ్వర్‌రావు తెలిపారు. కొత్తపల్లి జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో శనివారం ఓపెన్‌ స్కూల్‌ పోస్టర్‌ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువు మధ్యలో మానేసినవారు ఈ ఓపెన్‌ స్కూల్‌ ద్వారా పదోతరగతి, ఇంటర్‌ పూర్తి చేసే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అడ్మిషన్‌ కోసం కొత్తపల్లి హైస్కూల్‌లోని స్టడీ సర్కిల్‌ కో–ఆర్డినేటర్‌ వేణుగోపాలాచారిని నేరుగా గానీ 81848 55999 ఫోన్‌ నంబర్‌లో గానీ సంప్రదించాలని సూచించారు. హెచ్‌ఎం కె.జలజారాణి, టీచర్లు ఉన్నారు.

ఓటరు జాబితా సవరణ పూర్తి చేయండి


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్‌ ప్రఫుల్‌ దేశాయ్‌

చొప్పదండి: ఓటరు జాబితాలో మార్పులు, చేర్పుల కార్యక్రమం పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌, చొప్పదండి నియోజకవర్గ ఎలక్టోరల్‌ రిజిస్ట్రేషన్‌ అధికారి ప్రఫుల్‌ దేశాయ్‌ ఆదేశించారు. చొప్పదండి తహసీల్దార్‌ కార్యాలయంలో శనివారం నిర్వహించిన నియోజకవర్గ తహసీల్దార్లు, ఎన్నికల సిబ్బంది, రాజకీయ పార్టీల నాయకుల అవగాహన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఓటరు జాబితా సవరణ పూర్తి చేయాలన్నారు. కొత్త ఓటర్ల నమోదుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపల్‌ కమిషనర్‌ శాంతికుమార్‌, తహసీల్దార్లు జె.నరేందర్‌, బి.భాస్కర్‌ తదితరులున్నారు.

క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల తనిఖీ



పోలింగ్ కేంద్రం పరిశీలిస్తున్న తహసీల్దార్

కరీంనగర్‌రూరల్: రాబోయే సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని శనివారం కరీంనగర్ మండలం బొమ్మకల్‌లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ నవీన్ తనిఖీ చేశారు. జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలల్లోని కేంద్రాలను పరిశీలించి బీఎల్‌వోలను సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు. వికలాంగులు, వృద్ధులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. తహసీల్దార్ వెంట ఆర్‌ఐ రజనీకాంత్ ఉన్నారు.

నియామకం

విద్యానగర్(కరీంనగర్): బీసీ సంక్షేమ సంఘం జిల్లా మహిళా కమిటీని శనివారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆది మల్లేశం ప్రకటించి నియామకపత్రాలు అందజేశారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గున్నాల కన్నాంబ, ఉపాధ్యక్షురాలిగా పాక శ్రీలత, కార్యదర్శిగా మండల కృష్ణవేణి, అధికార ప్రతినిధిగా పొరండ్ల పద్మ, కరీంనగర్ అధ్యక్షురాలిగా కూరపాటి సింధూను నియమించారు. ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగోజు శ్రీనివాస్, కార్యదర్శి లింగంపల్లి శ్రీనివాస్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిగురుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలి



పాదయాత్రకు స్వాగతం పలుకుతున్న నాయకులు

కరీంనగర్: జిల్లాలో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శనిగరపు రజనీకాంత్ డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యార్థి చైతన్య మహాపాదయాత్ర శనివారం ఐదోరోజు కరీంనగర్‌కు చేరుకుంది. యాత్రకు నగర కమిటీ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, జిల్లాలో అగ్రికల్చర్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ ఎం.పూజ, జిల్లా బాధ్యులు గజ్జల శ్రీకాంత్, కాంపెల్లి అరవింద్, రోహిత్, వినీషా, సురేష్, వినయ్, మనోజ్, శ్రీజ, రాకేశ్, శివ, సందీప్, శ్రీవాణి, వంశీ, అక్షిత్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని సీపీకి ఫిర్యాదు

కరీంనగర్‌క్రైం: మంత్రి గంగుల కమలాకర్‌పై తప్పుడు ప్రకటనలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని శనివారం బీఆర్‌ఎస్ నాయకులు సీపీ సుబ్బారాయుడుని కలిసి ఫిర్యాదు చేశారు. సీపీని కలిసిన వారిలో నాయకులు యూసుఫ్, సాబీర్, ఫహద్, బాబుజాని, షహీస్ అలీలు ఉన్నారు.

అడ్రస్.. ఇక ఈజీ!

- చిరునామా చిక్కులు తొలగేలా బోర్డులు
- ఇంటి నంబర్ల వారీగా వివరాల ప్రదర్శన
- నగరంలో.. ఆదర్శంగా నిలుస్తున్న కాలనీలు

కరీంనగర్ అర్బన్: చిరునామాకు చక్కని పరిష్కారం సూచించారు ఈ కాలనీవాసులు. నగరాల్లో చిరునామా గుర్తించాలంటే వీధి వీధి తిరగాల్సిందే. అసలే కరీం'నగరం'.. 3లక్షల జనాభా.. కిలోమీటర్ల విస్తీర్ణ సమాహారం జనసమూహం. కనుక్కోండి చూద్దామన్నట్లుగా ప్రాంతాలున్నాయి. కొత్త వారు చిరునామాను చేరుకోవాలంటే ఆపసోపాలు పడాల్సిందే. వీధుల పేర్లను గుర్తించాలంటే అక్కడక్కడా అడిగితే గానీ గమ్యం చేరడం కష్టం. ఇలాంటి పరిస్థితుల్లో ఈ కాలనీలు మాత్రం ఆదర్శంగా నిలుస్తున్నాయి. ఎవరైనా ఆ కాలనీల పేరు చెబితే చాలు అబ్బో ఎంత వివరంగా పేర్కొన్నారోనన్న మాట రాక మానదు.



తిరుమలనగర్‌లో ఇంటి నంబర్లను సూచిస్తూ ఏర్పాటు చేసిన బోర్డులు

సండే స్పెషల్

నగరంలోని తిరుమల్‌నగర్, మారుతినగర్, రాంచంద్రపూర్‌కాలనీ, శ్రీహరినగర్, విద్యానగర్, అంజనీనగర్, ఆర్టీసీ వర్క్‌షాపు ఏరియా, వావిలాలపల్లిలోని ఒక్కో కాలనీల్లో సుమారు 600ల వరకు నివాసాలున్నాయి. దాదాపు 16వేల కుటుంబాలు జీవనం సాగిస్తుండగా.. గతంలో అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నా ప్రస్తుతం ప్రగతికి చేరువలో ఉంది. ఒక్కో కాలనీ ఒక్కో సంవత్సరంలో ఏర్పడగా అవి ఏర్పడినప్పుడు మినీ కుంటలు, మోకాల్లోతు గుంతలతో అసౌకర్యంగా ఉండేవి. ఎవరింటికైనా వెళ్లాలంటే చిరునామా కనుక్కోవడం కష్టంగా ఉండేది. కాలనీవాసుల సమష్టి కృషితో కాలక్రమేణా సుందరంగా మలిచారు. కుగ్రామంలో ఉన్నవారైనా ఇక్కడికి వస్తే ఎవరిని చిరునామా గురించి ఆరా తీయాల్సిన అవసరం లేదు. దారుల వెంట వెళ్తంటే.. ఇంటినంబర్లతో సహా ఉన్న వీధి నంబరు అనివార్యంగా గమ్యాన్ని చేర్చుతాయి. వీధి నంబర్ 1 నుంచి 8వరకు ఉండగా ప్రతీ బోర్డుపై ఆ వీధిలో ఉన్న ఇళ్ల వివరాలను పేర్కొన్నారు. వరుసగా ఇంటినంబర్లను పేర్కొనగా బంధువులైనా, ప్రభుత్వ సిబ్బందైనా క్షణాల్లో చేరుకునే వెసులుబాటు కల్పించారు ఆ కాలనీవాసులు.

అభివృద్ధికి పాటుపడుతున్నాం



తిరుమలనగర్‌లో గృహ యజమానులమంతా స్వచ్ఛందంగా అభివృద్ధికి పాటుపడుతున్నాం. ప్రభుత్వ సహకారం ఆశించిన స్థాయిలో లేదు. సీసీ రోడ్లు లేని వీధులున్నాయి. వేసవిలో భూగర్భ జలాలు అడుగంటడంతో బోర్లు వట్టిపోతున్నాయి. మున్సిపల్ నీటి సరఫరా సమయం పెంచాలి.

– శ్రీనివాస్‌రెడ్డి, తిరుమల్‌నగర్

చాలా బాగుంది



మా ఫ్రెండ్ రాంనగర్‌లో నివాసం. కళాశాలలో రోజూ కలుస్తున్నప్పటికీ ఓ సారి అత్యవసర పని నిమిత్తం వాళ్లింటికి వెళ్తే ఇల్లు ఎక్కడో గుర్తించేందుకు ఫోన్లు చేస్తూ ఇబ్బందులు పడ్డా. ఇంటి నంబర్ చెప్పినా ఏ గల్లీ నుంచి ఎటు వెళ్లాలో తెలీదు. కానీ ఇక్కడ మాత్రం ప్రతీ వీధి, ఇంటి నంబర్‌తో సహా పొందుపర్చారు.

– రవీందర్, ఆర్టీసీ వర్క్‌షాప్ ఏరియా

ఎవరికైనా సమాచారం సులువు



కాలనీల్లో ప్రతీ వీధికి బోర్డులు ఏర్పాటు చేయడం అభినందనీయం. ఎవరొచ్చినా నిస్సందేహంగా ఇల్లు చేరుకోవచ్చు. విద్యార్థులు, సర్వీస్ సెంటర్లకు మరింత సౌకర్యంగా ఉంది. ఆలోచన బాగుంది.

– వాసరి సుజాత, విద్యానగర్

నగరమంతా ఇలా ఉంటే బాగుండు



కొన్ని కాలనీల్లో స్ఫూర్తిదాయకంగా సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. నగరంలోని అన్ని ప్రాంతాల్లో ఇలా ఏర్పాటు చేస్తే అందరికి సౌకర్యం. చిరునామాలకు చేరుకోవడం మరింత సులువవుతుంది. తదనుగుణంగా ఆయా కాలనీలు ఆలోచించాలి.

– మామిడి కృష్ణ, అంజనీనగర్

సేవా కార్యక్రమాలు



కాలనీల అభివృద్ధి కమిటీల పేరుతో సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు. పండుగల సమయంలో సౌకర్యాలు కల్పించి ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పిస్తున్నారు. నిరుపేదలకు ఆర్థిక చేయూతనిస్తున్నారు. ఎవరో వచ్చి ఏదో చేస్తారని అనుకోకుండా స్వచ్ఛందంగా కమిటీలు ముందుకు రావడం హర్షనీయం.

– సర్దార్ హర్మిందర్‌సింగ్, సిక్‌వాడీ

పవర్‌కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: కరీంనగర్‌లో స్మార్ట్‌సిటీ పనులు చేపడుతున్నందున ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 11కేవీ ఉజ్వల పార్కు ఫీడర్ పరిధిలోని ఎన్టీఆర్ విగ్రహం, హనుమాన్‌నగర్, శ్రద్ధ ఇన్ లేన్, ఉజ్వల పార్కు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2 ఏడీఈ ఎం.సుధీర్ కుమార్ తెలిపారు.

సమ్మెతో బస్సులు నడవక ఇబ్బందులు



ఆర్టీసీ కార్మికులు కరీంనగర్ శనివారం ఉదయం సమ్మె చేయడంతో రెండు గంటల పాటు బస్సులు నడవక విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

తహసీల్దార్‌ను కలిసిన రేషన్ డీలర్లు



తహసీల్దార్‌కు పూల బొకే ఇస్తున్న రేషన్ డీలర్లు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్‌రూరల్ మండల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన నవీన్‌ను శనివారం మండల రేషన్ డీలర్లు మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ శంకర్, ఆర్‌ఐ రజనీకాంత్, రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు తాటి పూర్ణచందర్‌రావు, కార్యదర్శి గంట శంకరయ్య, ప్రతినిధులు కాశెట్టి దామోదర్, బెజ్జంకి అంజయ్య, ఆకుల కనకరాజు, బి.రాజు, సాధినేని మునీందర్, తిరుపతి, గోవర్ధన్, జగన్‌మోహన్‌రావు, నరహరిరావు, గాజుల కిరణ్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై ప్రజావేదిక



ప్రజావేదికలో పాల్గొన్న జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలతరెడ్డి

కొత్తపల్లి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కొత్తపల్లి మండల రెండో విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక శనివారం కరీంనగర్‌లోని మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి ఎల్.శ్రీలతరెడ్డి అధ్యక్షతన జరిగింది. సామాజిక తనిఖీ బృందాలు గతనెల 25 నుంచి శనివారం వరకు గ్రామాల్లో పర్యటించి తనిఖీ నిర్వహించారు. ఈ సామాజిక తనిఖీలో భాగంగా అన్ని గ్రామ పంచాయతీలను సందర్శించి ఉపాధి హామీ పథకం పనులను పర్యవేక్షించారు. మండలంలో 6,50,36,356 రూపాయల ఖర్చు చేయగా 1,0,495 రూపాయలకు సంబంధించిన పనుల్లో తేడాను గుర్తించారు. ఈ కార్యక్రమంలో అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి సంధ్యారాణి, ఎంపీడీవో ఏ.శ్రీనివాస్‌రెడ్డి, సామాజిక తనిఖీ ఎస్టీఎం దత్తు, మండల అధికారులు, గ్రామ పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

చిత్ర కథ



చెత్త 'స్మార్ట్' సిటీ

కరీంనగర్ నగర పాలక సంస్థ పారిశుధ్య నిర్వహణలో బెస్ట్ అవార్డులు, రివార్డులు అందుకుంటున్నట్లు అధికారులు పలుమార్లు ప్రకటించినా.. వాస్తవంలో మాత్రం చెత్త సిటీగానే ఉంటుంది. శనివారం కరీంనగర్‌లోని అన్నపూర్ణ కాంప్లెక్స్ పార్కింగ్ స్థలంలో చెత్త పేరుకపోయి కుక్కలు, పందులకు ఆవాసంగా మారి కంపు కొడుతుండటంతో ఆ ప్రాంత వ్యాపారులు, కొనుగోలుదారులు ముక్కులు మూసుకుని అవస్థలు పడుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

'బ్లూబెల్స్'లో రెయిన్ డే



విద్యానగర్: కరీంనగర్‌లోని బ్లూబెల్స్ స్కూల్‌లో శనివారం రెయిన్ డే వేడుకలు నిర్వహించారు. చిన్నారులు వర్షంలో తడువకుండా వేసుకునే రెయిన్ కోట్స్, వాడే వస్తువులతో పాల్గొని సందడి చేశారు. స్కూల్ ప్రిన్సిపాల్ జంగ సునీత మనోహర్‌రెడ్డి చిన్నారులకు వర్షం పడుతున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ వేడుకల్లో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతోనే గుర్తింపు



రాజేశ్వరరావును సన్మానిస్తున్న మేయర్

కరీంనగర్ కార్పొరేషన్: ఉత్తమ సేవలందించే ఉద్యోగులు ఎక్కడున్నా గుర్తింపు ఉంటుందని మేయర్ సునీల్‌రావు అన్నారు. నగరపాలక సంస్థలో రెండేళ్లుగా అసిస్టెంట్ కమిషనర్‌గా సేవలందించి, కోరుట్ల మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతి పొందిన రాజేశ్వర్ రావుకు శనివారం వీడ్కోలు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరపాలక సంస్థలో అసిస్టెంట్ కమిషనర్‌గా రాజేశ్వర్‌రావు ఉత్తమ సేవలందించారని అన్నారు. ఉద్యోగుల సహకారం ఉంటేనే నగరపాలక సంస్థ చేపట్టిన ప్రతీ కార్యక్రమం విజయవంతం అవుతుందని తెలిపారు. రాజేశ్వరరావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సేవా ఇస్లావత్, కార్పొరేటర్లు వాల రమణారావు, ఐలెందర్, బీఆర్‌ఎస్ నాయకులు కాశెట్టి శ్రీనివాస్, గందె మహేష్, కోల సంపత్, పిట్టల శ్రీనివాస్, తుల బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

కరీంనగర్‌క్రైం: నగరంలోని కట్టరాంపూర్‌కు చెందిన ఓ వివాహిత శనివారం నుంచి కనిపించడం లేదని ఆమె తల్లి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కట్టరాంపూర్‌లోని విజయనగర్‌లో జ్యోత్స్న తన భర్తతో కలిసి నివసిస్తోంది. భార్యభర్తల మధ్య జరుగడంతో శుక్రవారం రాత్రి సమీపంలోని తన తల్లివద్దకు వచ్చి బాధపడింది. శనివారం ఉదయం ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోవడంతో స్థానికంగా, బంధువుల ఇంట్లో వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఆమె తల్లి రమాదేవి ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

'విద్యారంగాన్ని బలోపేతం చేయడంలో విఫలం'



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణ్

కరీంనగర్: విద్యారంగాన్ని బలోపేతం చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ అన్నారు. శనివారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డిభవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. విద్యావ్యవస్థ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరుపై ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో మిలిటెంట్ ఉద్యమాలు నిర్వహిస్తామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోకి విద్యార్థి సంఘాలను రానివ్వొద్దని ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను ఉపసంహరించుకోకుంటే ప్రగతిభవన్ ముట్టడిస్తామని తెలిపారు. ఆగస్టు 3, 4 తేదీల్లో కరీంనగర్‌లో జరిగిన ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో విద్యారంగ సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించడం జరిగిందన్నారు. ఏఐఎస్‌ఎఫ్ 88వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఈనెల 12వ తేదీ నుంచి 19వరకు వార్షికోత్సవాలు నిర్వహించనున్నమని తెలిపారు. ఈ సమావేశంలో గ్యార క్రాంతి, రామరావు వెంకటేష్, మచ్చ రమేష్, అన్వర్, హరీశ్, రాము యాదవ్, కనకం, సాగర్, విష్ణు, నునవత్ శ్రీనివాస్ నాయక్, సందీప్ రెడ్డి, వినయ్‌రెడ్డి, అడపా సాయి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఆదేశాలు బేఖాతరు

- పంటనష్టంపై సర్వే చేయని అధికారులు
- ఇసుకమేటలతో రైతుల ఆందోళన
- కరీంనగర్ నియోజకవర్గంలో 20ఎకరాల్లో మాత్రమే నష్టం




చెర్లభూత్కూర్‌లో పొలాల్లో ఇసుకమేటలు

కరీంనగర్‌రూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ధ్వంసమైన రోడ్లు, కాలువలు, చెరువులు, పంట నష్టంపై పక్కాగా సర్వే చేసి నివేదిక ఇవ్వాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ మూడురోజుల క్రితం జరిగిన వరద నష్టంపై సమీక్షా సమావేశంలో అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్ శాఖల అధికారులు సర్వే చేసి నష్టం వివరాలు సేకరించి నివేదిక పంపించగా వ్యవసాయశాఖ మాత్రం ఎలాంటి చర్యలు చేపట్టలేదు. సాక్షాత్తు గంగుల కమలాకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్ నియోజకవర్గంలోనే వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టం వివరాలు సేకరించకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. అధికారులు ఎలాంటి సర్వే చేయకముందే మొక్కుబడిగా ఉమ్మడి కరీంనగర్ మండలంలో దాదాపు 200 ఎకరాలకుపైగా నష్టం పరిగితే 20 ఎకరాల్లో మాత్రమే పంట నష్టం జరిగినట్లు నివేదిక ఇవ్వడం గమనార్హం. మంత్రి పంటనష్టంపై క్షేత్రస్థాయిలో సర్వే చేయాలని ఆదేశించినప్పటికీ రైతుబీమా పథకంలో అర్హులైన రైతులను చేర్పించే కార్యక్రమంతో సర్వే చేయలేదని అధికారులు పేర్కొంటున్నారు.

ఇసుకమేటలతో ఆందోళన

వారం రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలు రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగించాయి. కరీంనగర్ మండలంలోని చెర్లభూత్కూర్, ఎలబోతారం, చామనపల్లి, మొగ్దుంపూర్, దుర్శేడ్, ఇరుకుల్ల, చేగుర్తి తదితర గ్రామాల్లోని వందలాది ఎకరాల పంట పొలాల్లో ఇసుకమేటలేర్పడ్డాయి. భారీ వరదలకు పొలాల్లోని వరిపంటపై ఇసుక, మట్టి కప్పడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇసుకమేటలను తొలగించి మరో పంట వేద్దామంటే ఆర్థికంగా ఎంతో భారమవుతుందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఏమైనా ఆర్థికసాయం చేస్తుందని ఆశపడుతున్న రైతులకు అధికారులు తీరు నిరాశను కలిగిస్తోంది. కేవలం కరీంనగర్ మండలంలో ముగ్గురు రైతులకు చెందిన 8 ఎకరాలు, కొత్తపల్లి మండలంలో ఐదుగురి రైతుల 12 ఎకరాల్లో మాత్రమే పంట నష్టం జరిగిందని నివేదిక ఇవ్వడంతో మిగితా రైతులు లబోదిబోమంటున్నారు. ఇప్పటికైనా వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టం వివరాలను సేకరించాలని బాధిత రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈమేరకు సోమవారం నుంచి సర్వే చేపడుతున్నట్లు మండల వ్యవసాయాధికారి సత్యం తెలిపారు.


పొలం అమ్మి బిడ్డ పెళ్లి చేద్దామనుకున్నా..



వానాకాలం తర్వాత 30గుంటల పొలం అమ్మి బిడ్డ పెళ్లి చేద్దామనుకున్నా. భారీవర్షాలకు పోచమ్మ ఒర్రెలోని వరదనీళ్లన్నీ పొలంలోకి వచ్చాయి. 10గుంటల పొలంలో గండ్లు పడి మట్టి, ఇసుకతో నిండిపోయింది. ఇసుకమేటలను తొలగించడం పెద్దఖర్చుతో కూడుకున్నది. ఏమి చేయాలో తెలియడం లేదు.

– ఐలవేణి రమేష్, రైతు, చెర్లభూత్కూర్

వ్యవసాయం విడిచిపెట్టా..



ఆరు ఎకరాల్లో వరిపంట సాగు చేశా. వర్షాలకు మొత్తం పొలమంతా ఇసుకమేటలు ఏర్పడ్డాయి. సుమారు లక్ష రూపాయల వరకు పెట్టుబడి పెట్టా. పొలంలోని ఇసుకను తొలగించినా లాభం లేదని విడిచిపెట్టా. యాసంగిలో అకాల వర్షాలకు వరి గింజలన్నీ రాలిపోగా ఇంతవరకు నష్టపరిహారం రాలేదు. వరుసగా పంట నష్టంతో ఆర్థికంగా కోలుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఇక వ్యవసాయం బందు చేసి ఎక్కడైనా వాచ్‌మెన్‌గా పనిచేస్తా.

– రొండ్ల అనంతరెడ్డి, రైతు, చెర్లభూత్కూర్



మానేరు విద్యాసంస్థల్లో..

విద్యాసంస్థల్లో ముందస్తు ఫ్రెండ్‌షిప్ డే



అల్ఫోర్స్ డిగ్రీ కళాశాలలో..



రేకుర్తి ప్యారడైజ్ హైస్కూల్‌లో..

సప్తగిరికాలనీ/కొత్తపల్లి: కరీంనగర్‌లోని మానేరు, రేకుర్తిలోని ప్యారడైజ్ హైస్కూల్, సూర్యనగర్‌లోని అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం ముందస్తు ఫ్రెండ్‌షిప్‌డే ఘనంగా నిర్వహించారు. ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లు కట్టుకుంటూ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమాల్లో ఆయా విద్యాసంస్థల అధినేతలు, కరస్పాండెంట్లు, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాక్షి ఎఫెక్ట్

నగరంలోని 35వ డివిజన్ సప్తగిరికాలనీలోని శ్రీనగర్‌కాలనీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌కు కనెక్షన్ ఇవ్వకపోవడంపై ఈనెల 4న 'సాక్షి'లో 'ట్రాన్స్‌ఫార్మర్ బిగించి.. కనెక్షన్ మరిచి..' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. శనివారం ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు. దీంతో స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.



– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

టీటీడీ చైర్మన్‌గా భూమన కరుణాకర్‌రెడ్డి



సాక్షి, అమరావతి: తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తల మండలి (టీటీడీ బోర్డు) చైర్మన్‌గా తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డిని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నియమించారు. ప్రస్తుతం టీటీడీ చైర్మన్‌గా ఉన్న వైవీ సుబ్బారెడ్డి, ధర్మకర్తల మండలి పదవీకాలం ఈ నెల 8వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలో టీటీడీ చైర్మన్‌గా భూమనను సీఎం వైఎస్ జగన్ నియమించారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను దేవాదాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలవన్ శనివారం జారీ చేశారు. ధర్మకర్తల మండలి సభ్యులను త్వరలో నియమిస్తామని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సీఎం జగన్‌కు భూమన కృతజ్ఞతలు

తనను టీటీడీ చైర్మన్‌గా ఎంపిక చేసినందుకు సీఎం వైఎస్ జగన్‌కు భూమన కరుణాకర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డికి అత్యంత సన్నిహితుడైన భూమన కరుణాకర్‌రెడ్డి 1958, ఏప్రిల్ 5న వైఎస్సార్ జిల్లా నందలూరు మండలం ఈదర పల్లెలో జన్మించారు. ఆయన తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీ నుంచి ఎంఏ పట్టా పొందారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హయాంలో 2004–06 మధ్య తుడా(తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) చైర్మన్‌గా భూమన పనిచేశారు. ఆ తర్వాత 2006–08 మధ్య టీటీడీ బోర్డు చైర్మన్‌గా అత్యంత సమర్థవంతంగా పనిచేశారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హఠాన్మరణం తర్వాత వైఎస్ జగన్ వెంట భూమన నడిచారు. తిరుపతి శాసనసభ స్థానానికి 2012లో జరిగిన ఉప ఎన్నికలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఘనవిజయం సాధించారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో తిరుపతి శాసనసభ స్థానం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేసి రెండోసారి విజయం సాధించారు. సభా హక్కుల కమిటీ చైర్మన్‌గా భూమన వ్యవహరిస్తున్నారు.

చంద్రబాబు ఏ1గా కేసు నమోదు చేస్తాం: వనిత

రాజమహేంద్రవరం రూరల్: పుంగనూరులో రెచ్చగొట్టేలా మాట్లాడి విధ్వంసానికి కారకుడైన ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు ఏ1గా కేసు నమోదు చేస్తామని ఏపీ హోం మంత్రి తానేటి వనిత తెలిపారు. కలెక్టరేట్ ఆవరణలో శనివారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు ముందే నిర్ణయించిన షెడ్యూల్ రూట్‌లో వెళ్లకుండా, ఎందుకు పుంగనూరులోకి ప్రవేశించాల్సి వచ్చిందని ప్రశ్నించారు. ఇది శాంతి భద్రతలకు విఘాతం కల్పించాలనే కుట్రేనని అన్నారు.

పక్కా 'ఎల్లో' స్కెచ్

'పచ్చ'నేతల కనుసన్నల్లోనే పుంగనూరు విధ్వంసకాండ

- పోలీసులపై దాడికి టీడీపీ ప్రత్యేకంగా వ్యూహరచన
- ముందస్తుగా రాళ్లు, మద్యం బాటిళ్ల తరలింపు
- వాహనాలు తగులబెట్టేందుకు పెట్రోల్ బాటిళ్లు సిద్ధం
- సదుం, సోమల, పులిచెర్ల నుంచి కిరాయి మూకల రాక
- రూట్‌మ్యాప్‌ను కాదని పోలీసులతో వాగ్వాదం
- ఇద్దరు డీఎస్పీలే లక్ష్యంగా పచ్చ మూకల దాడులు
- ఇలాగైనా ప్రజల్లో గుర్తింపు పొందాలని బరితెగింపు



శుక్రవారం పోలీసు వాహనాలను ధ్వంసం చేస్తున్న టీడీపీ కిరాయి మూకలు

చిత్తూరు అర్బన్: పుంగనూరు బైపాస్ రోడ్డు వద్ద విధ్వంసకాండకు టీడీపీ రెండు రోజుల ముందే వ్యూహ రచన చేసిందా? ఇందులో భాగంగానే పలు మార్లు రూట్ మ్యాప్‌ను మార్చారా? కృష్ణదేవరాయ కూడలి వద్ద ముందుగానే రాళ్లు పోగేసుకున్నారా? సమీపంలోని పంట పొలాల్లోకి ఖాళీ మద్యం సీసాలను తీసుకొచ్చి దాచారా? ఈ ప్రశ్నలన్నింటికీ అవుననే సమాధానం వినిపిస్తోంది. ఎలాగైనా సరే అల్లర్లు సృష్టించి, రాజకీయ లబ్ధి పొందాలని పన్నాగం పన్నారని స్పష్టమవుతోంది. టీడీపీ పెద్దల సూచన మేరకు కొందరు నేతలు, కార్యకర్తల కనుసన్నల్లో ఈ వ్యూహం రూపొందిందని ప్రత్యక్ష సాక్ష్యుల ద్వారా తెలుస్తోంది. ముందుగా రూపొందించిన వ్యూహం మేరకు చంద్రబాబు నాయుడు నుంచి వచ్చిన అధికారిక పర్యటన రూట్ మ్యాప్‌లో పుంగనూరు పట్టణంలో ఎలాంటి కార్యక్రమం లేదు. అయినప్పటికీ పుంగనూరు పట్టణంలోకి చంద్రబాబు రావడానికి పట్టుపట్టాలని, అందుకు పోలీసులు ఒప్పుకోరని.. అప్పుడు పోలీసులపై రాళ్లు రువ్వాలన్నది ముందస్తు వ్యూహం. ఇందులో భాగంగా ముందురోజు కొన్ని వాహనాల్లో రాళ్లను తీసుకొచ్చి కృష్ణదేవరాయల కూడలి సమీపంలో అక్కడక్కడ పోసి ఉంచారు. బార్లు, మద్యం షాపుల నుంచి ఖాళీ బీరు సీసాలు, మద్యం బాటిళ్లను తీసుకొచ్చి సమీపంలోని పొలం వద్ద దాచారు. పరిస్థితిని బట్టి ఉపయోగించాలని కొన్ని బాటిళ్లలో పెట్రోల్ నింపుకొచ్చి అక్కడ ఉంచారు. చంద్రబాబు నాయుడుకు స్వాగతం పలికేందుకు తీసుకొచ్చిన 50కి పైగా పెద్ద సైజు పేలుడు పదార్థాల ఉండలను (బాంబుల్లాంటివి) ఓ ప్రదేశంలో దాచారు. శుక్రవారం సదుం, పులిచెర్ల, సోమల మండలాల నుంచి పలువురిని కిరాయికి తీసుకొచ్చి జన సమూహంలో కలిపేశారు. అంగళ్లలో చంద్రబాబు ఎప్పుడైతే రెచ్చగొట్టే ప్రసంగం చేస్తూ.. 'పదండి పుంగనూరుకు.. ఆ పుడింగి సంగతి తేలుద్దాం' అని పిలుపునిచ్చారో ఆ తర్వాత కూడా పలువురు టీడీపీ నేతలు మదనపల్లి నుంచి వస్తూ వస్తూ వారి వాహనాల్లో ఖాళీ మద్యం బాటిళ్లు, రాళ్లు, కర్రలు వేసుకుని వచ్చారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల తర్వాత స్థానిక టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా బాబు బైపాస్ రోడ్డు వద్దకు చేరుకుని, చంద్రబాబును పట్టణంలోకి అనుమతించాలని పట్టుపట్టారు. జెడ్ ప్లస్ సెక్యూరిటీ ఉన్న ప్రతిపక్ష నేత పర్యటనను ఎలా పడితే అలా ఉన్నట్లుండి మార్చడం కుదరదని పోలీసులు చెప్పినా వినిపించుకోలేదు. దీంతో కార్యకర్తల్ని చల్లా బాబు రెచ్చగొట్టాడు.

బాటిళ్లు, చెప్పులతో దాడి

చల్లా బాబు మాటలతో రెచ్చిపోయిన కార్యకర్తలు.. ఇద్దరు డీఎస్పీలను లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడ్డారు. గతేడాది కుప్పంలో చంద్రబాబు నాయుడు పర్యటనలో ప్రసంగాలకు ముందస్తు అనుమతిలేదని పలమనేరు డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, చిత్తూరు దిశ పోలీస్ స్టేషన్ డీఎస్పీ బాబుప్రసాద్ నోటీసులు జారీ చేశారు. 'నాకే నోటీసులు ఇచ్చే ధైర్యమా? మీ కథ చూస్తా' అంటూ అప్పుడు చంద్రబాబు సైతం డీఎస్పీలకు హెచ్చరికలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఈ ఇద్దరు డీఎస్పీలను లక్ష్యంగా చేసుకున్న టీడీపీ శ్రేణులు తొలుత ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు, చెప్పులను పోలీసులపైకి విసిరారు. ఇది పద్ధతికాదని పోలీసు అధికారులు నచ్చజెపుతుండగానే ఒక్కసారిగా పక్కనే ఉన్న రాళ్లు విసురుతూ విరుచుకుపడ్డారు. పోలీసులు తేరుకునేలోపే టీడీపీ నేతలు తీసుకొచ్చిన కిరాయి కార్యకర్తలు వందల సంఖ్యలో రాళ్లు, మద్యం బాటిళ్ల వర్షాన్ని కురిపించారు. దీంతో పరిస్థితి అదుపుతప్పింది.

పోలీసులు బతిమాలినా వదల్లేదు

కొందరు పోలీసులు వద్దని బతిమిలాడుతుంటే వాళ్లను వ్యాను పక్కకు లాక్కెళ్లి పోలీసు లాఠీలు లాక్కుని మరీ చావ బాదారు. టపాకాయ బాంబులను పోలీసులపై విసురుతుంటే ఏం జరుగుతుందో కూడా తెలియని స్థితిలో తమను తాము కాపాడుకునే ప్రయత్నంలో చేతిలో ఉన్న ప్లాస్టిక్ గార్డులను అడ్డుగా పెట్టారు. రాళ్ల దెబ్బకు అవన్నీ ధ్వంసమయ్యాయి. అంతటితో ఆగక పోలీసుల వాహనాలపైకి టపాకాయ బాంబులు విసురుతూ.. ముందుగా తెచ్చుకున్న పెట్రోల్‌ను వాటిపై పోసి నిప్పంటించారు. రాళ్ల దెబ్బలతో రక్తమోడుతున్న పోలీసులను చూసి మానవత్వం లేకుండా దాదాపు 40 నిమిషాల పాటు ఏకధాటిగా రాళ్లు, బాటిళ్లను విసురుతూ పచ్చ మూకలు పైశాచిక ఆనందం పొందాయి.

చివరకు చిల్లర గొడవలే దిక్కా!?

ముందస్తు మేనిఫెస్టో, లోకేశ్ పాదయాత్ర.. ఇలా ఎన్ని ప్రయత్నాలు చేసినా టీడీపీ తేరుకునే అవకాశాలు లేకపోవడంతో చంద్రబాబు చివరకు తనకు అలవాటైన ఘర్షణలనే నమ్ముకున్నారని పుంగనూరు ఘటన స్పష్టం చేస్తోంది. ప్రజాదరణ లేదని తేలిపోవడంతో రోడ్‌షోలతో వీధి గొడవలకు దిగుతున్నారు. ప్రాజెక్టుల సందర్శన ముసుగులో పర్యటిస్తున్న చంద్రబాబు అసలు ఆ అంశాలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. అంతిమ లక్ష్యం రెచ్చగొట్టి ఘర్షణలకు పురిగొల్పడమేనని స్పష్టమవుతోంది. తన పర్యటనలను యుద్ధభేరిగా మార్చుకోవటాన్ని బట్టే వాస్తవాలు బహిర్గతమవుతున్నాయి. ఇందులో భాగంగానే రాయలసీమలో గొడవలు సృష్టించేందుకు ఒక పథకం ప్రకారం చంద్రబాబు పర్యటనల ద్వారా డిజైన్ చేసినట్లు స్పష్టమవుతోంది. తొలుత పులివెందులలో కూడా ఇలానే రెచ్చగొట్టి గొడవ సృష్టించడానికి విఫలయత్నం చేయడం తెలిసిందే. వాస్తవానికి పులివెందులలో టీడీపీకి దిక్కులేదు. అందుకే కిరాయి జనంతో రోడ్‌షో నిర్వహించి హడావుడి చేశారు. అనుకున్న లక్ష్యం నెరవేరక పుంగనూరుపై దృష్టి సారించి, గొడవ సృష్టించడంలో సఫలమయ్యారు.

కీలకపాత్రధారి చల్లా బాబు

మీడియాతో డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ రిషాంత్

పుంగనూరులో జరిగిన అల్లర్లు, పోలీసులపై దాడులు మొత్తం ముందస్తు ప్లాన్ ప్రకారం జరిగినవేనని రాయలసీమ డీఐజీ అమ్మిరెడ్డి, చిత్తూరు ఎస్పీ రిషాంత్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం చిత్తూరులోని పోలీసు అతిథి గృహంలో వారు మీడియాతో మాట్లాడారు. పుంగనూరులో టీడీపీ మూకలు పోలీసులపై ఎలా దాడులకు పాల్పడ్డాయో వీడియో ద్వారా చూపించారు. కొన్నిచోట్ల పోలీసులు బతిమాలుతున్నా వినిపించుకోకుండా, వాళ్ల లాఠీలు లాక్కుని పోలీసుల్నే కొట్టారని చెప్పారు. వాహనాలపైకి టపాకాయ బాంబులు వేయడంతోపాటు, పెట్రోల్ పోసి నిప్పంటించారని చెప్పారు. అసలు చంద్రబాబు నాయుడు ఇచ్చిన షెడ్యూల్ మేరకు పుంగనూరు పటణంలో ఆయన పర్యటనే లేదని, స్థానిక టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా బాబు ఉద్దేశ పూర్వకంగా ప్లాన్ చేసి గొడవలు సృష్టించారన్నారు. బాబును పుంగనూరులోకి అనుమతించాలని పార్టీ శ్రేణులను రెచ్చగొట్టి పోలీసులపై దాడులు చేయించారని చెప్పారు. ప్రజల ప్రాణ, మాన, ఆస్తులను కాపాడడమే లక్ష్యంగా పోలీసులు ధైర్యంగా నిలబడి అల్లరి మూకలు పుంగనూరులోకి ప్రవేశించకుండా అడ్డుగా నిలబడ్డారని తెలిపారు. దెబ్బలు తగిలి రక్తం కారుతున్న వేళ, పోలీసుల వద్ద ఆయుధాలు ఉన్నప్పటికీ సంయమనం పాటించారన్నారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పోలీసులు విధులు నిర్వర్తించి ధైర్య సాహసాలు ప్రదర్శించారని ప్రశంసించారు. ఈ దాడుల్లో పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా బాబు కీలక పాత్రధారిగా కేసు నమోదు చేశామన్నారు. విధుల్లో ఉన్న పోలీసులను చంపాలని చూడడం, పోలీసు వాహనాలు ధ్వంసం చేయడం తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని చెప్పారు. ప్రస్తుతం 40 మందిని అరెస్టు చేశామని, మరికొందరిని అరెస్టు చేయాల్సి ఉందన్నారు.

'ఈనాడు' నైజం బట్టబయలు

వైఎస్సార్‌సీపీ నాయకుడికి టీడీపీ ముసుగేసిన వైనం



కురబలకోట: చంద్రబాబు రెచ్చగొట్టే వ్యాఖ్యలతో చోటుచేసుకున్న గొడవలో శుక్రవారం కురబలకోట మండలంలోని అంగళ్లుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు అర్జున్‌రెడ్డి టీడీపీ దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు. అయితే శనివారం ఈనాడు దినపత్రిక పతాక శీర్షికలో అర్జున్ రెడ్డిని టీడీపీ కార్యకర్తగా పేర్కొంటూ ఫొటో ప్రచురించింది. రక్తమోడుతున్న టీడీపీ కార్యకర్త అని ప్రచారం చేసింది. దాడిలో దెబ్బలు తిన్నది వైఎస్సార్‌సీపీ నాయకుడైతే నిస్సిగ్గుగా టీడీపీ కార్యకర్త అని దుష్ప్రచారం చేయడం ఈనాడు రామోజీకే చెల్లిందని అంగళ్లు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై బాధితుడు అర్జున్ రెడ్డి మాట్లాడుతూ తనను టీడీపీ కార్యకర్తగా ప్రచురించడం ఈనాడు తన 'పచ్చ'పాతాన్ని చాటుకుందన్నారు. తాను తొలి నుండి వైఎస్సార్‌సీపీ వీరాభిమానినన్నారు. కాగా, శనివారం అర్జున్‌రెడ్డిని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు.

కఠిన చర్యలు తప్పవు: డీజీపీ

సాక్షి, అమరావతి: పుంగనూరు ఘటనపై విచారణకు ఆదేశించామని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన వారందరిపై కఠిన చర్యలు తప్పవని డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి హెచ్చరించారు. ఘటన పూర్వాపరాలపై విచారణ జరపాలని డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ రిషాంత్‌లను ఆదేశించామన్నారు. ఈ విషయమై శనివారం ఆయన సాక్షితో మాట్లాడుతూ.. చంద్రబాబు పర్యటన సందర్భంగా టీడీపీ కార్యకర్తలు చేసిన దాడిలో పోలీసులు తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. అక్కడ వాహనాలను సైతం టీడీపీ కార్యకర్తలు ఉద్దేశపూర్వకంగా తగులబెట్టారని చెప్పారు. రాళ్లు రువ్విన, నిప్పు పెట్టిన వారందరినీ గుర్తించామన్నారు. ఘటన స్థలిలో సీసీ కెమెరా ఫుటేజీలను విశ్లేషిస్తున్నామని, ఇప్పటికే పలువురిని గుర్తించామని.. మరికొందరు అనుమానితుల కదలికలపై నిఘా పెట్టామని తెలిపారు. చంద్రబాబు రూట్ ప్లాన్ మార్పు వ్యవహారం కూడా విచారణలో తేలుతుందన్నారు. చంద్రబాబు చేసిన రెచ్చగొట్టే ప్రసంగాలపై కూడా దృష్టి పెట్టామని చెప్పారు. శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే సహించేది లేదని పునరుద్ఘాటించారు.

అవరోధాలను అధిగమించి..

- ఇండో–నేపాల్ ఖోఖోలో మెరిసిన సంగీత
- కొరిటికల్ క్రీడాకారిణికి బంగారు పతకం
- ఆర్థిక సాయం అందించి అండగా నిలిచిన గ్రామస్తులు



బంగారు పతకంతో సంగీత

మామడ: చిన్నప్పటి నుంచి క్రీడలు అంటే ఆమెకు ఎంతో ఇష్టం. ప్రతిభ ఉన్నా అవకాశాలు రాలేదు. పేదరికం అడ్డుపడినా నిరుత్సాహపడలేదు. కష్టాలను అధిగమించి, ఆత్మస్థైర్యంతో ముందుకు సాగింది. పాఠశాల, కళాశాలస్థాయి నుంచి సంగీత క్రీడల్లో రాణిస్తుంది. అందివచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుంటోంది. ఈ క్రమంలో జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొనే అవకాశం వచ్చిందని తెలుసుకుని గ్రామస్తులు, స్వచ్ఛంద సంస్థలు మేమున్నామని ఆర్థికసాయం అందిస్తూ అండగా నిలుస్తున్నారు. తన ప్రతిభ, గ్రామస్తుల ప్రోత్సాహంతో అంతర్జాతీయో పోటీల్లోనూ సత్తా చాటుతోంది కొరిటికల్ గ్రామానికిచెందిన పల్లికొండ సంగీత. తాజాగా ఇండో–నేపాల్ ఖోఖో పోటీల్లో సత్తా చాటి బంగారు పతకం సాధించింది.

ప్రతిభ కనబర్చి... పతకం సాధించి...

పల్లికొండ చిన్నయ్యపద్మ దంపతులకు ముగ్గురు కూతుళ్లు. రెండో కూతురు పల్లికొండ సంగీత స్థానిక జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో పదో తరగతి వరకు చదివి, ఇంటర్‌మీడిమెట్‌ను మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పూర్తి చేసింది. సంగీత తండ్రి చిన్నయ్య మృతి చెందగా తల్లి పద్మ కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుంది. కూ తురుకు క్రీడలంటే ఆసక్తి ఉందని గమనించి ప్రొత్సాహించింది. సంగీత క్రీడలపై ఉన్న ఆసక్తితో వ్యా యమ విద్యను ఇటీవల పూర్తి చేసింది. ఈ ఏడాది నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్ పట్టణంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభను కనబర్చి జాతీయ జట్టుకు ఎంపికైంది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో నిర్వహించిన జాతీయ ఖోఖో పోటీల్లో రాష్ట్రం తరఫున పాల్గొని ప్రతిభ కనబర్చి జాతీయ జట్టుకు ఎంపికై ంది. శుక్రవారం నేపాల్‌లోని పోక్రాలో ఇండియన్ పసిఫిక్ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఇండో–నేపాల్ అంతర్జాతీయ ఖోఖో తుదిపోరులో నేపాల్‌పై మహిళల విభాగంలో విజయం సాధించింది. ఈ పోటీల్లో సంగీత ప్రతిభ కనబర్చి జట్టు గెలుపులో కీలక పాత్రను పోషించింది.

అండగా నిలిచిన గ్రామస్తులు..

సంగీతకు చదువుతోపాటు క్రీడల్లో ప్రతిభ ఉన్నప్పటికి పేదరికం అడ్డురావడంతో జాతీయ, అంతర్జాతీయ పోటీలకు వెళ్లడం ఇబ్బందిగా మారింది. దీంతో జిల్లా, రాష్ట్ర స్థాయిలో సంగీత కనబర్చిన ప్రతిభను గమనించి ఆర్థికసాయం అందించేందుకు పలువురు ముందుకు వచ్చారు. సంగీత అంతర్జాతీయ ఖోఖో పోటీలకు వెళ్లేందుకు చేయుతనందించాలని గ్రామస్తుల వాట్సప్ గ్రూపులో పోస్టు చేయగా పలువురు స్పందించి రూ.50 వేల ఆర్థికసాయం చేశారు. గ్రామీణ సపోర్ట్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ రూ.10 వేలు ఆర్థిక సాయం అందించింది. వారి సహకారంతో నేపాల్ వెళ్లిన సంగీత అంతర్జాతీయ వేదికపై మెరిసింది. బంగారు పతకం గెలుచుకుంది.

సంతోషంగా ఉంది

అంతర్జాతీయ ఖోఖో పోటీల్లో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించడం ఆనందంగా ఉంది. ఈ పోటీల్లో పాల్గొనే అవకాశం వచ్చినా ఆర్థిక కారణాలతో పోటీల్లో పాల్గొనలేనని అనుకున్నా. ఖోఖోలో మెలకువలు నేర్పించిన కోచ్‌కు, ఆర్థికసాయం అందించిన గ్రామస్తులు, గ్రామీణ సపోర్ట్ ఫౌండేషన్ సహకారంతో అంతర్జాతీయ పోటీల్లో రానించాను.

– సంగీత,ఖోఖో క్రీడాకారిణి, కొరిటికల్

అయోమయంలో హెచ్‌బీటీలు

- బదిలీలు జరిగితే పరిస్థితిపై ఆందోళన
- మార్గం చూపాలని వేడుకోలు

కాసిపేట(బెల్లంపల్లి): మోడల్ స్కూళ్లలో రెగ్యులర్ ఉపాధ్యాయులు లేక హెచ్‌బీటీ(హావర్లీ బేస్డ్ టీచర్లు)లతో బోధన సాగుతోంది. ప్రస్తుతం ఉపాధ్యాయుల బదిలీలు జరిగితే పరిస్థితి ఏమిటనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. మోడల్‌స్కూళ్లలో బోధనకు రెగ్యులర్ సిబ్బంది నియామకాలు లేకపోవడంతో ప్రభుత్వం హెచ్‌బీటీలను నియమించింది. ప్రతీ విద్యాసంవత్సరం వీరిని రీ ఎంగేజ్ చేయడమో కొత్త వారిని తీసుకోవడమో చేస్తోంది. ఈ సంవత్సరం సైతం వీరిని నియమించగా విద్యాసంవత్సరం ప్రారంభంలో కావాల్సిన బదిలీలు కోర్టు తీర్పుల నేపథ్యంలో సందిగ్ధంలో పడ్డాయి. ప్రస్తుతం ఈ నెల 8న హైకోర్టు ప్రకటన చేయనుండడంతో బదిలీలు జరిగితే తమ పరిస్థితి ఏంటని, విద్యాసంవత్సరం రెండు నెలలు గడిచిన తర్వాత ఎవరు తీసుకుంటారని అయోమయానికి గురవుతున్నారు. హెచ్‌బీటీలకు పీరియడ్‌కు రూ.182 చొప్పున నెలకు 100గంటలకు రూ.18,200 గౌరవ వేతనం చెల్లిస్తున్నారు. సిబ్బంది సమస్యతో ప్రతీ ఉపాధ్యాయుడు అదనంగా బోధించినా వేతనం మాత్రం అంతే వస్తుంది.

రాష్ట్రంలో 16 పాఠశాలలు

రాష్ట్రంలో మొత్తం 16పాఠశాలలు రెగ్యులర్ ఉపాధ్యాయులు లేకపోవడంతో పూర్తిస్థాయిలో హెచ్‌బీటీలతో నడుస్తున్నాయి. మంచిర్యాల జిల్లాలో మంచిర్యాల, కోటపల్లి, కాసిపేట, ఆదిలాబాద్ జిల్లాలో బోథ్, గుడిహత్నూర్, నార్నూర్, కుమురంభీం జిల్లాలో సిర్పూర్(యూ), జగిత్యాలలో మేడిపల్లి, కొడిమ్యాల, వికారాబాద్ జిల్లాలో బషీరాబాద్, పెద్దమూల్, జాఫర్‌పల్లి(పరిగి), తాండూర్, నిజామాబాద్ జిల్లాలో వేంపల్లి, రంగారెడ్డిలో మహేశ్వరం, శంకర్‌పల్లి మాడల్‌స్కూల్‌లు హెబీటీలతో కొనసాగుతున్నాయి. బదిలీలు జరిగితే వీరి స్థానాల్లో రెగ్యులర్ ఉపాధ్యాయులు చేరుతారు. హెచ్‌బీటీల పరిస్థితి ఎటూ కాకుండా పోతుంది. రాష్ట్ర వ్యాప్తంగా 1,236మంది హెచ్‌బీటీలు పనిచేస్తుండగా వీరితో నడుస్తున్న 16పాఠశాలల్లో 320మంది పనిచేస్తున్నారు.

మరిన్ని స్కూళ్లకు కష్టాలు

బదిలీల్లో హెచ్‌బీటీల పరిస్థితి అయోమయంగా మారనుండగా ఉపాధ్యాయులు లేని మోడల్‌స్కూళ్ల సంఖ్య మరింత పెరగనుంది. మొత్తం 194మోడల్ స్కూళ్లకు గాను 4,074మంది ఉపాధ్యాయులు అవసరం కాగా సుమారు 3,700మంది ఉన్నారు. మిగతా హెచ్‌బీటీలతో కాలం వెల్లదీస్తున్నారు. ఈ క్రమంలో బదిలీలు జరిగితే జిల్లాల వారీగా కేటాయింపులు కాకుండా జోనల్ వారీగా చేపట్టనుండంతో కౌన్సెలింగ్‌లో అందుబాటులో ఉన్న స్కూళ్లను ఉపాధ్యాయులు కోరుకుంటారు. ఈ క్రమంలో మళ్లీ ఖాళీ అయ్యే పాఠశాలల సంఖ్య సుమారు 35కు చేరుకోనుంది. ఈ పాఠశాలల్లో నూతనంగా హెచ్‌బీటీలను నియమించనుండగా ప్రస్తుతం పని చేస్తున్న హెచ్‌బీటీల ఉపాధి మాత్రం పోనుంది. దీంతో చేసేదేమీ లేక దిక్కుతోచని స్థితిలో హెచ్‌బీటీలు ఉన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభంలో బదిలీలు చేపడితే ప్రైవేట్ కాలేజీలు, పాఠశాలల్లో మార్గాలు చూసుకునే వారమని, ప్రస్తుతం అభద్రతాభావంతో కాలం వెల్లదీస్తున్నామని వాపోతున్నారు. బదిలీలు తప్పవని, విద్యాసంవత్సరం ప్రారంభం, ముగింపులో చేపడితే తాము ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకునే అవకాశం ఉంటుందని, ప్రభుత్వం, ఉన్నాతాధికారులు తమకు అన్యాయం చేయకుండా మార్గం చూపాలని కోరుతున్నారు.

ఐక్యతతోనే గౌడ సామాజికవర్గం అభివృద్ధి

- గీతవృత్తిని కాపాడుకునే బాధ్యత మనందరిది
- పాపన్న ఆశయ సాధనకు కృషి చేయాలి
- రాష్ట్ర గీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్



మాట్లాడుతున్న గీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్

సిరిసిల్లఅర్బన్: ఐక్యతగా ఉంటేనే గౌడ సామాజికవర్గం అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర గీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్ పేర్కొన్నారు. సిరిసిల్లలోని లహరి ఫంక్షన్‌హాల్‌లో శనివారం నిర్వహించిన గౌడ ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. తెలంగాణ వీరత్వానికి సర్వాయి పాపన్నగౌడ్ ప్రతీక అన్నారు. గౌడ కులస్తులు ఐక్యంగా ఉన్నప్పుడే రాజకీయ, ఆర్థిక, సామాజికంగా అభివృద్ధి చెందుతామన్నారు. గౌడ కులానికి పునాదిరాయి అయిన గీతవృత్తి ప్రమాదంలో పడకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గీతవృత్తికి ఆధునిక సొబగులు తెచ్చిందన్నారు. కల్లు గీత వృత్తిని ప్రోత్సహించేందుకు నీరా పాలసీ అమలులోకి తెచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. త్వరలోనే గీతకార్మికులకు గీతన్న బీమా సౌకర్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. హరిత హారం కార్యక్రమంలో భాగంగా తాటి, ఈత వనాలను పెంచాలని కోరారు. అనంతరం తాటి చెట్టు ఎక్కుతూ ప్రమాదవశాత్తు గాయపడ్డ, మృతి చెందిన వారి కుటుంబాలకు పరిహారం చెక్కులు అందజేశారు. గౌడ హాస్టల్ చైర్మన్ మోతె చక్రవర్తిగౌడ్, తెలంగాణ రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌రావుగౌడ్, జిల్లా గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిదుగు గోవర్ధన్‌గౌడ్, ఉపాధ్యక్షుడు బొల్గం నాగరాజుగౌడ్, బండి దేవదాస్‌గౌడ్, గోపా అధ్యక్షుడు అమరేందర్‌గౌడ్, కౌన్సిలర్ జాగీరు శైలు, కోఆప్షన్ సభ్యుడు బాలయ్యగౌడ్, గౌడ సంఘం పెద్దలు పుల్లి లక్ష్మీపతిగౌడ్, కోడూరి భాస్కర్‌గౌడ్, కొండ రమేశ్‌గౌడ్, నర్సయ్యగౌడ్, నర్సాగౌడ్, సంతోష్‌గౌడ్ పాల్గొన్నారు.


బంగారం, వెండి పోగులతో పట్టుచీర

- 20 గ్రాముల బంగారం, 20 గ్రాముల వెండితో చీర ఉత్పత్తి
- సిరిసిల్ల నేత కళాకారుడు నల్ల విజయ్‌కుమార్ అద్భుత సృష్టి
- హైదరాబాద్ వ్యాపారవేత్త కూతురు పెళ్లికి సిరిసిల్ల చీర



బంగారం, వెండిపోగులతో నేసిన చీర

సిరిసిల్ల: సిరిసిల్ల నేతకళాకారుడు నల్ల విజయ్‌కుమార్ మరో అద్భుతమైన పట్టుచీరను నేశాడు. మగ్గంపై బంగారు, వెండి నూలు పోగులతో అరుదైన చీరను శనివారం ఆవిష్కరించారు. సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన నల్ల విజయ్‌కుమార్ 20 గ్రాముల బంగారం, మరో 20 గ్రాముల వెండితో పట్టుపోగులతో అద్భుతమైన చీరను నేశాడు. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యాపారవేత్త తన కూతురు పెళ్లి కోసం ప్రత్యేకంగా ఆర్డర్ ఇచ్చి చీరను నేయించారు. బంగారం, వెండి వర్ణంతో మెరిసిపోతున్న ఈ చీర 48 ఇంచుల వెడల్పు, ఐదున్నర మీటర్ల పొడవుతో 500 గ్రాముల బరువుతో ఉంది. నెల రోజుల పాటు బంగారు నూలు పోగులను, వెండి నూలు పోగులను తయారు చేయించి, పట్టుదారం పోగులతో పాటే చీరలో ఒదిగిపోయేలా జకార్డు మగ్గంపై నేశాడు. రూ.1.80 లక్షల ఖర్చుతో నెల రోజుల పాటు శ్రమించి ఈ చీరను నేశాడు. బంగారం, వెండి పోగులతో పొదిగిన చీరను హైదరాబాద్ వ్యాపారికి పంపిస్తున్నట్లు విజయ్‌కుమార్ తెలిపారు. రూ.25 లక్షల విలువైన మరో చీరను 250 గ్రాముల బంగారం, 500 గ్రాముల వెండితో ప్రత్యేకంగా పట్టు చీరను తయారు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు విజయ్‌కుమార్ తెలిపారు. నిత్యప్రయోగాలతో ముందుకు సాగుతున్న నేత కళాకారుడిని స్థానికులు అభినందించారు.



బంగారు పోగుల నూలు





చీర నేసిన జకార్డు మగ్గం ఇదే..

మణిపూర్‌ది దేశం తలదించుకునే సంఘటన

- అరుణోదయ సాంస్కృతిక సమైక్య అధ్యక్షురాలు విమలక్క



మాట్లాడుతున్న విమలక్క

విద్యానగర్(కరీంనగర్): మణిపూర్ సంఘటన దేశం తలదించుకునేలా చేసిందని అరుణోదయ సాంస్కృతిక సమైక్య అధ్యక్షురాలు విమలక్క ఆవేదన వ్యక్తం చేశారు. మణిపూర్ కుకి మహిళలపై జరుగుతున్న అకృత్యాలను నిరసిస్తూ శనివారం కరీంనగర్‌లోని తెలంగాణచౌక్ నుంచి ప్రెస్‌భవన్ వరకు శాంతిర్యాలీ నిర్వహించిన అనంతరం మహాసభలో మాట్లాడారు. మణిపూర్‌లో రెండు తెగల మధ్య ఏర్పడిన సమస్యను పరిష్కరించాల్సిన ప్రభుత్వమే చిచ్చుపెడుతుందని ఆరోపించారు. మణిపూర్ రాష్ట్రంలోని ప్రకృతి సంపదను బహుళజాతి కంపెనీలకు కట్టబెట్టేందుకు జరుగుతున్న కుట్రలో భాగమే ఆదివాసీలపై దాడులు అని పేర్కొన్నారు. అడవుల్లో క్రూరమృగాలతో సహజీవనం చేస్తున్న గిరిజనులు మానవమృగాలతో బతకలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగబద్ధమైన హక్కులను కాపాడుకునేందుకు ప్రతీ ఒక్కరు ముందుకు రావాలని కోరారు. ఈనెల 6 నుంచి 26 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి చోట నిరసన నిర్వహించాలని కోరారు. మణిపూర్ కుకి మహిళలపై అకృత్యాల వ్యతిరేక కమిటీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా కన్వీనర్ లుక్క సౌమ్య, వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కె.నగేష్, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి జోజిరెడ్డి, డీసీసీ జిల్లా అధ్యక్షుడు కవ్వంపెల్లి సత్యనారాయణ, సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, ఏఏపీ యూత్ రాష్ట్ర అధ్యక్షుడు రణధీర్‌సింగ్‌రాణా, బీసీ సంఘాల ప్రతినిధి బిజిగిరి నవీన్‌కుమార్ పాల్గొన్నారు.





ఆ నలుగురు స్నేహితులు

ఇంగ్లీష్ సింగర్, సాంగ్ రైటర్, మ్యూజిషియన్, పీస్ యాక్టివిస్ట్ జాన్ లెనన్ తన 'ఇమేజిన్' పాటలో ఏం అంటాడు?

నీ తల మీద ఆకాశం తప్ప, స్వర్గనరకాలు, మతాలు, కులాలు, సరిహద్దు ద్వేషాలు లేని ఒక కొత్త ప్రపంచం, ఆస్తులు, అంతస్తుల తేడా లేని సరికొత్త సమాజాన్ని ఊహించుకో అంటాడు.

'ఐయామ్ ఏ డ్రీమర్ బట్ ఐయామ్ నాట్ ది వోన్లీ వన్' అని కూడా అంటాడు.

ప్రపంచంలో ఎంతోమందిలాగే ఈ పాటతో ప్రభావితమైన వాళ్లలో బెంగళూరుకు చెందిన నలుగురు స్నేహితులు ఉన్నారు. మెలిషా, వినోద్ లోబో, నితిన్ కుమార్, విగ్నేష్‌లు 'ఇమేజిన్' సాంగ్ స్ఫూర్తితో 'ఇమేజిన్ ట్రస్ట్' ప్రారంభించారు. సేవాకార్యక్రమాలకు సంబంధించి తొలి దశలో భాగంగా 'క్లాత్ బ్యాంక్'కు శ్రీకారం చుట్టారు. దాతల నుంచి సేకరించిన ఈ దుస్తులను పేదలు రూపాయి ఇచ్చి కొనవచ్చు.

friends forever

ఫ్రెండూ... ఇదొక ట్రెండు!

'స్నేహంలో విభేదాలు ఉండవు' అని అనుకోవడానికి లేదు. ఎన్నో కారణాల వల్ల ఫ్రెండ్‌షిప్ బ్రేక్‌డౌన్ కావచ్చు. మళ్లీ కలుసుకోవాలని, మునపటిలా హాయిగా మాట్లాడుకోవాలని ఉన్నా ఏవో ఇగోలు అడ్డుపడుతుంటాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని పాశ్చాత్య దేశాల్లో 'ఇన్విజిబిలియా: థెరపీ విత్ ఫ్రెండ్స్' అనే ట్రెండ్ మొదలైంది. అనగా ఒక సైకాలజిస్ట్ విడిపోయిన ఇద్దరు స్నేహితులను ఒక దగ్గర కూర్చోబెట్టుకొని ఒకటి లేదా రెండు మూడు రోజుల సెషన్‌లతో వారి స్నేహాన్ని తిరిగి పట్టాలెక్కిస్తారు.

'ఇదంతా ఎందుకు?' అనుకునేవారు దూరం అయిన ఫ్రెండ్‌కు 'సారీ రా' అని మెసేజ్ పెట్టి చూడండి చాలు...'సారీ'కి ఉండే పవర్ ఏమిటో మీకే తెలుస్తుంది!



వన్స్‌మోర్ ఫ్రెండ్‌షిప్ డైలాగ్‌లు

'నిజమైన స్నేహితులు కన్నీటి చుక్కల్లాంటి వారు. మనసు బాధగా ఉన్నప్పుడు చప్పున బయటికి వస్తారు'
'స్నేహంతో పని జరిగినప్పుడు, శత్రుత్వంతో పని ఎందుకు!'
– వన్స్ అపాన్ ఏ టైమ్ ఇన్ ముంబై సినిమా

నిజమైన స్నేహితుడు, స్నేహితుడి తప్పులను తన తప్పులుగా భావించి క్షమిస్తాడు.
– ఏ రస్తే ప్యార్ కే


స్నేహం అనేది ఎలా బతకాలో మాత్రమే కాదు ఎలా చావకూడదో నేర్పుతుంది.
– ఏబీసీడీ–ఎనీబడి కెన్ డ్యాన్స్

స్నేహితుడు చనిపోవచ్చు, స్నేహం చనిపోదు.
– ఎల్‌వోసీ కార్గిల్

స్నేహితులు ఉన్న వారే అసలైన సంపన్నులు
– రంగ్ దే బసంతీ

స్నేహంలోని ఒక నియమం...
నో సారీ...
నో థ్యాంక్!
– కుచ్ కుచ్ హోతా హై

కాలాతీత స్నేహ గీతం



స్నేహితుల దినోత్సవం సందర్భంగా అంతర్జాలంలో అలనాటి సినిమా 'దోస్తీ' (1964) తప్పనిసరిగా ప్రస్తావనకు వస్తుంది. సత్యన్‌బోస్ దర్శకత్వం వహించిన ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర సూపర్ హిట్ కొట్టింది. 'బెస్ట్ ఫిల్మ్'తో సహా ఆరు ఫిల్మ్‌ఫేర్ అవార్డ్‌లు గెలుచుకుంది.

ఒక యాక్సిడెంట్‌లో కాలు కోల్పోయిన రాము, కంటి చూపు లేని మోహన్ అనే ఇద్దరు కుర్రాళ్ల మధ్య స్నేహానికి అద్దం పట్టే చిత్రం ఇది. ఈ ఇద్దరు స్నేహితులకు పాట స్నేహితురాలు. అన్నదాత. ఎన్నో కష్టాలు, ప్రలోభాలు ఎదురైనా వారి స్నేహప్రపంచం చెక్కు చెదరదు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా చూడాల్సిన సినిమాలలో ఇదొకటి.

వైరల్

ఔరా అమ్మకచెల్ల... భాంగ్రా స్టెప్పులు వేయడం ఇల్లా!



'ఆఫీసులో ఉద్యోగులు ఏం చేస్తారు?' అనే ప్రశ్నకు...

'ఆఫీసు వర్క్ చేస్తారు' అని మాత్రమే ఊరుకోనక్కర్లేదు. 'భాంగ్రా డ్యాన్స్ కూడా చేస్తారు' అని భేషుగ్గా చెప్పవచ్చు. ఎందుకంటే ఇదిప్పుడు ఒక ట్రెండ్‌గా మారనుంది. విషయంలోకి వస్తే... డల్ వర్క్‌డేకు ఒక కార్పొరేట్ కంపెనీ ఫన్ ట్విస్ట్ ఇచ్చింది.

'పనిచేసింది చాలు. ఇప్పుడిక భాంగ్రా నేర్చుకోండి' అంటూ ఫిజికల్ ఇన్‌స్ట్రక్టర్, డ్యాన్సర్ సాహిల్‌శర్మను ఆఫీసుకు తీసుకువచ్చింది.

'లెట్స్ డ్యాన్స్' అంటూ శర్మ భాంగ్రా స్టెప్పులు స్టార్ట్ చేయడంతో ఉద్యోగులు ఎవరి డెస్కుల దగ్గర వారు అతడిని అనుసరించి డ్యాన్స్ చేయడం మొదలు పెట్టారు.

'ఐ వాంట్ యాన్ ఆఫీస్ లైక్ దిస్' కాప్షన్‌తో పోస్ట్ చేసిన ఈ వీడియో 2.9 మిలియన్‌ల వ్యూస్ సొంతం చేసుకుంది.

'గుడ్ ఐడియా. 9 టు 5 జాబ్ వల్ల ఉద్యోగులు ఫిజికల్ యాక్టివిటీకి దూరం అవుతున్నారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల వ్యాయామం చేసినట్లుగా ఉంటుంది. హుషారు వస్తుంది' అని ఒక యూజర్ స్పందించాడు.

దోసే వారు ఎవరురా!



మనసు దోచే దోసె గురించి ఎంత చెప్పినా తక్కువే. దోసె ప్రియుల కోసం సరికొత్త 'ఫుడ్ చాలెంజ్' ముందుకు వచ్చింది. 'ఆరడుగుల పొడవు ఉన్న దోసెను ఒక్క సిట్టింగ్‌లో తినగలరా?' అనే సవాలు విసురుతుంది ఈ ఫుడ్ చాలెంజ్. విజేత పాట్లశ్రమ వృథా పోదు. పదకొండు వేల రూపాయలను నగదు బహుమతిగా ఇస్తారు.

పాపులర్ బ్లాగర్స్ వాణి, సావిలు 'సమ్‌వన్ హు కెన్ ఫినిష్ దిస్?' ట్యాగ్‌తో పోస్ట్ చేసిన 'ఫుడ్ చాలెంజ్' 5.7 మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది.

ఢిల్లీలోని పాపులర్ రెస్టారెంట్ 'దోసె ఫ్యాక్టరీ'లో ఈ ఆరు అడుగుల దోసెను తయారు చేయడంతోపాటు షూట్ చేశారు. మూడు రకాల మసాలాలు, నెయ్యితో తయారు చేసిన ఈ మెగా దోసెకు సాంబార్, చట్నీ, రవ్వ కేసరి కాంబినేషన్‌లుగా ఉంటాయి.

'టైమ్ లిమిట్ లేకపోతే ఈజీగా లాగించవచ్చు' అని కొందరు నెటిజనులు స్పందించారు.

ఖాకీ కిచెన్

కాసేపు లాఠీని పక్కనపెట్టి గరిటను పట్టుకుందాం అనుకుని కేరళలోని ఒక పోలీస్ స్టేషన్ వారు ఈ వానల్లో వేడివేడిగా వంట చేశారు. వీడియో కూడా తీశారు. వాళ్లు లొట్టలేసుకు తింటుంటే నెటిజన్లు 'ఈ మాత్రం కళాపోషణ' ఉండాలి అని మెచ్చుకున్నారు. కాని పోలీసు బాసులు మాత్రం వేరొకటి తలచారు. ఏమా వంట? ఏమా వైరల్?

ఆ పోలీసులు ఇంట్లో వంట చేసుకుని ఉంటే బాగుండు. కాని వానాకాలంలో వేడివేడిగా ఏదైనా తినాలనిపించిందో ఏమో, కొంచెం బోర్‌ను బ్రేక్ చేద్దాం అనుకున్నారో ఏమో ఏకంగా స్టేషన్‌లోనే వంట చేశారు. ఆ చేయడం వీడియోలో షూట్ చేసి ఇన్‌స్టాలో పెట్టారు. చూసిన జనం ఈ మాత్రం సర్దా ఉండాల్లే అని ముచ్చట పడితే పోలీసు బాసులు మాత్రం కయ్యిమన్నారు. అసలేం జరిగిందంటే కేరళలోని ఇలవుంతిట్ట అనే స్టేషన్‌లో పోలీసులు వంట చేసుకు తిన్నారు. చికెన్‌ని తేవడం, ముక్కలు కొట్టించడం, కూర చేయడం, మటన్ కూర, దాంతో పాటు చిలగడదుంపల సంగటి కెమెరా ముందు అద్భుతంగా వండారు. పెద్ద పెద్ద అరిటాకులు తెచ్చి స్టేషన్ ఎస్.ఐతో పాటు అందరూ ఆరగించారు. దానికి మంచి పాట జత చేశారు. వీడియో సోషల్ మీడియాలో వదిలారు. ఇంకేముంది... జనం రకరకాల సరదా కామెంట్‌లు చేశారు. 'అప్పుడప్పుడు తినండోయ్... ఎప్పుడూ డ్యూటీయేనా' అన్నారు. కాని ఈ వీడియో పోలీస్ బాస్‌ల కంట పడింది. ఆ ఏరియా ఐ.జి 'ఈ విధంగా డ్యూటీలో వండుకు తినడం ఏ విధంగా విధులకు భంగకరం కాదో' వివరణ ఇమ్మని ఆదేశించాడు. మరి ఐ.జి గారికి ఎక్స్‌ప్లనేషనే పంపుతారో ఇంకో కూర వండి కూల్ చేస్తారో తెలియదు.





హెల్త్

పాదాల వాపు... పలు కారణాలు... పరిష్కారాలు!

సాధారణంగా ఏ బస్సులోనో చాలాసేపు కూర్చుని ప్రయాణం చేశాక... పాదాల్లో వాపురావడం చాలామందిలో కనిపించేదే. ఇది నిరపాయకరమైన వాపు. కానీ కొన్నిసార్లు అలా ఏ కారణం చేత ఆ వాపు వచ్చిందో తెలుసుకోడానికి డాక్టర్‌ను సంప్రదించాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే ఈ వాపు కొన్నిసార్లు ప్రమాదకరం కావచ్చు. అప్రమత్తంగా ఉండాల్సి రావచ్చు. పాదాలవాపు కనిపించినప్పుడు ఏయే అంశాలపై దృష్టిపెట్టాలన్న అవగాహన కోసమే ఈ కథనం.



కాళ్లలో/పాదాల్లో వాపు కనిపించడాన్ని 'ఎడిమా' అంటారు. దీనికి చాలా కారణాలు ఉంటాయి. ముఖ్యంగా సెల్యులైటిస్, డీవీటీ థ్రాంబోసిస్ అనే కండిషన్లతో పాటు హార్ట్ ఫెయిల్యూర్, కిడ్నీ ఫెయిల్యూర్, లివర్ ఫెయిల్యూర్... ఈ మూడు కీలక అవయవాల పనితీరు తగ్గడం వల్ల ఇలా జరిగిందేమో చూడాలి. హైపోథైరాయిడిజమ్ వల్ల కూడా ఇలా జరగవచ్చు. దాంతోపాటు కొన్ని మందుల వాడకంతో పాటు, అసలు ఏ కారణమూ తెలియకుండా కూడా పాదాల్లో వాపు రావచ్చు.

కిడ్నీ ఫెయిల్యూర్ వల్ల...

కిడ్నీ ఫెయిల్యూర్‌లో ముఖం మాత్రమే ఉబ్బుతుందని చాలామంది అనుకుంటారు. కానీ కాళ్లవాపూ కనిపిస్తుంది. ఇలాంటప్పుడు కిడ్నీ ఫెయిల్యూర్ నిర్ధారణకు రీనల్ ఫంక్షన్ టెస్ట్ అనే పరీక్ష చేయించి, దానికి అనుగుణంగా చికిత్స అందించాల్సి ఉంటుంది.

లివర్ ఫెయిల్యూర్ వల్ల...

కాలేయ వైఫల్యంలోనూ కాళ్ల వాపు కనిపిస్తుంది. దీని నిర్ధారణ కోసం 'లివర్ ఫంక్షన్ టెస్ట్ – ఎల్ఎఫ్‌టీ' పరీక్ష చేయించి, సమస్య నిర్ధారణ అయినప్పుడు దానికి అనుగుణంగా చికిత్స అందించాల్సి ఉంటుంది.

కాలి సిరల్లో లోపంతో...

కొన్నిసార్లు కాళ్లలోని సిరలు చక్కగా పనిచేయకపోవడం వల్ల రక్తంలోని నీరు అక్కడే ఉండిపోయి, పాదాల వాపు రూపంలో బయటపడుతుంది. ఎక్కువసేపు నిల్చుని పనిచేసే వృత్తుల్లో ఉన్నవారిలో, ఊబకాయం ఉన్నవారిలో ఈ సమస్య ఎక్కువ. పిక్కల్లో నొప్పి, కాళ్లు బరువుగా అనిపించడం, అటు తర్వాత క్రమంగా కాళ్లపైనా, మడమ లోపలి వైపున నల్లటి మచ్చలు, కొంత కాలానికి కాలి సిరలు ఉబ్బి మెలికలు తిరిగి ఉన్నట్లుగా చర్మంలోంచి బయటికి కనిపించడంతో పాటు, అవి పచ్చగా లేక నల్లగా కనిపిస్తే, అది 'వేరికోస్ వెయిన్స్' లేదా ''వీనస్ ఇన్‌సిఫిషియెన్సీ' అనే కండిషన్ కావచ్చు. తొలి దశలో సాయంత్రం మాత్రమే ఉండే కాళ్లవాపు ఆ తర్వాత రోజంతా ఉంటుంది ● ఇది కాకుండా సెల్యులైటిస్ అనే కండిషన్‌లోనూ కాళ్ల వాపు కనిపిస్తుంది. అంతే కాదు.. ఇలా వాపు వచ్చిన కారణంగా కాలు కాస్త మెరుపుతో కనిపిస్తుంది ● దీనితో పాటు కాలి సిరల్లో రక్తం గడ్డకట్టడం వల్లకనిపించే 'డీప్ వీన్ థ్రాంబోసిస్ – (డీవీటీ)' అనే కండిషన్‌లో కూడా కాలివాపు కనిపిస్తుంది ● ఈ కండిషన్స్ అన్నింటి నిర్ధారణ కోసం కాలి సిరలకు వీనస్ డాప్లర్ టెస్ట్ అనే పరీక్ష చేయించాలి.

జాగ్రత్తలు / ఫస్ట్‌లైన్ చికిత్స :

● చాలాసేపు నిలబడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి ● వాపు ఉన్న కాళ్లపై ఎలాస్టిక్ స్టాకింగ్స్ తొడగాలి. ఈ జాగ్రత్తలతో కాలి వాపును నివారించవచ్చు. స్టాకింగ్ సిరలకు అది మంచి సపోర్ట్ ఇవ్వడం వల్ల క్రమేణా రక్తం సజావుగా ప్రవహిస్తుంటుంది. ఈ దశలో నిర్లక్ష్యం చేసి, సమస్య ముదిరి 'వేరికోస్ వెయిన్స్'గా పరిణమిస్తే, కాళ్లకు పుండ్లు వంటి దుష్ప్రభావాలు (కాంప్లికేషన్లు) రావచ్చు. ఆయా కండిషన్లకు అనుగుణంగా రేడియాలజీ చికిత్స, శస్త్రచికిత్సలు అవసరం కావచ్చు.

ఊపిరితిత్తుల్లో రక్తపోటు పెరగడం...

ఊపిరితిత్తుల్లో రక్తపోటు పెరగడం వల్ల కూడా పాదాలకు వాపు వస్తుంది. ఊబకాయం ఉన్నవారిలో ఇది ఎక్కువ. ఈ కారణంగా సమస్య వస్తే... నిద్రలో పెద్దగా గురకపెట్టడం, నిద్రనుంచి అకస్మాత్తుగా లేవడం, నిద్రలో ఊపిరి తీసుకోవడం కష్టంగా మారడం కనిపిస్తాయి. వీరు తక్షణం డాక్టర్‌ను సంప్రదించాలి. లంగ్స్‌లో రక్తపోటు పెరగడాన్ని తెలుసుకోవడం కోసం డాక్టర్లు ఎకో పరీక్ష చేయిస్తారు. వయసు 40 దాటి, కాళ్ల వాపులు ఉన్నవారు ఒకసారి తప్పనిసరిగా ఎకో పరీక్ష చేయించడం మంచిది.

చికిత్స : ఊపిరితిత్తుల్లో రక్తపోటు కారణంగా వచ్చే స్లీప్ ఆప్నియాకు తప్పనిసరిగా చికిత్స చేయించాలి. దాంతో స్లీప్ ఆప్నియా సమస్య తగ్గి, కాళ్ల వాపూ తగ్గుతుంది.

గుండె పంపింగ్ తగ్గడం వల్ల...

గుండె పంపింగ్ సామర్థ్యం తగ్గినప్పుడు పాదాల వాపు కనిపిస్తుంది. ఒక్కోసారి రక్తపోటు పెరగడమూ జరుగుతుంది. గుండెజబ్బు కారణంగా రెండు కాళ్లలోనూ వాపు కనిపిస్తుంది. ముందుగా కాలి ముందు భాగంలోనూ... ఆ తర్వాత మడమ భాగంలో వాపు వస్తుంది. మొదట్లో నొప్పి ఉండదు. ఆయాసం, నడవలేకపోవడం జరగవచ్చు. ఈ లక్షణాలు కనిపిస్తే తక్షణం మెడికల్ స్పెషలిస్ట్ / గుండె వైద్య నిపుణులను కలవాలి. గుండెజబ్బు వల్లనే పాదాల వాపు వచ్చిందా అన్న విషయం తెలుసుకోవడం కోసం బీఎన్‌పీ అనే రక్తపరీక్ష చేయించి, ఈ విలువ 100 కంటే ఎక్కువగా ఉంటే గుండె సమస్య ఉందేమోనని అనుమానించాలి. అప్పుడు గుండె నిపుణుల ఆధ్వర్యంలో ఈసీజీ, ఎకోకార్డియోగ్రఫీ వంటి పరీక్షలు చేయించుకోవాలి.

చికిత్స : ఇది గుండెజబ్బు కారణంగానే జరిగితే డైయూరెటిక్స్ అనే మందులు వాడాల్సి ఉంటుంది. ఇవి మూత్రం రూపంలో దేహంలోంచి నీటిని బయటకు పంపిస్తాయి. అయితే గుండె జబ్బు ఉన్నప్పుడు మాత్రమే ఈ డైయూరెటిక్స్ వాడాలి, లేకపోతే అవి ప్రమాదకరంగా పరిణమించవచ్చు. అంతేకాదు... గుండెజబ్బు కాకుండా ఇతర కారణాల వల్ల కాలి వాపు వచ్చి ఉంటే... ఆ మూల కారణాన్ని కనుగొనే అవకాశం ఉండక, ఇతరత్రా సమస్యలు రావచ్చు.



డాక్టర్ జగదీశ్ కుమార్ .వి
సీనియర్ ఫిజీషియన్ అండ్ డయాబెటాలజిస్ట్

కారణం తెలియకుండా...


కొందరిలో, ముఖ్యంగా 40 ఏళ్ల మహిళల్లో కాళ్ల వాపుతో పాటు మరి కొందరిలో ముఖం, చేతులు కూడా ఉబ్బడం జరగవచ్చు. ఇలా ఎందుకు జరుగుతుందన్న కారణం కొన్నిసార్లు తక్షణం తెలియకపోవచ్చు. వీరికి అన్ని పరీక్షలూ చేసి... నిర్దిష్టంగా ఎలాంటి కారణం లేదని తెలుసుకున్న తర్వాత డైయూరెటిక్స్ వాడాలి. ఆహారంలో ఉప్పు తక్కువగా తీసుకోవాలనీ డాక్టర్లు సూచిస్తారు.

ఇవేగాక... ఇతర సమస్యల్లో కూడా...

ఇక్కడ పేర్కొన్న సమస్యలతో పాటు అనేక ఇతర సమస్యల వల్ల కూడా కాళ్ల/పాదాల వాపు రావచ్చు. కొన్ని ప్రోటీన్ల లోపం, మహిళల్లో కటి భాగంలో వచ్చే క్యాన్సర్లలో కూడా కాళ్ల వాపు రావచ్చు. కొందరు గర్భవతుల్లో కాలి సిరలు సామర్థ్యం తగ్గడం, కొన్నిసార్లు థైరాయిడ్ హార్మోన్ లోపించినప్పుడూ వాపు రావచ్చు. ఇలాంటి సందర్భాల్లో జనరల్ ఫిజీషియన్‌ను సంప్రదించి, తగిన పరీక్షలు చేయించడం, తదనుగుణంగా చికిత్సలు అవసరం.

రాడిక్యులోపతి అంటే...?

మెడలోని వెన్ను ఎముకలు అరిగి... అవి దగ్గరగా రావడంతో వెన్నుపూసల నుంచి వివిధ అవయవాలకు వచ్చే నరాలపై ఒత్తిడి పడుతుంటుంది. ఆ నొప్పిని 'స్పాండిలోసిస్' అంటారు. మొదట్లో అది స్పాండిలోసిస్ అని తెలియక నొప్పి నివారణ మందులు వాడుతుంటారు. కానీ అసలు సమస్య వల్ల కొద్ది రోజులు లేదా నెలల్లోనే నొప్పి మళ్లీ తిరగబెడుతుంది. మెడ నుంచి చేతి వరకూ పాకుతుంది. వేళ్లకు స్పర్శ తగ్గడం, తిమ్మిర్లలా అనిపిస్తుంది. అలాగే నడుము నుంచి కాళ్లలోకీ పాకవచ్చు. ఇలా ఈ నొప్పి చేతులూ, వేళ్లవరకూ పాకుతూ స్పర్శ కోల్పోయే పరిస్థితినీ, అలాగే నడుము నుంచి కాళ్లలోకి నొప్పి పాకడాన్ని ర్యాడిక్యులోపతిగా చెప్పవచ్చు.



రాడిక్యులోపతికి కారణాలు... చేతులు, కాళ్ల నొప్పుల రూపంలో ర్యాడిక్యులోపతి రెండు రకాలుగా వస్తుంది. మెడ దగ్గర సర్వైకల్ ఎముకల్లో నరాలు నలగడం వల్ల మెడ నుంచి చేతుల్లోకీ, అలాగే నడుము దగ్గర లంబార్ వెన్నుపూసల్లోంచి వచ్చే నరాలు నలగడం వల్ల నడుము నుంచి కాళ్లలోకీ నొప్పి పాకుతుంది. చేతి విషయానికి వస్తే... సమస్య స్టేజ్–1లో నొప్పి– భుజానికీ, చేతికీ పాకుతుంది. అదే స్టేజ్–2లో భుజం, చేయి ప్రభావితం కావడంతో పాటు చేతి వేళ్లకు స్పర్శ కొంతమేర తగ్గుతుంది. స్టేజ్–3కి చేరితే చేతి కండరాలు ఒకింత చచ్చుబడినట్లుగా కావచ్చు, వేళ్లు ముందులాగా చురుగ్గా కదిలించలేకపోవచ్చు. ఇక కాళ్ల విషయంలోనూ ఇలాంటి సమస్యలే వచ్చే అవకాశం ఉంది.

చికిత్స... డాక్టర్ సలహా మేరకు గాబాపెంటిన్ వంటి మాత్రలు నొప్పితీవ్రతను బట్టి రోజూ 2 – 3 వరకు తగిన మోతాదులో వాడాలి. అవసరాన్ని బట్టి అసెక్లోఫినాక్ వంటి నొప్పినివారణ మాత్రల్ని కూడా వాడాల్సి రావచ్చు. మందులతో పాటు కొన్ని జాగ్రత్తలు పాటించడమే ర్యాడిక్యులోపతి చికిత్సలో మరీ ముముఖ్యమైన అంశం.

జాగ్రత్తలు... ● పడుకునేటప్పుడు తలగడ కేవలం తల కింది వరకే కాకుండా, మెడకు సపోర్ట్ దొరికేలా భుజాల వరకూ ఉండేలా చూసుకోవాలి. ● తలగడ లేకపోతే బెడ్‌షీట్‌ను నాలుగు ఇంచుల ఎత్తుగా ఉండేలా మడత వేసి తల కింద; అలాగే దాని మీద ఓ టర్కీ టవల్‌ను రోల్ చేసినట్లుగా చుట్టి మెడకింద పెట్టుకోవాలి. ● ఈ సమస్య ఉన్నప్పుడు కొందరు చెబుతున్నట్లుగా తలగడ లేకుండా పడుకోవడం అన్నది సరికాదు. తలగడ ఉండటం వల్లనే తప్పనిసరిగా మెడకూ, భుజాలకు సపోర్ట్ ఉంటుంది ● నడుము దగ్గర వచ్చే నొప్పి నివారణకు ముందుకు ఒంగకపోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలి ● బరువైన వస్తువులు... అంటే నీళ్ల బకెట్లు, సూట్‌కేసులు, బ్రీఫ్‌కేసుల వంటివీ, అలాగే తలపైన మూటలు, గంపలు వంటి బరువైనవి ఎత్తుకోకూడదు.



డాక్టర్ సుధీర్ రెడ్డి
సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్

గర్భవతుల్లో ఛాతీలో మంట తగ్గడం ఎలా? మెడిటిప్



గర్భవతుల్లో గుండెల్లో లేదా ఛాతీలో మంటగా ఉండటం, తేన్పులు, అజీర్తి ఫీలింగ్... ఇవన్నీ చాలా సాధారణంగా కనిపించే సమస్యలు. అయితే స్త్రీ, పురుషులు అనే భేదం లేకుండా చాలామందిలో ఈ సమస్య కనిపించినప్పటికీ గర్భవతుల్లో... మరీ ముఖ్యంగా ఐదారు నెలల గర్భిణిగా ఉన్నప్పుడు ఈ లక్షణాలు ఎక్కువ.

కారణాలివి... గర్భవతుల్లో ప్లాసెంటా నుంచి ప్రోజెస్టెరాన్ హార్మోన్ ఉత్పత్తి అవుతుంటుంది. నెలలు నిండుతూ గర్భసంచిలో పిండం పెరుగుతున్న కొద్దీ... దానికి మరింతగా చోటు కల్పించడానికి గర్భసంచి కండరాలు వదులయ్యేలా చేయడం కోసం ప్రకృతి పరమైన ఏర్పాటిది. ఈ హార్మోన్ కేవలం గర్భసంచినే కాకుండా జీర్ణాశయం–అన్నవాహిక మధ్యన ఉండే 'లోవర్ ఈసోఫేజియల్ స్ఫింక్టర్'పైనా ప్రభావం చూపుతుంది. దాంతో ఆ స్ఫింక్టర్ వదులై, జీర్ణరసాలు పైకి ఎగజిమ్మడంతో గర్భవతుల్లో ఈ సమస్య కనిపిస్తుంది.

ఇవీ సూచనలు... ● ఆహారంలో కారం, మసాలాలూ, వేపుళ్లు పరిమితంగా తీసుకోవాలి. మజ్జిగ, పెరుగు వంటివి తీసుకోవాలి ● ఒకేసారి ఎక్కువ మోతాదుల్లో కాకుండా చిన్న చిన్న మోతాదుల్లో ఎక్కువసార్లు తినాలి ● భోజనం పూర్తికాగానే పడుకోకూడదు. కాసేపు అటూ ఇటూ తిరగాలి ● పడుకునే సమయంలో తలగడ పెట్టుకుని, తల కాస్త ఎత్తుగా ఉండేలా చూసుకోవాలి ● అప్పటికీ సమస్య తగ్గకపోతే డాక్టర్ల పర్యవేక్షణలో మాత్రమే యాంటాసిడ్స్ వాడాలి.

కార్తీక్ జోడీకి టైటిల్, రన్నరప్‌గా శ్రీవల్లి ద్వయం

కజకిస్తాన్‌లోని ఆస్తానలో జరిగిన ఐటీఎఫ్ ప్రపంచ టెన్నిస్ టూర్ ఫ్యూచర్స్ టోర్నీలో హైదరాబాద్ క్రీడాకారులు సత్తా చాటుకున్నారు. పురుషుల డబుల్స్ ఈవెంట్‌లో గంటా సాయికార్తీక్ రెడ్డి-సిద్ధాంత్ బంటియా జోడీ విజేతగా నిలిచింది. శనివారం జరిగిన ఫైనల్లో కార్తీక్-సిద్ధాంత్ జోడీ 7-5, 6-7 (13/15), 10-4తో గ్లింకా డానిల్-కార్ల్ కియుర్ సార్ (ఈస్తోనియా) జంటపై గెలుపొందింది. ఇక్కడే జరిగిన మహిళల ప్రెసిడెంట్ కప్ ఫైనల్లో మూడో సీడ్ భమిడిపాటి శ్రీవల్లి రష్మిక-వైదేహి చద్దారి జంట 7-6 (7/5), 3-6, 5-10తో టాప్‌సీడ్ ఎలికసేన- అరకవా (జపాన్) ద్వయం చేతిలో పోరాడి ఓడింది. దీంతో శ్రీవల్లి జోడీ రన్నరప్‌తో తృప్తిపడింది.



అదరహో అదితి... ఓహో ఓజస్

- ప్రపంచ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు రెండు స్వర్ణాలు
- విజేతలుగా నిలిచిన అదితి స్వామి, ఓజస్ ప్రవీణ్

అంతర్జాతీయ వేదికపై భారత ఆర్చర్లు అద్భుతం చేశారు...గతంలో ఎన్నడూ చూపించని ప్రదర్శనతో కొత్త చరిత్రను సృష్టించారు... గురి తప్పకుండా లక్ష్యం చేరిన బాణాలతో మన ఆర్చర్లు ప్రపంచ చాంపియన్లుగా నిలిచారు...అటు మహిళల విభాగంలో అదితి స్వామి, ఇటు పురుషుల విభాగంలో ప్రవీణ్ ఓజస్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణాలు సాధించి శిఖరాన నిలిచారు. ఈ మెగా ఈవెంట్ చరిత్రలో భారత్‌కు తొలి వ్యక్తిగత స్వర్ణం అందించి అదితి ఆనందం పంచిన కొద్ది సేపటికే ప్రవీణ్ కూడా పసిడి గెలవడంతో 'డబుల్ ధమాకా' మోగింది!



ఓజస్ ఆఖరి 3 బాణాలు



అదితి ఆఖరి 3 బాణాలు

"చాలా గర్వంగా ఉంది. 17 ఏళ్లకే ఈ ఘనత సాధించడం సంతోషంగా అనిపిస్తోంది. వరల్డ్ చాంపియన్‌షిప్‌లో 52 సెకన్ల మన జాతీయ గీతం వినపడాలని కోరుకున్నాను. పూర్తి ఏకాగ్రతతో షాట్‌పై దృష్టి పెట్టడంతో లక్ష్యం తప్పలేదు. ఇది ఆరంభం మాత్రమే. దేశం తరపున మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటున్నా
– అదితి స్వామి

బెర్లిన్: వరల్డ్ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో ఒకే రోజు భారత్ తరపున ఇద్దరు చాంపియన్‌లుగా నిలిచారు. శనివారం జరిగిన ఈ పోటీల కాంపౌండ్ విభాగంలో ముందుగా మహారాష్ట్రకు చెందిన అదితి గోపీచంద్ స్వామి అగ్రస్థానం సాధించింది. ఫైనల్లో 17 ఏళ్ల అదితి 149-147 స్కోరుతో మెక్సికోకు చెందిన ఆండ్రీయా బెసెరాపై విజయం సాధించింది. పురుషుల కాంపౌండ్ ఫైనల్లో ఓజస్ ప్రవీణ్ దేవ్‌తలే 150-147 తేడాతో ల్యూకాజ్ జిల్‌స్కీ (పోలాండ్)ను ఓడించాడు. వరల్డ్ జూనియర్ చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచిన నెల రోజుల్లోపే సీనియర్ విభాగంలోనూ అదితి విశ్వ విజేత కావడం విశేషం కాగా...టోర్నీ చరిత్రలో పురుషుల విభాగంలోనూ భారత్‌కు ప్రవీణ్ సాధించిందే తొలి స్వర్ణం. వీరిద్దరూ మహారాష్ట్ర సతారాలోని అకాడమీలో ఒకే చోట శిక్షణ పొందుతున్నారు. ఓవరాల్‌గా 3 స్వర్ణాలు, ఒక కాంస్యంతో (మొత్తం 4 పతకాలు) సాధించి భారత్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో తమ అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేసింది. శుక్రవారం భారత్ మహిళల టీమ్ విభాగంలో స్వర్ణం సాధించింది.

పూర్తి ఆధిపత్యం...

డిఫెండింగ్ చాంపియన్ సారా లోపెజ్‌ను ప్రీక్వార్టర్స్‌లో ఓడించిన బెసెరా, అదితి మధ్య ఫైనల్ పోటాపోటీగా సాగింది. తొలి మూడు బాణాలను సమర్థంగా సంధించిన అదితి మొదటి రౌండ్‌లోనే 30-29తో ఆధిక్యంలో నిలిచింది. నాలుగు రౌండ్‌లు ముగిసే సరికి 12 బాణాలను లక్ష్యం వద్దకు చేర్చిన అదితి మూడు పాయింట్లు ముందంజలో ఉంది. చివరి రౌండ్‌లో మాత్రం ఒక బాణంతో '9' మాత్రమే స్కోర్ చేసినా...అప్పటికే ఆమె విజేత కావడం ఖాయమైంది. శనివారం సెమీస్, ఫైనల్‌లోనూ 149 పాయింట్లు సాధించిన అదితి మొత్తం నాలుగు పాయింట్లు మాత్రమే కోల్పోయింది. ఫైనల్లో చివరి నాలుగు అవకాశాల్లోనూ ఆమె 30 పాయింట్లు సాధించడం విశేషం. పురుషుల విభాగంలో కూడా ప్రవీణ్ 'పర్‌ఫెక్ట్ స్కోర్'తో పసిడి గెలుచుకున్నాడు. ప్రవీణ్ ఎక్కడా ఎలాంటి పొరపాటు చేయకపోగా, ఒత్తిడిలో పడిన ల్యూకాజ్ చివర్లో ఒక పాయింట్ పోగొట్టుకొని రజతంతో సంతృప్తి చెందాడు.

జ్యోతి సురేఖకు కాంస్యం

ప్రపంచ చాంపియన్‌షిప్ వ్యక్తిగత విభాగంలో 2019లో కాంస్యం, 2021లో రజతం సాధించి ఈ సారి స్వర్ణంపై గురి పెట్టిన ఆంధ్రప్రదేశ్ ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖకు నిరాశ ఎదురైంది. కాంపౌండ్ విభాగంలో సురేఖ మూడో స్థానంలో నిలిచి కాంస్యం గెలుచుకుంది. సెమీ ఫైనల్లో సురేఖ 145 - 149 స్కోరుతో అదితి స్వామి చేతిలో ఓటమి పాలైంది. అయితే మూడో స్థానం కోసం జరిగిన పోరులో సురేఖ చక్కటి ప్రదర్శనతో 150 స్కోరు నమోదు చేసింది. ఆమె 150 - 146 స్కోరుతో తుర్కియేకు చెందిన ఐపెక్ తోమ్రుక్‌ను ఓడించింది. ఓవరాల్‌గా



ఆర్చరీ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో సురేఖకు ఇది ఎనిమిదో పతకం. టీమ్, వ్యక్తిగత విభాగాల్లో కలిపి ఆమె ఒక స్వర్ణం, 4 రజతాలు, 3 కాంస్యాలు గెలుచుకుంది.

గెలుపు బాట పడతారా!

- టీమిండియాపై ఒత్తిడి
- నేడు వెస్టిండీస్‌తో రెండో టి20 మ్యాచ్
- రా.గం. 8 నుంచి డీడీ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం



ప్రావిడెన్స్ (గయానా): వెస్టిండీస్‌పై టెస్టు, వన్డే సిరీస్ నెగ్గిన భారత్‌కు తొలి టి20లో అనూహ్య ప్రతిఘటన ఎదురైంది. సాధారణ లక్ష్యాన్నీ ఛేదించలేక చతికిలపడిన జట్టు ఓటమిని కొనితెచ్చుకుంది. ఈ నేపథ్యంలో మళ్లీ కోలుకొని స్థాయికి తగినట్లుగా సత్తా చాటడం అవసరం. ఇలాంటి స్థితిలో నేడు విండీస్‌తో రెండో టి20 మ్యాచ్‌కు హార్దిక్ సేన సిద్ధమైంది. తొలి టి20లా ఆదమరిస్తే మాత్రం ఇక్కడ కుదరదు. అందుకోసం నిలకడలేని బ్యాటింగ్ ఆర్డర్ మారాలి. స్పిన్ మ్యాజిక్, పేస్ పదును పెరగాలి. గత మ్యాచ్‌లా తేలిగ్గా తీసుకోకూడదు. సీనియర్లు రోహిత్, కోహ్లిలు ఆడకపోవడం వల్లే ఓటమంటే కుదరదు. ఎందుకంటే గత మ్యాచ్ బరిలోకి దిగిన వారంతా ఐదారేళ్లుగా ఐపీఎల్‌లో విశేషంగా రాణిస్తున్నవారే! ఐపీఎల్‌లో అతి తక్కువ అనుభవమున్న తిలక్‌వర్మే మొదటి మ్యాచ్‌లోనే చక్కగా ఆడితే... ఐపీఎల్ హిట్లర్లు ఇషాన్ కిషన్, గిల్, సూర్యకుమార్, సంజూ సామ్సన్, అక్షర్, హార్దిక్ పాండ్యా ఇంకెలా ఆడాలి. కాబట్టి సాకులు వెతక్కుండా బ్యాటర్లు తమ శైలిలో మెరుపులు మెరిపిస్తే పరుగులు, విజయం కష్టం కానేకాదు. ఇక విండీస్ విషయానికొస్తే చెసిన తక్కువ స్కోరునే నిలబెట్టుకొని మరీ ఈ సిరీస్‌లో శుభారంభం చేసింది. ప్రపంచ శ్రేణి టి20 స్పెషలిస్టులున్న విండీస్ ఇప్పుడు మరింత ఉత్సాహంతో బరిలోకి దిగుతోంది. ఈ నేపథ్యంలో ఒత్తిడంతా భారత్‌పైనే ఉంది. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలం కానీ మ్యాచ్‌కు వాన ముప్పు ఉంది.

ట్రాక్‌పై విషాదం

13 ఏళ్ల రేసర్ దుర్మరణం

చెన్నై: బెంగళూరుకు చెందిన 13 ఏళ్ల కుర్రాడు కొప్పారం శ్రేయస్ హరీశ్‌కు రేసింగే ప్రాణం. మోటార్‌సైకిల్ రేసింగ్‌లో బుల్లెట్‌లా దూసుకెళ్లే ఈ రైడర్ తన కలల్ని సాకారం చేసుకోకముందే కన్నవాళ్లకు కన్నీళ్లను మిగిల్చివెళ్లాడు. తనకెంతో ఇష్టమైన ట్రాకే అతని ప్రాణం తీసింది. రేసింగ్‌లో మెరికగా చిరుప్రాయంలోనే జాతీయ స్థాయిలో విజేతగా నిలిచిన ఈ టీనేజ్ కుర్రాడు శనివారం పోల్ పొజిషన్‌తో భారత జాతీయ మోటార్‌సైకిల్ రేసింగ్ చాంపియన్‌షిప్ పోటీలో పాల్గొన్నాడు. రేసు ప్రారంభమైన కాసేపటికే మెరుపు వేగంతో దూసుకెళ్తున్న అతని బైక్ 'టర్న్-1' (మలుపు) వద్ద అదుపుతప్పింది. వేగంతో ఉండటం, కిందపడగానే తలకు బలయమైన గాయాలు కావడంతో వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.



ఫైనల్లో ప్రణయ్

ఆస్ట్రేలియన్ ఓపెన్ బ్యాడ్మింటన్



సిడ్నీ: భారత స్టార్ షట్లర్ హెచ్.ఎస్. ప్రణయ్ ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిలే లక్ష్యంగా ఫైనల్లోకి ప్రవేశించాడు. బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్ల మధ్యే జరిగిన సెమీఫైనల్లో ప్రణయ్ వరుస గేముల్లో విజయం సాధించాడు. శనివారం జరిగిన పురుషుల సింగిల్స్ సెమీస్‌లో 31 ఏళ్ల ప్రణయ్ 21-18, 21-12తో సహచరుడు ప్రియాన్షు రజావత్‌పై అలవోక విజయం సాధించాడు. ఆదివారం జరిగే టైటిల్ పోరులో ప్రపంచ 9వ ర్యాంకర్ ప్రణయ్... చైనాకు చెందిన వెంగ్ హాంగ్‌యంగ్‌తో తలపడతాడు. మరో సెమీస్‌లో 24వ ర్యాంకర్ హాంగ్‌యంగ్ 21-19, 13-21, 21-13తో మలేసియాకు చెందిన 17వ ర్యాంకర్ లీ జి జియాపై పోరాడి గెలిచాడు. కాగా హాంగ్‌యంగ్‌పై భారత ఆటగాడికి టైటిల్ గెలిచిన అనుభవం వుంది. గత మేలో కౌలాలంపూర్‌లో జరిగిన మలేసియన్ మాస్టర్స్ సూపర్-500 టోర్నమెంట్‌లో అతన్ని ఓడించే ప్రణయ్ విజేతగా నిలిచాడు. ఈ సీజన్‌లో రెండో టైటిల్‌పై కన్నేసిన భారత షట్లర్ ఇపుడు అడుగు దూరంలో ఉన్నాడు.

సినిమా

దోస్త్ మేరా దోస్త్

ఫ్రెండ్‌షిప్ డే స్పెషల్

ప్రతి ఒక్కరి జీవిత పుస్తకంలో స్నేహానికి ముఖ్యమైన పేజీలు ఉంటాయి. స్నేహితులు లేనివాళ్లు దాదాపు ఉండరు. అసలు స్నేహం లేకుండా జీవితమే ఉండదంటే అతిశయోక్తి కాదు. కష్ట సుఖాల్లో దోస్త్ మేరా దోస్త్ అని చెప్పుకునే ఫ్రెండ్ ఒకరుంటే అంతకన్నా మించినది ఏం ఉంటుంది? కొన్ని సినిమాల్లో స్నేహానికి చాలా ప్రాధాన్యం ఉంటుంది. ఇలా వెండి తెరపై ప్రస్తుతం కొనసాగుతున్న కొందరు స్టార్స్ దోస్తీ గురించి తెలుసుకుందాం.



● ప్రభాస్ ● అల్లు అర్జున్ ● నాని ● పృథ్వీరాజ్ ● జగదీశ్ ● శ్రుతీహాసన్

సలార్ స్నేహం

అమ్మకు ఇచ్చిన మాట తాలూకు లక్ష్యం ఓ వైపు.. తన మిత్రుడి రక్షణ మరోవైపు... సలార్‌కి ఉన్న రెండు పెద్ద బాధ్యతలు ఇవి. ప్రభాస్ టైటిల్ రోల్‌లో ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'సలార్'. శ్రుతీహాసన్ నాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో పృథ్వీరాజ్ సుకుమారన్, జగపతిబాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. అమ్మకు ఇచ్చిన మాట, స్నేహితుణ్ణి రక్షించుకోవాల్సిన బాధ్యత.. ఈ రెండింటి మధ్య నలిగిపోయే హీరో పాత్రను ప్రభాస్ చేస్తున్నారని టాక్. అలాగే ఈ సినిమాలో ఫ్రెండ్‌షిప్‌కి సంబంధించి ఓ స్ట్రాంగ్ ఎపిసోడ్‌ను ప్రశాంత్ నీల్ డిజైన్ చేశారని, ఈ సన్నివేశాలు ప్రేక్షకుల హృదయాలను తాకే విధంగా ఉంటాయని సమాచారం. కాగా 'సలార్' కథలో పృథ్వీరాజ్ సుకుమారన్ పాత్రలో కాస్త నెగటివ్ షేడ్స్ ఉన్నప్పటికీ ప్రభాస్‌కు ఫ్రెండ్‌గా కనిపిస్తారని ఫిల్మ్‌నగర్ భోగట్టా. విజయ్ కిరగందూర్ నిర్మిస్తున్న ఈ చిత్రంలోని తొలి భాగం 'సలార్: సీజ్ ఫైర్' సెప్టెంబరు 28న రిలీజ్ కానుంది.

హాయ్ ఫ్రెండ్

స్నేహానికి ఏజ్‌తో, జెండర్‌తో పని లేదు. ఓ అమ్మాయి, ఓ అబ్బాయి మధ్య ఉండే స్నేహం నేపథ్యంలో చిరంజీవి 'ఇద్దరు మిత్రులు', వెంకటేశ్ 'వసంతం', సిద్ధార్థ్ 'ఓ.. మై ఫ్రెండ్' వంటి చిత్రాలు వచ్చాయి. తాజాగా ఈ జాబితాలో ఓ సినిమా చేరనుందని టాక్. అదే నాని హీరోగా నటిస్తున్న 'హాయ్ నాన్న'. ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, శ్రుతీహాసన్ కీలక పాత్ర చేస్తున్నారు. శ్రుతీది నాని ఫ్రెండ్ క్యారెక్టర్ అని, వీరి కాంబినేషన్ సీన్స్ బాగుంటాయని టాక్. శౌర్యువ్ దర్శకత్వంలో మోహన్ చెరుకూరి, డా. విజయేందర్ రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రం డిసెంబరు 21న విడుదల కానుంది.

పుష్పగాడి ఫ్రెండ్

'ఆర్య' సినిమాలో ప్రేమలోని ఓ కొత్త కోణాన్ని ప్రేక్షకుల ముందుకు తెచ్చారు హీరో అల్లు అర్జున్-దర్శకుడు సుకుమార్. అలాగే 'ఆర్య 2'లో ఫ్రెండ్‌షిప్‌లోని మరో కోణాన్ని చూపించింది ఈ కాంబినేషన్. ఇప్పుడు 'పుష్ప'తో మరోసారి స్నేహాన్ని చూపించారు. హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా 'పుష్ప'. ఇందులో పుష్పరాజ్ పాత్రలో అల్లు అర్జున్ నటించగా, ఆయన ఫ్రెండ్ కేశవగా జగదీష్ నటించారు. పుష్పరాజ్, కేశవల మధ్య ఉన్న స్నేహం ఆడియన్స్‌కు భలే అనిపిస్తుంటుంది. సినిమాలో పుష్ప చేసే ప్రతి పనిలో కేశవ ఉంటుంటాడు. ఫ్రెండ్‌కు పుష్పరాజ్ ఇచ్చే ఇంపార్టెన్స్ అది. పుష్పరాజ్, కేశవల బాండింగ్‌ను 'పుష్ప: ది రైజ్'లో కొంత చూశాం. అలాగే 'పుష్ప' మలి భాగం 'పుష్ప: ది రూల్'లోనూ వీరి ఫ్రెండ్‌షిప్ కొనసాగుతుంది. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న 'పుష్ప: ది రూల్' వచ్చే ఏడాది విడుదల కానుంది.

ఈ చిత్రాలే కాదు.. మరికొన్ని చిత్రాలు కూడా స్నేహం ఓ ప్రధానాంశంగా తెరకెక్కుతున్నాయి.

ట్రైలర్ ఎమోషనల్‌గా ఉంది

– నాగార్జున

"మిస్టర్ ప్రెగ్నెంట్' అనగానే మగవాళ్లు ఎలా ప్రెగ్నెంట్ అవుతారు? ఆ అంశాన్ని ఎలా చూపించారు? అనే ఇంట్రస్ట్ క్రియేట్ అయ్యింది. ట్రైలర్ చూశాక సినిమా చూడాలనే ఆసక్తి ఏర్పడింది. ట్రైలర్ ఎమోషనల్‌గా చాలా బాగుంది'' అన్నారు నాగార్జున. సోహైల్, రూపా కొడవయూర్ జంటగా శ్రీనివాస్ వింజనంపాటి దర్శకత్వంలో అప్పిరెడ్డి, రవిరెడ్డి సజ్జల, వెంకట్ అన్నపరెడ్డి నిర్మిస్తున్న చిత్రం 'మిస్టర్ ప్రెగ్నెంట్'. శనివారం జరిగిన ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన నాగార్జున మాట్లాడుతూ– ''సోహైల్ ఈ సినిమాను పట్టుదలతో చేశాడనిపిస్తోంది. శ్రీనివాస్‌కు ఇది తొలి సినిమానే అయినా డిఫికల్ట్ సబ్జెక్ట్‌ను బాగా తెరకెక్కించాడని అర్థమవుతోంది. ఈ సినిమా హిట్ అవ్వాలి'' అన్నారు. ''మిస్టర్ ప్రెగ్నెంట్'లో ఎమోషన్, ఎంటర్‌టైన్‌మెంట్ రెండూ ఉంటాయి'' అన్నారు సోహైల్. ''ఎంతోమంది ప్రతిభావంతులను పరిచయం చేసిన ఘనత నాగార్జున గారికే దక్కింది'' అన్నారు రవిరెడ్డి సజ్జల. ''యూనిక్ కాన్సెప్ట్‌తో ఈ సినిమా చేశాం'' అన్నారు వెంకట్ అన్నపరెడ్డి. ''మహిళా ప్రేక్షకులు ఈ సినిమాను ఆదరించాలి'' అన్నారు అప్పిరెడ్డి. ''డెలివరీ కోసం అమ్మ పడే కష్టాన్ని తీసుకున్న ఓ నాన్న కథ ఇది'' అన్నారు శ్రీనివాస్ వింజనంపాటి.



● సోహైల్, నాగార్జున, రూపా కొడవయూర్

చంద్రముఖి

ఆత్మవిశ్వాసం.. ఆత్మాభిమానం.. ఎదురులో ఉన్నది రాజు అయినా ఎదిరించి నిలబడే ధైర్యం.. ఈ లక్షణాలన్నీ ఉన్న చంద్రముఖిగా కనిపించనున్నారు కంగనా రనౌత్. రజనీకాంత్, నయనతార, ప్రభు, జ్యోతిక కాంబినేషన్‌లో పి. వాసు తెరకెక్కించిన 'చంద్రముఖి' సీక్వెల్ 'చంద్రముఖి 2'లో కంగనా టైటిల్ రోల్ చేశారు. శనివారం ఆమె లుక్‌ని విడుదల చేశారు. కంగనా కాస్ట్యూమ్స్‌ని ప్రముఖ బాలీవుడ్ డిజైనర్ నీతు లుల్లా డిజైన్ చేశారు. రాఘవా లారెన్స్ లీడ్ రోల్‌లో పి. వాసు దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందింది. సుభాస్కరన్ నిర్మించిన ఈ చిత్రానికి ఎం.ఎం. కీరవాణి సంగీతం అందించగా, ఆర్.డి. రాజశేఖర్ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరించారు. 'చంద్రముఖి 2' వినాయక చవితి సందర్భంగా సెప్టెంబర్‌లో రిలీజ్ కానుంది.



● కంగనా రనౌత్

నవ్వించే ప్రేమ్‌కుమార్

సంతోష్ శోభన్, రాశీ సింగ్, రుచిత సాధినేని హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ప్రేమ్ కుమార్'. రైటర్ అభిషేక్ మహర్షి దర్శకత్వంలో శివ ప్రసాద్ పన్నీరు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 18న విడుదల కానుంది. ఈ సందర్భంగా జరిగిన విలేకర్ల సమావేశంలో సంతోష్ శోభన్ మాట్లాడుతూ– ''దర్శక-నిర్మాతలు నమ్మడంవల్లే ఈ సినిమా ఇంత దూరం వచ్చింది. నా సినిమాల్లో నటించిన అభిషేక్ దర్శకుడు అవుతాడని ఊహించలేదు. భవిష్యత్‌లో హ్యూమర్‌కి తనో బ్రాండ్ అవుతాడనిపిస్తోంది. 'ప్రేమ్‌కుమార్' రెండు గంటలు నవ్వించే చిత్రమవుతుంది'' అన్నారు. ''ఈ సినిమా చూస్తున్నప్పుడు మన ఫ్రెండ్స్ గుర్తొస్తారు. బయట మనం ఎలా ఉంటామో అవే పాత్రలను ఈ సినిమాలో చూస్తాం'' అన్నారు అభిషేక్ మహర్షి. ''ప్రేక్షకులను నవ్వించాలని చేసిన సినిమా ఇది'' అన్నారు శివ ప్రసాద్.



● సంతోష్ శోభన్, రాశీ సింగ్

వెనక్కి తిరిగి చూసుకుంటే ఫీలవ్వకూడదు!

– కీర్తి సురేష్

"నాకు ఒక సిస్టర్ ఉంది. బ్రదర్‌లాంటి ఫ్రెండ్ ఒకరు ఉన్నారు. 'భోళా శంకర్' చేశాక మెహర్ రమేష్‌లాంటి అన్నయ్య దొరికారు" అన్నారు కీర్తి సురేష్. చిరంజీవి టైటిల్ రోల్‌లో మెహర్ రమేష్ దర్శకత్వంలో రామబ్రహ్మం సుంకర నిర్మించిన చిత్రం 'భోళా శంకర్'. చిరంజీవి సరసన తమన్నా నటించగా, ఆయన చెల్లెలి పాత్రను కీర్తీ సురేష్ చేశారు. ఈ నెల 11న ఈ చిత్రం రిలీజ్ కానున్న సందర్భంగా కీర్తీ సురేష్ చెప్పిన విశేషాలు.

● 'భోళా శంకర్'లో చిరంజీవిగారి చెల్లెలి ఆఫర్ వచ్చినప్పుడు రజనీకాంత్‌గారి చెల్లెలిగా చేసిన 'అన్నాత్తే' ('పెద్దన్న') పూర్తి చేశాను. అందుకే వెంటనే చెల్లెలిగా అంటే ఫర్వా లేదా? అని మెహర్ రమేష్‌గారితో అన్నాను. అయినప్పటికీ సూపర్ స్టార్ రజనీకాంత్‌గారికి చెల్లెలిగా నటించిన వెంటనే మెగాస్టార్ చిరంజీవిగారి చెల్లెలిగా అంటే ఇంకేం కావాలి? అనిపించింది. దాంతో పాటు చిరంజీవిగారితో ఒక్క ఫ్రేమ్‌లో అయినా డ్యాన్స్ చేయాలనుకున్న నాకు రెండు పాటలు చేసే చాన్స్ స్క్రిప్ట్‌లో ఉంది. మెహర్ రమేష్‌గారు నా క్యారెక్టర్‌ని కూడా బాగా డిజైన్ చేశారు. ● మా అమ్మ (మేనక) గతంలో చిరంజీవిగారి సరసన 'పున్నమి నాగు'లో నటించారు. అప్పుడు చిరంజీవిగారు తీసుకున్న కేర్, ఆయన ఇచ్చిన సలహాల గురించి అమ్మ ఇప్పుడు నాతో చెప్పారు. అవి చిరూగారితో చెబితే.. 'ఈ సలహాలు కూడా ఇచ్చాను' అంటూ అమ్మ చెప్పనివి కూడా చెప్పారు. ఇన్నేళ్లయినా ఆయన గుర్తుంచుకోవడం ఆశ్చర్యం అనిపించింది. ఇప్పుడు నా విషయంలోనూ కేర్ తీసుకున్నారు. అయితే 'మీ అమ్మలా నువ్వు అమ్మాయకురాలివి కాదు... చాలా స్మార్ట్' అని నవ్వుతూ అన్నారు. ఆయన ఇంటి నుంచే నాకు ఫుడ్ వచ్చేది. ఈ సినిమా రూపంలో నాకో మంచి ఫ్రెండ్ (చిరంజీవిని ఉద్దేశించి) దొరికారు.

● రెగ్యులర్ కమర్షియల్ చిత్రాల్లో హీరోయిన్‌గా, లేడీ ఓరియంటెడ్ సినిమాల్లో లీడ్‌గా, చెల్లెలి క్యారెక్టర్లు.. ఇలా పలు వేరియేషన్స్ ఉన్నవి చేస్తున్నాను. ఇలా చేయడం అంత ఈజీ కాదు. అయితే ఓ పదేళ్ల తర్వాత వెనక్కి తిరిగి చూసుకుంటే మనం ఇలాంటివి చేయలేదే అని ఫీల్ కాకూడదు. అందుకే అన్ని రకాల సినిమాలు చేస్తున్నాను.



తప్పుడు ప్రచారం జరుగుతోంది

– ప్రతాని రామకృష్ణ గౌడ్

''తెలంగాణ ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్' (టీఎఫ్‌సీసీ) చైర్మన్ ప్రతాని రామకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో సెప్టెంబరులో దుబాయ్‌లో నిర్వహించాలనుకుంటున్న టీఎఫ్‌సీసీ నంది అవార్డ్స్ ఫంక్షన్‌కు, తమకు సంబంధం లేదని, టీఎఫ్‌సీసీకి ప్రభుత్వ గుర్తింపు లేదని తెలుగు, తెలంగాణ చలన చిత్ర వాణిజ్య మండలి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశాయి. ఈ విషయంపై శనివారం టీఎఫ్‌సీసీ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ గౌడ్ స్పందిస్తూ– ''మాపై తప్పుడు ప్రచారం జరుగుతోంది. సౌత్ ఇండియాలోని ఆర్టిస్టులకు అవార్డులు ఇవ్వనున్నాం. దీన్ని కాదనే హక్కు దామోదర ప్రసాద్, సునీల్ నారంగ్‌లకు లేదు. 'టీఎఫ్‌సీసీ' పేరుతో ట్రేడ్ మార్క్, టీఎఫ్‌సీసీ నంది అవార్డ్స్ రిజిస్ట్రేషన్ చేయించాం. టీఎఫ్‌సీసీ నంది ఈవెంట్స్ పేరుతో దుబాయ్ ప్రభుత్వం నుండి లైసెన్స్ తీసుకున్నాం. సెప్టెంబర్ 28న దుబాయ్‌లో టీఎఫ్‌సీసీ నంది అవార్డుల వేడుక జరుగుతుంది. తెలంగాణ ప్రభుత్వం టీఎఫ్‌సీసీ నంది అవార్డులకు అనుమతితో కూడిన లెటర్ కూడా ఇచ్చింది'' అన్నారు.

హీరోయిన్‌గా...

బాల నటిగా పలు చిత్రాల్లో నటించిన ఆని కథానాయికగా పరిచయమవుతున్న చిత్రం 'తికమక తాండ'. రామక్రిష్ణ, హరిక్రిష్ణ హీరోలుగా బాలవెంకట్ దర్శకత్వంలో తిరుపతి శ్రీనివాసరావు నిర్మించిన ఈ చిత్రం రిలీజ్‌కు రెడీ అవుతోంది. ''1990లో గ్రామీణ నేపథ్యంలో సాగే కథ ఇది. ఓ సమస్య వల్ల ఒక గ్రామ ప్రజలు మతిమరుపుతో బాధపడుతుంటారు. దాన్నుంచి ఎలా బయటపడ్డారనే అంశంతో ఈ చిత్రం ఉంటుంది'' అన్నారు దర్శక-నిర్మాతలు.



● ఆని

ఆంధ్రజ్యోతి ఎండీ, జేసీ ప్రభాకర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి

పోలీసులకు నాయీ బ్రాహ్మణుల ఫిర్యాదు

బంజారాహిల్స్ (హైదరాబాద్): నాయీ బ్రాహ్మణులను కించపరిచే విధంగా మాట్లాడిన ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణ, టీడీపీ నేత జేసీ ప్రభాకర్‌రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా నాయీ బ్రాహ్మణ యువకులు ఫిలింనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గత ఆదివారం ఏబీఎన్‌లో ప్రసారమైన ఓపెన్ హార్ట్ విత్ ఆర్కే కార్యక్రమంలో రాధాకృష్ణ, మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డితో నిర్వహించిన ఇంటర్వ్యూ లో నాయీ బ్రాహ్మణులను కించపరిచే విధంగా మాట్లాడారని ఆ యువకులు ఆరోపించారు. ఈ చర్య ఆరుకోట్ల మంది ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం విడుదల చేసిన జీవోకు విరుద్ధంగా ఉందన్నారు. ప్రభుత్వ జీవో ప్రకారం నాయీబ్రాహ్మణులను కులం పేరుతో, హేళన చేస్తూ మాట్లాడవద్దని తెలిపారు. ఈ నేపథ్యంలో రాధాకృష్ణ, ప్రభాకర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

7న ఢిల్లీలో చేనేతల 'హ్యాండ్లూమ్ మార్చ్'

సాక్షి, న్యూఢిల్లీ: వస్త్రమే అస్త్రంగా చేనేతల ఉద్యమం దేశ రాజధాని ఢిల్లీకి చేరుకుంటోంది. చేనేతపై జీఎస్టీని తొలగించాలని జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఈ నెల 7న ఎర్రకోట నుంచి రాజ్‌ఘాట్ వరకు హ్యాండ్లూమ్ మార్చ్ నిర్వహించనున్నట్లు జాతీయ చేనేత దినోత్సవ రూపకర్త, అఖిల భారత పద్మశాలి సంఘం చేనేత విభాగం అధ్యక్షుడు యర్రమాద వెంకన్న నేత తెలిపారు. అదేరోజు మధ్యాహ్నం కానిస్టిట్యూషన్ క్లబ్‌లో చేనేత డిక్లరేషన్‌పై రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ ఏర్పాటు చేస్తున్నట్లు శనివారం ఆయన ఢిల్లీలో మాట్లాడుతూ చెప్పారు.

గురుకుల టీచర్లపై మానసిక ఒత్తిడి తగ్గించాలి

టీఎస్ యూటీఎఫ్ మహాధర్నాలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: గురుకుల పాఠశాలల్లో ఉపాధ్యాయులపై మానసిక ఒత్తిడి తగ్గించాలని, శ్రమకు తగిన వేతనాలు ఇవ్వాలని, అన్ని గురుకులాల్లో ఏకరూప పాలన అమలు చేయాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో అన్ని సంక్షేమ గురుకుల విద్యాసంస్థల ఉపాధ్యాయులు శనివారం హైదరాబాద్‌లో మహాధర్నా నిర్వహించారు. నర్సిరెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్టు ఉపాధ్యాయుల ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని, తాత్కాలిక ఉపాధ్యాయులకు బేసిక్ పే ఇవ్వాలని, బీసీ గురుకులాల సమయాలను ఇతర సొసైటీలతో సమానంగా మార్చాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి మాట్లాడుతూ అన్ని గురుకులాలకు కామన్ డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలని, జీవో 317 అమలుపై వివాదాలను, అభ్యంతరాలను సానుకూలంగా పరిష్కరించాలని, బదిలీలు, పదోన్నతులను చేపట్టాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మహాధర్నాకు సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.జంగయ్య, కోశాధికారి టి.లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం కింద 97,170 ఎకరాలకు సాగునీరు



- ప్రాజెక్టుల కింద 13,16,557 ఎకరాల ఆరుతడి..
- 23,64,530 ఎకరాల వరికి నీటి సరఫరా
- సాగునీటి ప్రణాళిక కమిటీ నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: ప్రస్తుత వానాకాలంలో కాళేశ్వరం ఎత్తిపోతల పథకం కింద 97,170 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. శుక్రవారం రాష్ట్ర నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ సి.మురళీధర్ అధ్యక్షతన రాష్ట్ర స్థాయి సాగునీటి విడుదల ప్రణాళిక కమిటీ సమావేశమై వానాకాలంలో వివిధ ప్రాజెక్టుల కింద ఆయకట్టుకు నీటి విడుదలపై నిర్ణయం తీసుకుంది. గోదావరి పరీవాహక ప్రాంతంలోని జలాశయాలన్నీ నిండి ఉన్న నేపథ్యంలో వాటి కింద పూర్తి స్థాయి ఆయకట్టుకు సాగునీరు అందించాలని నిర్ణయించింది. కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులు ఇంకా నిండకపోవడంతో ఎగువ నుంచి వస్తున్న వరదలను పరిగణనలోకి తీసుకుని ఆయకట్టుకు సాగునీరు విడుదల చేయనున్నారు. రాష్ట్రంలోని భారీ ప్రాజెక్టుల కింద 36.81లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించనున్నారు. రాష్ట్రంలో 13,16,557 ఎకరాల ఆరుతడి, 23,64,530 ఎకరాల వరి పంటకు కలిపి మొత్తం 342.43 టీఎంసీలు సరఫరా చేయనున్నారు. కాళేశ్వరం కింద 71600 ఎకరాల వరి, 25570 ఎకరాల ఆరుతడి పంటలు కలిపి మొత్తం 97,170 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాలని కమిటీ ప్రతిపాదించింది.

ప్రాజెక్టు	ఆరుతడి	వరి	మొత్తం
మధ్యమానేరు	15580	34720	50300
ఎస్సారెస్పీ-1	280118	623914	904032
కడెం	4770	49068	53838
అలీసాగర్	1880	34720	50300
రాజారాం గుత్ప	16525	20100	36625
నిజాంసాగర్	2850	121404	12454
జూరాల	24728	84568	109296
ఆర్డీఎస్	40000	15000	55000
మూసీ	–	3000	3000
ఎల్లంపల్లి-2	0	46716	46716
సింగూరు	4000	0	4000
దేవాదుల	5600	30000	35600
కోయిల్‌సాగర్	5600	30000	35600
రాజీవ్ బీమా	89767	58210	147977
నెట్టంపాడు	95000	25000	120000
కల్వకుర్తి	238851	55000	293851
ఎస్ఎల్‌బీసీ	238851	160716	255958
ఎస్ఆర్ఎస్పీ-2	74448	284362	358810
కొమురంభీం	11000	7000	18000
కాళేశ్వరం	25570	71600	97170
మొత్తం	**1316557**	**2364530**	**3681087**

తెలుగు వర్సిటీని అంతర్జాతీయ స్థాయిలో నిలపాలి

జస్టిస్ ఎన్వీ రమణ


నాంపల్లి (హైదరాబాద్): దేశంలో సంస్కృత, హిందీ, పాశ్చాత్య భాషలకు కేంద్రీయ విశ్వవిద్యాలయాలు ఏర్పడినట్లుగా తెలుగు భాషకు కూడా జాతీయ స్థాయిలో ఒక విశ్వవిద్యాలయం ఏర్పడితే తప్ప తెలుగు భాషా, సంస్కృతిని విస్తృత స్థాయిలో భవిష్యత్ తరాలకు అందించలేమని సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ ఎన్వీ రమణ అభిప్రాయపడ్డారు. శనివారం తెలుగు వర్సిటీ ఎన్టీఆర్ కళా మందిరంలో ఏర్పాటు చేసిన మండలి వెంకటకృష్ణారావు సంస్కృతీ పురస్కార ప్రదానోత్సవ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. తెలుగు వర్సిటీ ఆశించిన స్థాయిలో లేదని అసంతృప్తిని వ్యక్తం చేశారు. నగర శివార్లలోని బాచుపల్లిలో వందెకరాల విస్తీర్ణంలో ఏర్పాటు కాబోతున్న తెలుగు విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయ విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు తెలుగు భాషపై మక్కువ కలిగిన, భాషకు ఎనలేని కృషి చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చొరవ తీసుకోవాలని కోరారు. సభకు అధ్యక్షత వహించిన వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్‌రావు మాట్లాడుతూ... రాష్ట్రేతర తెలుగు సంస్థలకు తెలుగు విశ్వవిద్యాలయం తెలుగు భాషా సంస్కృతి ఔన్నత్యాన్ని పెంచే సాహిత్యాన్ని అందజేయడమే కాకుండా ఆయా సంస్థలతో ఒప్పందం చేసుకుని తెలుగు భాష, బోధన, పరివ్యాప్తికి కృషి చేస్తున్నదని అన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ... శాస్త్రీయ విజ్ఞానం మాతృ భాషలో విద్యార్థులకు అందుబాటులో ఉంచితే దేశం మరింత అభివృద్ధి సాధిస్తుందని పేర్కొన్నారు. ఆత్మీయ అతిథిగా హాజరైన మండలి బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ... ఉభయ తెలుగు రాష్ట్రాలలోని తెలుగు వారికన్నా ప్రవాసాంధ్రులకే తెలుగు భాషపై మక్కువ ఎక్కువని అన్నారు. జర్మనీ మాజీ ఎంపీ డాక్టర్ జి.రవీంద్ర కార్యక్రమంలో పాల్గొని తెలుగులో మాట్లాడి సభికులను ఆకట్టుకున్నారు. అంతర్జాతీయంగా తెలుగు భాషా సంస్కృతి, ఆధ్యాత్మిక వికాసానికి చిరస్మరణీయమైన సేవలందిస్తున్న లండన్‌లోని యునైటెడ్ కింగ్‌డమ్ తెలుగు అసోసియేషన్ (యుక్తా) సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సత్యప్రసాద్ కిల్లీకి మండలి వెంకట కృష్ణారావు సంస్కృతి పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి మండలి వెంకటకృష్ణారావు తెలుగు కేంద్రం సంచాలకులు ఆచార్య వై.రెడ్డి శ్యామల సమన్వయకర్తగా వ్యవహరించగా, సంస్థ కో ఆర్డినేటర్ డాక్టర్ విజయ్‌పాల్ పాత్లోత్ వందన సమర్పణ చేశారు.



సత్యప్రసాద్‌కు పురస్కారాన్ని అందజేస్తున్న జస్టిస్ ఎన్వీ రమణ. చిత్రంలో బోయినపల్లి వినోద్‌కుమార్, మండలి బుద్ధప్రసాద్ తదితరులు

ఎస్సీ వర్గీకరణ జోలికొస్తే బీజేపీకి గుణపాఠం

మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య



పంజగుట్ట: సుప్రీంకోర్టు తీర్పును కూడా లెక్కచేయకుండా బీజేపీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అంశాన్ని భుజాన వేసుకోవడం సరికాదని, వర్గీకరణ జోలికి వస్తే ఊరుకోబోమని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మాల మహానాడు జాతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఓటు ద్వారా బీజేపీకి గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. దళితులు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో ముందుండాలని అంబేడ్కర్ కోరుకున్నారని, కానీ కొందరు వర్గీకరణ పేరుతో దళితుల మధ్య చిచ్చుపెట్టడం సరికాదన్నారు. త్వరలోనే ఢిల్లీ వెళ్లి అన్ని పార్టీల ఎంపీలు, అధ్యక్షులతో సమావేశమై వినతిపత్రాలు ఇస్తామన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి మన్నె శ్రీధర్‌రావు, నేతలు శ్రీనివాస్, పద్మాకర్, హరినాథ్, రామచందర్ పాల్గొన్నారు.

8న యాదవ గర్జన: రాములు యాదవ్

పంజగుట్ట (హైదరాబాద్): యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రతీ సంవత్సరం బడ్జెట్‌లో రూ.10 వేల కోట్లు కేటాయించాలని జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములుయాదవ్ డిమాండ్ చేశారు. యాదవులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈనెల 8న ఇందిరాపార్క్ వద్ద 'యాదవ గర్జన' నిర్వహి స్తున్నట్లు ఆయన తెలిపారు. యాదవ గర్జన పోస్టర్‌ను శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సమితి రాష్ట్ర అధ్యక్షుడు శెట్టి వంశీమోహన్ యాదవ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీలో యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేశారని, తెలంగాణలో ఎన్నో ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నా కార్పొరేషన్ ఏర్పాటు చేయడంలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో 20 శాతం జనాభా ఉన్న యాదవులకు అన్ని పార్టీలు 22 ఎమ్మెల్యే, 4 ఎంపీ, 7 నామినేటెడ్ ఎమ్మెల్సీ, 3 రాజ్యసభ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

జయశంకర్ ఆశయాలను నెరవేరుస్తున్నాం: కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఏర్పాటే లక్ష్యంగా, స్వరాష్ట్ర సాధన కోసం తన చివరి శ్వాస వరకు పోరాడిన ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్మరణీయులుగా ఉంటారని సీఎం కేసీఆర్ కొనియాడారు. శనివారం జయశంకర్ జయంతిని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర సాధనకోసం ఆయన చేసిన త్యాగం, సేవలను కేసీఆర్ గుర్తుచేసుకున్నారు. సకల జనుల సంక్షేమం, సబ్బండ వర్గాల సమానత్వం కోసమే తెలంగాణ స్వరాష్ట్రమని తెలిపిన జయశంకర్ ఆశయాలను తెలంగాణ ప్రభుత్వం ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నదని తెలిపారు. తొమ్మిదేళ్లలో సాగునీటిరంగం, వ్యవసాయం, విద్యా, వైద్యం వంటి పలు రంగాల్లో అభివృద్ధిని సాధిస్తూ దేశానికే ఆదర్శంగా తెలంగాణ పాలన సాగుతోందన్నారు. వ్యవసాయరంగం నుంచి ఐటీ వరకు అన్నింటా తెలంగాణ అగ్రగామిగా నిలుస్తుందన్నారు.

జిల్లా కలెక్టర్లకు వీఆర్ఏల రిలీవింగ్ ప్రొఫార్మాలు

సాక్షి, హైదరాబాద్: పలు ప్రభుత్వశాఖల్లో గ్రామరెవెన్యూ సహాయకుల(వీఆర్ఏ) విలీనానికి మార్గదర్శకాలు విడుదల చేసిన ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. వారి అపాయింట్మెంట్, రిలీవింగ్ ఆర్డర్ల ప్రొఫార్మాలను రాష్ట్ర రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిత్తల్ శనివారం అన్ని జిల్లాల కలెక్టర్లకు పంపారు. 61 ఏళ్లు నిండిన వీఆర్ఏల కుమారుడు లేదా కుమార్తెకు కారుణ్య ఉద్యోగం ఇచ్చేందుకు వీలుగా సదరు వీఆర్ఏల నుంచి తీసుకోవాల్సిన హామీ పత్రం ప్రొఫార్మాను కూడా పంపుతూ మిత్తల్ ఉత్తర్వులు జారీచేశారు.

నిత్యాన్నదానం ప్రారంభం



బంజారాహిల్స్(హైదరాబాద్): జూబ్లీహిల్స్ టీటీడీ శ్రీవారి ఆలయంలో నిత్యాన్నదాన కార్యక్రమాన్ని శనివారం ఆలయ నిర్వాహకులు ప్రారంభించారు. ఇక నుంచి ప్రతి రోజూ మధ్యాహ్నం వేళలో అన్నదానం ఉంటుందన్నారు. శని, ఆదివారాలతో పాటు ప్రత్యేక రోజుల్లో 2 వేల మంది వరకు, సాధారణ రోజుల్లో 500 మంది వరకు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు.

చార్మినార్, గోల్కొండకు | యునెస్కో గుర్తింపు కోసం కృషి

- ఆ మేరకు ప్రతిపాదనలు పంపాం: కిషన్‌రెడ్డి
- చార్మినార్‌కు ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ ప్రారంభం



చార్మినార్ వద్ద కేంద్ర, రాష్ట్ర పర్యాటక శాఖల మంత్రులు జి.కిషన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

దూద్‌బౌలి: చార్మినార్, గోల్కొండలకు యునెస్కో గుర్తింపు కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, అందుకు సంబంధించిన ప్రతిపాదనలను పంపామని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. శనివారం చార్మినార్ కట్టడానికి శాశ్వతంగా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పర్యాటకులను మరింతగా ఆకర్షించే విధంగా గోల్కొండ కట్టడానికి సైతం శాశ్వత ఇల్యూమినేషన్ చేస్తున్నామని దాన్ని వచ్చే నెలలో ప్రారంభిస్తామని వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం భూమి కేటాయించగానే హైదరాబాద్ నగరంలో నేషనల్ సైన్స్ సెంటర్‌ను ప్రారంభిస్తామని చెప్పారు. సాలార్‌జంగ్ మ్యూజియంలో ఐదు నూతన బ్లాక్‌లను ఏర్పాటు చేశామని... వాటిని త్వరలో ప్రారంభిస్తామన్నారు.

హైటెక్ సిటీలో సంగీత నాటక అకాడమీ హాల్

హైదరాబాద్‌లో ట్రైబల్ మ్యూజియం ఏర్పాటుతో పాటు వరంగల్ కోటకు సైతం త్వరలో పర్యాటకులను ఆకర్షించే విధంగా శాశ్వత విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటు చేస్తామని కిషన్‌రెడ్డి తెలిపారు. శిథిలావస్థకు చేరుకున్న వరంగల్ వేయి స్తంభాల గుడిని సైతం పున:నిర్మాణం చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు. త్వరలో హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో సంగీత నాటక అకాడమీ హాల్‌ను ప్రారంభించనున్నామన్నారు. తెలంగాణ పర్యాటకం, ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పర్యాటక స్థలాలను కేంద్ర ప్రభుత్వం సహకారంతో అభివృద్ధి పరుస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండియా అడిషనల్ డైరెక్టర్ జాన్వీ శర్మతో పాటు వినయ్ కుమార్ మిశ్రా, చంద్రకాంత్ కుమార్, మాజీ ఎమ్మెల్యే చింతల రాంచందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విధుల్లోకి మొదటి బ్యాచ్ అగ్నివీర్‌లు

సాక్షి, హైదరాబాద్: భారత సైన్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన అగ్నివీర్‌ల మొదటి బ్యాచ్ శిక్షణ పూర్తయింది. హైదరాబాద్ ఆర్టిలరీ సెంటర్ నుంచి శనివారం మొత్తం 177 మంది అగ్నివీర్‌లు 1ఈఎంఈ (ఎలక్ట్రానిక్ అండ్ మెకానికల్ ఇంజనీర్స్) సెంటర్ నుంచి, హైదరాబాద్ ఆర్టిలరీ సెంటర్ నుంచి 2,098 మంది అగ్నివీర్‌లు విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకుని, పాసింగ్ ఔట్ పరేడ్‌లో పాల్గొన్నట్లు అధికారులు తెలిపారు. జనవరి 2023లో ఈ మొదటి బ్యాచ్ శిక్షణ ప్రారంభమైంది. శనివారం రెండు ప్రాంతాల్లో నిర్వహించిన పాసింగ్ ఔట్ పరేడ్‌కు 1ఈఎంఈ సెంటర్‌లో 1ఈఎంఈ కమాండెంట్ సురేశ్, ఆర్టిలరీ సెంటర్‌లో నిర్వహించిన పరేడ్‌కు ఆర్టిలరీ సెంటర్ కమాండెంట్ బ్రిగేడియర్ రాజీవ్ చౌహాన్‌లు పరేడ్ పర్యవేక్షణ అధికారులుగా పాల్గొన్నారు.

నేతన్నల కోసం 'తెలంగాణ చేనేత మగ్గం'

- పిట్ లూమ్స్‌ను ఫ్రేమ్ లూమ్స్‌గా ఆధునీకరించేందుకు ప్రత్యేక కార్యక్రమం
- ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ఆధ్వర్యంలో నేతన్నలకు సమగ్ర బీమా: మంత్రి కేటీఆర్
- 7న చేనేత దినోత్సవం నాడు సంబురాలు నిర్వహించాలని ప్రజాప్రతినిధులకు లేఖ

సాక్షి, హైదరాబాద్: నేత కార్మికుల అభివృద్ధి, సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కె. తారక రామారావు తెలిపారు. ఈ నెల 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను ప్రకటించనుందని చెప్పారు. ప్రస్తుతం ఉన్న పిట్ లూమ్స్‌ను ఫ్రేమ్ లూమ్స్‌గా ఆధునీకరించేందుకు 'తెలంగాణ చేనేత మగ్గం'పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని కేటీఆర్ పేర్కొన్నారు. చేనేత మిత్ర కార్యక్రమాన్ని సులభతరం చేయడంతోపాటు ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ఆధ్వర్యంలో నేతన్నలకు సమగ్ర ఆరోగ్య బీమా కార్యక్రమాన్ని చేపడతామన్నారు. నేతన్నకు బీమా కార్యక్రమాన్ని ఈ సంవత్సరం కూడా కొనసాగిస్తామని పేర్కొన్నారు. హైదరాబాద్ శిల్పారామంలో హ్యాండీక్రాఫ్ట్ మ్యూజియం, ఉప్పల్ భగాయత్‌లో కన్వెన్షన్ సెంటర్‌కు శంకుస్థాపన చేస్తామని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా చేనేత వారోత్సవాలు నిర్వహిస్తామని.. హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజాలో చేనేత వస్త్ర ఉత్పత్తుల ప్రదర్శన కొనసాగుతుందన్నారు. అలాగే ప్రజాప్రతినిధులంతా రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున సంబురాలు నిర్వహించాలని.. నేతన్నలతో ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ మేరకు శనివారం లేఖ రాశారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.